

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 147

శనివారం 11-2-2023


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




రేసింగ్ @ హైదరాబాద్
ఫార్ములా–ఈ పోరుకు సన్నాహాలు పూర్తి.. మధ్యాహ్నం 3 నుంచి రేసు - 12లో




కెమెరా ముందు కుడితే..
కత్తెర, టేప్‌తో ఓ మహిళ సాధించిన విజయంపై కథనం - 11లో



కశ్మీర్‌లో భారీగా లిథియం
జమ్మూకశ్మీర్‌లో లిథియం నిల్వలు భారీగా (దాదాపు 59 లక్షల టన్నులు) ఉన్నాయని కేంద్ర గనుల శాఖ తెలిపింది.
వివరాలు 6లో ▸



బీబీసీ నిషేధంపై పిటిషన్ కొట్టివేత
దేశంలో బీబీసీపై పూర్తి స్థాయిలో నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.
వివరాలు 6లో ▸



క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా
రష్యా మరోసారి దాడులు తీవ్రతరం చేసింది. ఉక్రెయిన్‌లోని కీలక పారిశ్రామిక ప్రాంతం డోన్‌బాస్‌పై క్షిపణులతో విరుచుకుపడింది.
వివరాలు 6లో ▸



పాత బడ్జెట్ చదివిన గెహ్లోత్
ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ అసెంబ్లీలో పొరపాటున గతేడాది బడ్జెట్ వివరాలను చదివారు.
వివరాలు 6లో ▸

చదువే దివ్యాస్త్రం

పేదవాడి తల రాతలో మార్పు ఖాయం

పెళ్లిళ్ల కోసం ఆగొచ్చు కానీ, చదువు కోసం ఆగకూడదు

- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు శ్రీకారం చుడుతూ సీఎం జగన్
- 4,536 మంది లబ్ధిదారులకు రూ.38.18 కోట్లు జమ
- వచ్చే త్రైమాసికం నుంచి ఈ డబ్బులు పెళ్లి కూతుళ్ల తల్లుల ఖాతాల్లో వేస్తాం
- వారిని ప్రోత్సహిస్తేనే పిల్లలు కనీసం పదో తరగతి వరకు చదువుతారనే ఈ నిర్ణయం
- మహిళలు చదువుల బాట పడితేనే సమాజం బాగు.. పిల్లలను చదివించడానికి పెట్టే సొమ్మును వారికి ఇచ్చే ఆస్తిగా భావిస్తాం
- ఇవాళ వేసే అడుగుతో పదేళ్ల తర్వాత వారికి మంచి భవిష్యత్తు
- మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడి గెలవాలనేదే సర్కారు తాపత్రయం
- గత ప్రభుత్వం ఎగనామం.. మన ప్రభుత్వం సాయం పెంచి అమలు


వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: పేదవాడి తలరాత మార్చే అస్త్రం చదువేనని గట్టిగా నమ్ముతూ.. మనందరి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడి గెలవాలనే చదువులు ఇవ్వడానికి సర్కారు తాపత్రయ పడుతోందన్నారు. 2022 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 4,536 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ.38.18 కోట్ల ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి జమ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెళ్లిళ్లు చేసుకున్న పిల్లలందరికీ దేవుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా డబ్బులను వచ్చే త్రైమాసికం నుంచి

మిగతా 2వ పేజీలో ▶

"పిల్లలకు చదువు అనే ఆస్తిని మనం ఇవ్వలేకపోతే వారి జీవితాలను ఏ రకంగానూ బాగు పరచలేం. 'మ్యారేజెస్ కెన్ వెయిట్ బట్ ఎడ్యుకేషన్ కెనాట్' అన్నట్లు పెళ్లిళ్ల కోసం వేచి ఉండవచ్చు కానీ.. చదువు కోసం వేచి ఉండలేము అనే నానుడిని గుర్తుంచుకోవాలి. అందుకోసమే మనందరి ప్రభుత్వం పిల్లల చదువుల కోసం ఎంత ఖర్చు అయినా సరే అంటూ ఎంతగానో తాపత్రయ పడుతోంది. విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలతో చేయి పట్టుకుని నడిపిస్తోంది. ఇందులో భాగంగానే వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు కనీసం పదో తరగతి పాసవ్వాలంటూ నిబంధన పెట్టింది.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సుప్రీంకోర్టులో మరో ఇద్దరు జడ్జీల నియామకం


జస్టిస్ రాజేశ్ బిందాల్


జస్టిస్ అరవింద్ కుమార్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మరో ఇద్దరు జడ్జీలు నియమితులయ్యారు. దీంతో, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కలిపి మొత్తం 34 మంది న్యాయమూర్తులతో ఇక పూర్తిస్థాయి సామర్థ్యంతో అత్యున్నత న్యాయస్థానం పనిచేయనుంది. అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ బిందాల్, గుజరాత్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్‌లను రాష్ట్రపతి నియమించారని శుక్రవారం న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు ట్వీట్ చేశారు. వచ్చే రెండు రోజుల్లో వీరిద్దరు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. వీరి పేర్లను జనవరి 31వ తేదీన సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులుండే కొలీజియంలో జస్టిస్ బిందాల్ పేరుపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే, జస్టిస్ కుమార్ పేరుపై కొలీజియంలోని జస్టిస్ కేఎం జోసెఫ్ విభేదించినట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను బట్టి తెలుస్తోంది. తాజాగా జస్టిస్ బిందాల్, జస్టిస్ కుమార్‌ల నియామకంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, కేంద్ర న్యాయశాఖ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశాయి. గత వారం సుప్రీంకోర్టుకు ఐదుగురు జడ్జీలు నియమితులైన విషయం తెలిసిందే. అయితే, వచ్చే మే–జూలై నెలల మధ్యలో సుప్రీంకోర్టులోని ఆరుగురు న్యాయమూర్తులు పదవీ విరమణ చేయనున్నారు.



ఎస్ఎస్ఎల్‌వీ-డీ2 ప్రయోగం విజయవంతం

నిర్ణీత కక్ష్యలోకి చేరిన మూడు ఉపగ్రహాలు

- వివరాలు 14లో

అమూల్.. ఆరోసారి

పాల సేకరణ ధరలు భారీగా పెంచిన అమూల్

- గరిష్టంగా గేదె పాలపై రూ.3.30, ఆవు పాలపై రూ.3.08 చొప్పున పెంపు
- వెన్న, ఘనపదార్థాలపై కూడా..
- నేటి నుంచి రాయలసీమ, కోస్తాంధ్రలో వర్తింపు
- పాడి రైతన్నలకు మరింత లబ్ధి


26 నెలల్లో ఆరు దఫాలు సేకరణ ధరలు పెంపు

సాక్షి, అమరావతి: 'జగనన్న పాల వెల్లువ' ద్వారా పాడి రైతులకు మరింత ప్రయోజనం చేకూరుస్తూ అమూల్ సంస్థ తాజాగా ఆరో సారి సేకరణ ధరలను పెంచింది. లీటర్‌కు గరిష్టంగా గేదె పాలపై రూ.3.30, ఆవుపాలపై రూ.3.08 చొప్పున పెంచింది. కిలో వెన్నపై రూ.30, ఘనపదార్థాలపై రూ.22 మేర పెంచారు. రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల పరిధిలో శనివారం నుంచి ఈ పెంపు వర్తించనుంది. 2.29 లక్షల మంది పాడి రైతులకు దీనివల్ల లబ్ధి చేకూరనుంది. రాయలసీమలో అమూల్ తరఫున కైరా యూనియన్, కోస్తాంధ్రలోని సబర్కాంత్, ఉత్తరాంధ్రలో బనస్కాంత్ యూనియన్లు పాలను సేకరిస్తున్నాయి. పథకం ప్రారంభించినప్పుడు లీటర్‌కు గరిష్టంగా గేదె పాలకు రూ.71.47, ఆవు పాలకు రూ.34.20 చొప్పున చెల్లించగా తాజా పెంపుతో కలిపి గత 26 నెలల్లో ఆరు దఫాలు పాల సేకరణ ధరలు పెరిగాయి. అమూల్ తరఫున

మిగతా 2వ పేజీలో ▶

నాణ్యత ఆధారంగా లీటర్‌కు పాల సేకరణ ధరలు (రూ.లలో)		కొవ్వు శాతం	ఎస్ఎన్ఎఫ్ శాతం	పాత ధర	కొత్త ధర	పెరిగిన ధర
	గేదె పాలు	5.5	9	40.75	42.40	1.65
		11	9	82.50	85.80	3.30
	ఆవు పాలు	3.2	8.7	31.73	34.20	2.47
		5.4	8.7	39.48	42.56	3.08

డయాఫ్రమ్ వాల్ పరీక్షలు పూర్తి

- సామర్థ్యాన్ని తేల్చేందుకు రెండు రకాలుగా ఎన్‌హెచ్‌పీసీ బృందం పరీక్షలు
- డేటా, 3 డీ చిత్రాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చనున్న నిపుణులు
- రెండు వారాల్లోగా రాష్ట్ర జలవనరుల శాఖ, పీపీఏలకు అందనున్న నివేదిక
- నివేదిక ఆధారంగా సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు డయాఫ్రమ్ వాల్‌పై ముందుకు
- పటిష్టంగా ఉన్నట్లు తేలితే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టేందుకు మార్గం సుగమం

3 లో

మనదే ఆధిపత్యం

10 లో

ఆసీస్‌తో జరిగిన టెస్టులో శతకంతో రాణించిన రోహిత్‌శర్మ
జడేజా, అక్షర్ అర్ధ సెంచరీలు




శిథిలాల్లో పుట్టిన పసికందును బయటకు తీసుకువస్తున్న సహాయక సిబ్బంది(ఫైల్)

ఎటు చూసినా హృదయ విదారకం

- తుర్కియే, సిరియాలో కొనసాగుతున్న సహాయక చర్యలు.. ముమ్మరంగా శిథిలాల తొలగింపు
- 100 గంటలకు పైగా మృత్యువుతో పోరాటం.. రెండు దేశాల్లో 22,000 దాటిన మరణాలు

6 లో

శిథిలాల్లో ప్రాణం పోసుకున్న అయాకు ఆప్తులెందరో!

ఈ బుల్లి పాపాయి గుర్తుందా?

సోమవారం వాయవ్య సిరియాలో జిందర్జీస్ పట్టణంలో భూకంపం తాకిడికి నేలమట్టమైన భవనం తాలూకు శిథిలాల్లోనే ప్రాణం పోసుకున్న పసికందు.

తల్లిదండ్రులతో పాటు నలుగురు తోబుట్టువులూ భూకంపానికి బలవగా ఆ దుమ్ముధూళి మధ్య నుంచి ఈ పాపాయిని మాత్రం సహాయక బృందాలు సజీవంగా బయటికి తీసుకొచ్చిన దృశ్యం వైరల్‌గా మారి అందరినీ అబ్బురపరిచింది. అందుకు గుర్తుగా తనకు అయా (అద్భుతమని అరబిక్‌లో అర్థం) పేరు పెట్టారు. ఆస్పత్రికి తీసుకెళ్లేటప్పటికి ఒళ్లంతా చల్లబడి, శ్వాస కూడా ఆడని స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు బాగా కోలుకుంటోంది. ఈ మిరకిల్ బేబీని దత్తత తీసుకుంటామంటూ వేలాది మంది ముందుకొస్తున్నారు. వీరందరి ఫోన్లతో ఆస్పత్రి మేనేజర్ ఖలీద్ అతియా ఉక్కిరిబిక్కిరవుతున్నారు! చిన్నారి తాలూకు బంధువులతో మాట్లాడేదాకా తనను ఎవరికీ ఇచ్చేది లేదని చెప్పారాయన. ప్రస్తుతం అతియా భార్యే తన సొంత కూతురితో పాటు అయాకు కూడా పాలిస్తోంది!


న్యూస్‌రీల్

సుబ్బన్న ఆయిల్స్‌లో కమిటీ విచారణ



కాకినాడ జిల్లా జి.రాగంపేటలో సుబ్బన్న ఆయిల్స్ కంపెనీలో ఏడుగురు మృతి చెందిన ఘటనపై ఐదు శాఖలకు సంబంధించిన అధికారుల కమిటీ విచారణ చేపట్టింది. శుక్రవారం ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించింది.
వివరాలు 2 ▸

ఆలయాల భూములు పరిరక్షించండి



దేవాలయాల భూముల పరిరక్షణే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని దేవదాయ శాఖ ఆదేశించింది. రీసర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్కడెక్కడ దేవాలయ భూములున్నాయో వాటి కొలతలు సక్రమంగా కొలిపించి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలంది.
వివరాలు 3 ▸

'సోషల్' మత్తును వదిలించుకోవచ్చు



స్మార్ట్‌ఫోన్‌లో నెట్ రాకుంటే చిరాకు.. పోస్టులకు లైక్‌లు, షేర్‌లు చేస్తూ కామెంట్లకు రిప్లయ్ ఇవ్వాలన్న కోరిక.. ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటే అదో మానసిక వ్యసనమే అంటున్నారు మానసిక వైద్యులు. దీనిపై చికాగో యూనివర్సిటీ అధ్యయనం చేసింది.
వివరాలు 3 ▸

భారత దేశ అభివృద్ధితోనే ప్రపంచ సౌభాగ్యం



ప్రపంచ సౌభాగ్యం భారతదేశ అభివృద్ధితో ముడిపడి ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు.
వివరాలు 6 ▸


హామీల పేరుతో 'చుక్కలు' చూపిస్తున్నారుగా అని అంటున్నాడ్సార్!

బోటు నిండుగా ఆదాయం!

రాష్ట్రంలో పుంజుకుంటున్న జల పర్యాటకం

- విభజన తర్వాత రికార్డు స్థాయిలో ఈ ఏడాది ఆదాయం
- ఇప్పటికే ఏపీటీడీసీకి రూ.6.25 కోట్లు...
- మార్చి చివరికి రూ.8.32 కోట్లకు పెరుగుతుందని అంచనా
- రూ.2 కోట్లతో కొత్త బోట్ల కొనుగోలుకు కసరత్తు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల పర్యాటకం పరవళ్లు తొక్కుతోంది. గడిచిన ఏడేళ్లతో పోలిస్తే ప్రస్తుతం రికార్డు స్థాయిలో ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)కు చెందిన 12 బోటింగ్ యూనిట్లలో వివిధ రకాలైన 41 బోట్లు నిత్యం సేవలందిస్తున్నాయి. పాపికొండలు, విజయవాడ, శ్రీశైలం బోటింగ్ పాయింట్లకు పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర విభజన తర్వాత రికార్డు స్థాయిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఏపీటీడీసీ బోటింగ్ విభాగం ద్వారా రూ.6.25 కోట్లు ఆదాయం రాగా, మార్చి చివరి నాటికి రూ.8.32కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

కొత్తగా బోట్ల కొనుగోలు


రూ.2కోట్ల వ్యయంతో కొత్త బోట్ల కొనుగోలుకు ఏపీటీడీసీ సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే అధికారులు టెండర్లు పిలవనున్నారు. 50సీటింగ్ సామర్థ్యం కలిగిన మూడు బోట్లను కొనుగోలు చేసి పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉన్న విజయవాడ, శ్రీశైలం యూనిట్లకు కేటాయించనున్నారు. ఔట్ బోర్డ్ బోట్లు, స్పీడ్, డీలక్స్, పెడల్ బోట్లను సైతం కొనుగోలు చేయనున్నారు. మరోవైపు నాగార్జున సాగర్‌లోని స్టీల్ జెట్టీకి కూడా మరమ్మతులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురానున్నారు.

పర్యాటకులకు మెరుగైన సేవలు

జల పర్యాటకానికి ఆదరణ పెరుగుతోంది. పర్యాటకులకు మెరుగైన సేవలందించేందుకు కొత్త బోట్లను సైతం కొనుగోలు చేస్తున్నాం. రాష్ట్ర విభజన తర్వాత ఇంత ఆదాయం ఎప్పుడూ రాలేదు. కొత్త బోటింగ్ పాయింట్లపైనా దృష్టి సారించాం. కరోనా తర్వాత ఇంత వేగంగా పుంజుకోవడం శుభపరిణామం.
- కె.కన్నబాబు, ఎండీ, ఏపీటీడీసీ

కొత్త బోటింగ్ యూనిట్లపై దృష్టి

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రస్తుత బోటింగ్ యూనిట్లలో సేవలను మెరుగుపరచడంతోపాటు కొత్త యూనిట్లను నెలకొల్పడంపై దృష్టి సారిస్తోంది. ఇటీవల పోచవరం(పాపికొండలు), వైఎస్సార్ జిల్లాలోని పర్నపల్లిలో జల పర్యాటకాన్ని అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలోనే తొలిసారిగా పర్నపల్లిలో అమెరికన్ పాంటూన్ బోట్లను ప్రవేశపెట్టింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఈ కస్టమైజ్డ్ బోట్లు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అక్కడ గత నెలలో ఏకంగా రూ.8లక్షల వరకు ఆదాయం వచ్చింది. త్వరలో బ్రహ్మంసాగర్, దేవునికడపతోపాటు రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో కూడా బోట్లు నడిపేందుకు ఏపీటీడీసీ ప్రతిపాదనలు రూపొందిస్తోంది.



క్లుప్తంగా...

సీఎం జగన్‌కు శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల ఆహ్వానం



సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈవో, పాలకమండలి చైర్మన్, ఎమ్మెల్యే బియ్యపు

సాక్షి,అమరావతి/శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరగనున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా వేద పండితులు సీఎంను ఆశీర్వదించి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విజయవాడ నుంచి హజ్ యాత్ర

సీఎం వైఎస్ జగన్‌కు హజ్ కమిటీ చైర్మన్ గౌసల్ ఆజామ్ కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు ఈసారి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హాజీలు బయలుదేరనున్నారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గౌసల్ ఆజామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. సౌదీ ప్రభుత్వం, కేంద్ర హజ్ కమిటీ హజ్ యాత్ర షెడ్యూల్‌ను ప్రకటించిందని, హజ్ 2023 యాత్రకు దరఖాస్తులు ఈ నెల 10 నుంచి మార్చి 10 వరకు తీసుకునే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. హజ్ యాత్రలో పాల్గొనాలనుకునే వారికి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్టు, గుర్తింపు పొందిన కోవిడ్ వ్యాక్సినేషన్ చేయించుకుని ఉండాలని పేర్కొన్నారు. అర్హులు హజ్ యాత్రలో పాల్గొనేందుకు త్వరగా దరఖాస్తులు పంపించాలని కోరారు.

కేజీబీవీ సిబ్బందికి జీతాల పెంపు

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 352 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి 23 శాతం జీతాలు పెంచుతూ ఇటీవల క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లుగా కేజీబీవీల్లో బోధనా సిబ్బందికి జీతాలు పెంచలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ధరలు పెరగడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల జీతాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. బోధనా సిబ్బంది ప్రస్తుతం పొందుతున్న జీతాలకు 23 శాతం అదనంగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేజీబీవీల్లో ఇంటర్ బోధిస్తున్న పీజీటీలకు కూడా సీఆర్టీలతో సమానంగా జీతాలు చెల్లిస్తామని వివరించారు.

పంటల బీమాకు 'ఈ క్రాప్' డేటాయే ప్రామాణికం

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా-ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి ఈ క్రాప్ డేటాయే ప్రామాణికంగా తీసుకోవాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ బీమా కంపెనీలకు సూచించారు. ఈ పంట ద్వారా పంటల నమోదు డేటాను నేషనల్ క్రాప్ ఇన్సూపోర్టల్ (ఎన్‌సీఐపీ)తో అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. బీమా కంపెనీల ప్రతినిధులతో శనివారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ వివరాలను పక్కాగా నమోదు చేయడం ద్వారా పంట కోత ప్రయోగాలను పారదర్శకంగా నిర్వహించడం ద్వారా ప్రస్తుత సీజన్‌లో మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ క్రాప్, పంటకోత ప్రయోగాల తీరును క్షేత్రస్థాయి పరిశీలన చేశామని, సంతృప్తికరంగా జరుగుతున్నాయని బీమా కంపెనీ ప్రతినిధులు వివరించారు. ప్రణాళిక శాఖ సంయుక్త సంచాలకులు బసవరాజు, ఉపసంచాలకులు సౌజన్య,, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వివిధ పోస్టులకు ఎంపికైన వారి జాబితా విడుదల

21న ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన వారి జాబితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం విడుదల చేసింది. వీటిని కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.in లో పొందుపరిచింది. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్, సెరికల్చర్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ టెక్నికల్ అసిస్టెంట్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాలను వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపింది. ఈ పోస్టులకు ఎంపికైన వారి ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఫిబ్రవరి 21న నిర్వహిస్తామని వెల్లడించింది.

గోల్ కొట్టి.. అమెరికాకు..

- ఫుట్‌బాల్‌లో మెరిసిన ప్రొద్దుటూరు బాలిక శ్రీదేవి
- కాలిఫోర్నియాలో నిర్వహించే హోమ్‌లెస్ వరల్డ్ కప్‌కు కానపల్లె క్రీడాకారిణి



ఇండియన్ జట్టుతో శ్రీదేవి

ప్రొద్దుటూరు: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం కానపల్లె గ్రామానికి చెందిన వజ్జల శ్రీదేవి త్వరలో కాలిఫోర్నియాలో జరగనున్న అంతర్జాతీయ ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొననుంది. కానపల్లె గ్రామానికి చెందిన ఈమె తల్లిదండ్రులు శ్రీనివాసులు, సుబ్బమ్మ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తమ కుమార్తెకు క్రీడలపై ఉన్న ఆసక్తిని గమనించి నాలుగో తరగతిలోనే కడపలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో చేర్పించారు. తర్వాత శ్రీదేవి నెల్లూరు శాప్ అకాడమీలో ఉంటూ ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ప్రస్తుతం డిగ్రీ చదువుతోంది. ఫుట్‌బాల్‌పై పట్టు ఉన్న శ్రీదేవి ఎన్నో మార్లు పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచింది. గతంలో అరుణాచలంలో జరిగిన సీనియర్ క్యాంప్, కటక్‌లో జరిగిన జూనియర్ క్యాంప్, గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించింది. ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లోని స్లమ్స్ సాకర్ స్టేడియంలో ఇండియా ఫుట్‌బాల్ జట్టుకు సంబంధించి ఎంపికలు జరిగాయి. ఇందులో మొత్తం 28 మందిని ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వజ్జల శ్రీదేవి ప్రథమ స్థానంలో నిలిచింది. విద్యార్థినికి కోచ్‌గా కె.సాయికిరణ్ వ్యవహరిస్తున్నారు.

హోమ్‌లెస్ వరల్డ్ కప్ అంటే..

హోమ్‌లెస్ వరల్డ్ కప్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించే వార్షిక అసోసియేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్. ఇది అసోసియేషన్ ఫుట్‌బాల్ క్రీడ ద్వారా నిరాశ్రయులు లేకుండా చేయాలని సూచించే సామాజిక సంస్థ. సంస్థ వార్షిక ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తుంది. ఇక్కడ వివిధ దేశాల నుంచి నిరాశ్రయులైన వ్యక్తుల జట్లు పోటీపడతాయి. నిరాశ్రయులైన ప్రపంచ కప్ సంస్థను 2001లో మెల్ యంగ్, హెరాల్డ్ ష్మీడ్ స్థాపించారు. నిరాశ్రయుల కోసం మొదటి వార్షిక ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2003లో ఆస్ట్రియాలోని గ్రాజ్‌లో జరిగింది. ఇటీవల 2019 ఎడిషన్‌ను వేల్స్ కార్డిఫ్‌లోని బ్యూట్ పార్క్‌లో నిర్వహించింది. 2020 టోర్నమెంట్ ఫిన్‌లాండ్‌లోని టాంపేర్‌లో జరగాల్సి ఉంది. అయితే కోవిడ్ మహమ్మారి కారణంగా రద్దు అయింది. 2023 ఏప్రిల్‌లో యూఎస్‌ఏలోని కాలిఫోర్నియాలో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. హోమ్‌లెస్ వరల్డ్ కప్ యొక్క అంతర్జాతీయ ప్రధాన కార్యాలయం స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లోని ఈస్టర్ రోడ్ స్టేడియంలో ఉంది.

జాతీయ జట్టులో..

వజ్జల శ్రీదేవి త్వరలో అమెరికాలోని కాలిఫోర్నియాలో జరగనున్న ఫుట్‌బాల్ హోమ్‌లెస్ వరల్డ్ కప్ పోటీలకు వెళ్లనుంది. ఈ ఏడాది జరగనున్న పోటీలకు సంబంధించి ఇండియా జట్టును ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీదేవి ప్రథమ స్థానంలో ఉంది.
– కె.సాయికిరణ్, ఫుట్‌బాల్ కోచ్

వరల్డ్ కప్‌లో విజయమే లక్ష్యం



ఇండియా జట్టుకు ఎంపికయ్యాను. వరల్డ్ కప్ పోటీల్లో విజయమే లక్ష్యంగా ప్రతిభ చూపుతా. చిన్ననాటి నుంచి ఫుట్‌బాల్ క్రీడపై ఎంతో మక్కువ. చదువు లేని నా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించారు.
– వజ్జల శ్రీదేవి, ఫుట్‌బాల్ క్రీడాకారిణి, కానపల్లె, ప్రొద్దుటూరు మండలం, వైఎస్సార్ జిల్లా.

చదువే దివ్యాస్త్రం

▶ మొదటి పేజీ తరువాయి

పెళ్లి కూతుళ్ల తల్లుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామని తెలిపారు. తల్లులను ప్రోత్సహిస్తేనే పిల్లలు కనీసం పదో తరగతి వరకు చదువుతారనే కారణంతోనే చాలా మందితో సలహాలు, సూచనలు తీసుకున్నాకే ఇలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పిల్లలను చదివించడానికి వెచ్చించే మొత్తం ఎంతైనా సరే ఖర్చు కింద భావించడం లేదని, దాన్ని పిల్లలకిచ్చే ఆస్తి కింద ఈ ప్రభుత్వం భావిస్తోందని స్పష్టం చేశారు. పిల్లల చదువుల కోసం ఇవాళ మనం వేసే అడుగుతో పదేళ్ల తర్వాత వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్న దృక్పథం, ఆలోచనతో ముందుకు సాగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

మూడు నెలలకొకమారు అమలు

- అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో పెళ్లి చేసుకున్న వారు.. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు నెల రోజుల పాటు అవకాశం ఇచ్చి, ఫిబ్రవరిలో సాయం అందిస్తున్నాం. ఏటా ప్రతి మూడు నెలలకొకసారి ఈ కార్యక్రమం జరుగుతుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పెళ్లి చేసుకున్న వారు ఏప్రిల్ ఆఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మే నెలలో ప్రోత్సాహకం అందిస్తాం.
- పిల్లలు బాగుండాలనే తపన, తాపత్రయంతో ఆ కుటుంబాల్లో సభ్యుడిగా ఈ పథకానికి వయసుతో పాటు చదువు కూడా అర్హతగా నిబంధన విధించాం. మంచి చదువుల తర్వాత పెళ్లి చేసుకుంటే ఆ కుటుంబంలో తర్వాతి తరం ఆటోమేటిక్‌గా చదువుల బాట పట్టేలా గొప్ప సంప్రదాయానికి నాంది పలికాం. పిల్లల చదువులను ప్రోత్సహించడంతో పాటు బాల్య వివాహాలను నివారించడం, డ్రాపౌట్స్ లేకుండా బడులలో చేరే వారి శాతాన్ని పెంచే కార్యక్రమాలు చేస్తున్నాం.



వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఉన్నత విద్య దిశగా అడుగులు

- వివాహానికి చెల్లెమ్మలకు కనీస వయసు 18 సంవత్సరాలు, తమ్ముళ్లకు 21 సంవత్సరాలుగా నిర్ణయించడంతో పాటు పదో తరగతి పాస్ సర్టిఫికెట్ కచ్చితంగా ఉండాలని చెప్పాం. దీంతో ఈ ప్రోత్సాహకం ఒకటి ఉందన్న భావనతోనైనా పదో తరగతి చదవించాలన్న నిర్ణయానికి వస్తారు.
- ఆ తర్వాత.. పెళ్లికి 18 ఏళ్లు నిండాలి కాబట్టి.. ఇంటర్ మీడియట్ చదువుతారు. దీనికోసం ఎలాగూ అమ్మఒడి పథకం ఉంది. ఆ తర్వాత విద్యా దీవెన, వసతి దీవెన పథకాలున్నాయి కాబట్టి డిగ్రీ వరకు చదివించడానికి అడుగులు ముందుకు వేస్తారు. తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికుల్లో ఆడ పిల్లలున్న కుటుంబాలకు మంచి జరుగుతుంది.
- ఉన్నత విద్య తర్వాత ఉద్యోగాల దిశగా అడుగులు వేయిస్తూ చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. వీటితో పాటు ప్రపంచ స్థాయి విద్య కోసం వేరే దేశాల్లోని అత్యంత ఉత్తమ కాలేజీల్లో సీట్లు సంపాదించుకునే వారికి.. విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా రూ.1.25 కోట్ల వరకు మంజూరు చేస్తూ మద్దతుగా నిలుస్తున్నాం. సత్య నాదెళ్ల తరహాలో దేశం గర్వించదగ్గ రీతిలో వాళ్లు ఉండాలని ఈ పథకాన్ని తీసుకొచ్చాం.
- వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలతో పాటు ఈ పథకాలన్నింటినీ అమలు చేయడం ద్వారా విద్యా రంగంలో పిల్లలకు మంచి జరగాలని, వారి జీవితాల్లో మార్పు తీసుకురావాలని అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇవాళ లబ్ధి పొందిన 4,536 మందిని పారదర్శకంగా ఎంపిక చేశాం. అర్హులు ఎవరూ మిస్ కాకూడదనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తు పెట్టుకునే వెసులుబాటు కల్పించాం. మ్యారేజ్ సర్టిఫికెట్ కూడా అక్కడే తీసుకునే అవకాశం కల్పించాం. లంచాలకు, వివక్షకు తావు లేకుండా వలంటీర్ మీ అందరి చేయిపట్టుకుని నడిపించి, సాయం చేసేలా కార్యక్రమాలు చేస్తున్నాం.



క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అప్పుడు, ఇప్పుడు ఇదీ పరిస్థితి

- గతంలో పెళ్లిళ్లు చేసుకుంటే అరకొరగా సొమ్ములు ఇవ్వడంతో పాటు అవి కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి. ఎన్నికల్లో మేలు జరగాలన్న ఉద్దేశంతో కేవలం పౌడర్ కోటింగ్‌లా చేశారు. 2018లో ఏకంగా 17,709 మంది పెళ్లిళ్లకు రూ.68.68 కోట్లు ఇస్తామని చెప్పి పూర్తిగా ఈ పథకానికే ఎగనామం పెట్టారు.
- గత ప్రభుత్వంలో ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు ప్రకటించి, ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఇవాళ మనం వారికి రూ.లక్ష వరకు పెంచి సాయం అందిస్తున్నాం. ఎస్సీలు, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే గతంలో రూ.75 వేలు ఇస్తామన్న మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఇప్పుడు మనం దాన్ని రూ.1.20 లక్షలకు పెంచి అమలు చేస్తున్నాం. గతంలో బీసీలకు రూ.35 వేలు ఇస్తామని ప్రకటిస్తే.. దానిని మనం రూ.50 వేలకు పెంచి అమలు చేస్తున్నాం.
- బీసీల కులాంతర వివాహాలకు వాళ్లు రూ.50 వేలు ప్రకటిస్తే మనం రూ.75 వేలు ఇస్తున్నాం. మైనార్టీలకు గత ప్రభుత్వం రూ.50 వేలు ప్రకటిస్తే మనం రూ.లక్ష ఇస్తున్నాం. వికలాంగులకు గత ప్రభుత్వం రూ.లక్ష ఇస్తామని ప్రకటించి ఎగురగొట్టి వారికి అన్యాయం చేస్తే.. మనం ఇప్పుడు వారికి రూ.1.50 లక్షలు ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాం. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం రూ.20 వేలు ప్రకటిస్తే.. మనం ఇప్పుడు వారికి రూ.40 వేలు ఇస్తూ శ్రీకారం చుట్టాం.

ప్రపంచంతో పోటీ పడి గెలవాలి

- ఇవాళ మన పిల్లలు వాళ్ల ఊరి పిల్లలతోనే, పక్క ఊరి పిల్లలతోనే పోటీ పడటం లేదు. ఇవాళ ప్రపంచమంతా పోటీలో ఉంది. ప్రపంచంలో మన పిల్లలను ఎక్కడైనా సరే నిలబెట్టించి, ప్రపంచంతో పోటీ పడి గెలిచే పరిస్థితులు ఉన్న చదువులు మనం ఇవ్వగలిగితేనే వారి భవిష్యత్ బాగు పడుతుంది.
- అందుకే ఈ మూడున్నరేళ్లలో ప్రతి అడుగు ఆ దిశగానే వేస్తున్నాం. తల్లులను ప్రోత్సహించి పిల్లలను బడికి ప్రోత్సహించేలా అమ్మఒడి పథకం నుంచి మొదలు పెడితే.. అంగన్‌వాడీలలో పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారంలో నాణ్యతను పెంచుతూ సంపూర్ణ పోషణ అందిస్తున్నాం. రోజుకొక మెనూతో స్కూళ్లలో గోరుముద్ద అమలు చేస్తున్నాం.
- పిల్లలకు స్కూళ్లు తెరవగానే పుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, సాక్సులు, యూనిఫామ్‌లు, బ్యాగుతో సహా విద్యాకానుక కిట్ ఇస్తున్నాం. ఇంగ్లిష్ మీడియం, ఒక పేజీ తెలుగు, ఒక పేజీ ఇంగ్లిషుతో కూడిన బైలింగువల్ పాఠ్య పుస్తకాలు , ఆరో తరగతి మొదలు ఆపై ప్రతి తరగతిని డిజిటలైజ్ చేస్తున్నాం. నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన స్కూళ్లలో ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ను ఏర్పాటు చేస్తున్నాం. ఇంగ్లిష్ మీడియంతో సీబీఎస్‌ఈ సిలబస్ తీసుకొస్తున్నాం. 8వ తరగతిలోకి అడుగు పెట్టిన ప్రతి విద్యార్థికి ట్యాబ్‌ను అందించడంతో పాటు బైజూస్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చాం. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా పిల్లలకు చదువుకునే వెసులుబాటు కల్పించాం. నాడు-నేడుతో స్కూళ్ల రూపురేఖలను పూర్తిగా మార్పు చేస్తున్నాం.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, బీసీ సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి జయలక్ష్మి, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కె హర్షవర్ధన్, మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ జీసీ కిషోర్ కుమార్, వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ ఎస్ షన్ మోహన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ తగ్గుతోంది ఏపీలో మాత్రమే

ఇటీవల మైసూర్‌లో జాతీయ స్థాయిలో ఒక కాన్ఫరెన్స్ జరిగింది. ఒక్క ఏపీలో మాత్రమే డ్రాపౌట్స్ శాతం తగ్గుతోందని ఆ సదస్సులో చర్చకు రావడం గర్వకారణం. నాడు బీఆర్ అంబేడ్కర్.. ఎడ్యుకేషన్ ఈజ్ ద వెపన్ అన్న మాటలను నేడు సీఎం జగన్ నిజం చేస్తున్నారు. చదువుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అనేవి గొప్ప కార్యక్రమాలు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు అండగా ఉంటాయి. అందరూ చదువుకోవాలనే ఉద్దేశంతోనే ఈ పథకాలకు కనీసం పదవ తరగతి పాసవ్వాలనే అర్హత పెట్టారు.
– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అన్నగా ముందుండి నడిపిస్తున్నారు



అన్నా.. మా నాన్న కూలి పనులు చేసి మమ్మల్ని చదివించారు. మేం పోడు భూములు సాగు చేసుకుంటున్నాం. మీరు మాకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా ఇవ్వడంతో మాకు రైతు భరోసా సాయం అందుతోంది. మా అమ్మకు వైఎస్సార్ చేయూత, ఆసరా అందుతున్నాయి. మా జీవనోపాధి మెరుగైంది. మా చెల్లి కూడా మీ పథకాల వల్ల సాయం పొందింది. మా నాన్నకు కొడుకులు లేరు. మీరే మాకు అన్నగా ముందుండి నడిపించారు. మా కుటుంబం తరఫున, పేదలందరి తరఫున మీకు ధన్యవాదాలు.
– సింబోయిన సువర్ణ రత్న, మద్రివలస, అనంతగిరి మండలం, ఏఎస్ఆర్ జిల్లా

ఏడు కొండలవాడిని వేడుకుంటున్నా

మీరు ప్రవేశపెట్టిన వైఎస్సార్ కళ్యాణమస్తు వల్ల మాకు మేలు జరిగింది. కొడుకులా మీరు సాయం చేశారని తండ్రులంతా గర్వంగా చెప్పుకుంటున్నారు. మేం ఐదుగురు ఆడ పిల్లలం. విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా డిగ్రీ పూర్తి చేయగలిగాం. మా నాన్న మమ్మల్ని ధైర్యంగా చదివించారంటే మీరే కారణం. మా చెల్లెళ్లకు అన్ని పథకాలు అందుతున్నాయి. ఒక చెల్లికి ట్యాబ్ ఇవ్వడంతో మరింత ఉత్సాహంగా చదువుకుంటోంది. మేమంతా మీకు రుణపడి ఉన్నాం. మీరే ఎల్లప్పుడూ సీఎంగా ఉండాలని ఏడు కొండలవాడిని వేడుకుంటున్నా.
– లక్ష్మీదేవి, రెడ్డివారిపల్లి గ్రామం, తిరుపతి జిల్లా

ఇది పెద్ద సాయం



మా తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్తారు. మా వలంటీర్ వచ్చి ఈ పథకం గురించి చెప్పడంతో మా అమ్మా నాన్న చాలా సంతోషపడ్డారు. ఏకంగా లక్ష రూపాయలు సాయం చేస్తున్నారు. చాలా సంతోషం. మా కమ్యూనిటీలో ఎంతో మంది నిరుపేదలకు ఈ పథకం ఓ వరం. పదో తరగతి చదవాలని, వయసు 18 నిండాలన్న నిబంధన చాలా మంచిది. బాల్య వివాహాలు ఆగిపోవడంతో పాటు అందరూ చదివిస్తున్నారు. మీ పథకాల వల్ల పేదలు చాలా సంతోషంగా ఉన్నారు. మళ్లీ మళ్లీ మీరే సీఎం అవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.
– షేక్ సాబా కౌసర్, కర్నూలు

ప్రతిష్టాత్మకంగా వైద్య కళాశాలల ఏర్పాటు

- వచ్చే విద్యా సంవత్సరంలో ఐదు వైద్య కళాశాలల ప్రారంభం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మంగళగిరిలోని వైద్య శాఖ ప్రధాన కార్యాలయంలో వైద్య కళాశాలలపై మంత్రి రజిని ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి, నంద్యాల, విజయనగరంలలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించాలనే దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. ఈ క్రమంలో జాతీయ వైద్య మండలి నిబంధనల మేరకు ఐదు కళాశాలల్లో కావాల్సిన అన్ని వసతులను వచ్చే నెలాఖరులోగా సమకూర్చుకోవాలని ఆదేశించారు. క్లినికల్, నాన్-క్లినికల్ వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలపై దృష్టి సారించాలన్నారు. సివిల్ పనులన్నీ వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. ఇకపై రోజూ ఈ ఐదు కళాశాలలపై పర్యవేక్షణ ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. నూతన కళాశాలలకు సంబంధించి లైబ్రరీల నిర్మాణం, వాటికి కావాల్సిన ఫర్నిచర్, పుస్తకాలు, ఇతర పరికరాల కొనుగోలు ఇలా ప్రతి అంశంపై దృష్టి సారించాలన్నారు. వైద్య కళాశాలల్లో పీజీ సీట్లను రాబట్టడంలో ప్రభుత్వం విజయం సాధించిందని మంత్రి రజిని తెలిపారు. 2019లో రాష్ట్రంలో మొత్తం 911 పీజీ సీట్లుండేవని, ఇప్పుడు ఈ సీట్ల సంఖ్య ఏకంగా 1,249కు పెంచుకోగలిగామన్నారు. ఈ ఏడాది కూడా మరో 637 సీట్ల పెంపుదలకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఆ ప్రయత్నంలో ఇప్పటి వరకు 90 సీట్లను అదనంగా సాధించగలిగామన్నారు. ఈ ఏడాది మొత్తం మీద కనీసం 500 పీజీ సీట్లను అదనంగా సాధించేలా ముందుకు సాగుతున్నామని మంత్రి రజిని వివరించారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సుబ్బన్న ఆయిల్స్‌లో విచారణ

జేసీ ఇలక్కియా ఆధ్వర్యంలో అధికారుల తనిఖీ



ఘటనపై ఆరా తీస్తున్న జేసీ ఇలక్కియా, అధికారులు

పెద్దాపురం : కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో అంబటి సుబ్బన్న ఆయిల్స్ కంపెనీలో ఏడుగురు మృతి చెందిన ఘటనపై శుక్రవారం ఐదు శాఖలకు సంబంధించిన అధికారుల(ఫైవ్ మెన్) కమిటీ విచారణ చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ కృతికా శుక్లా నియమించిన ఫైవ్ మెన్ కమిటీ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలో జరుగుతున్న ప్రక్రియపై పూర్తిగా ఆరా తీసింది. పెద్దాపురం ఆర్డీవో జేఎస్ రామారావు, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జి.లక్ష్మీనారాయణ, పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జీఎంపీ మురళీ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎస్.అశోక్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి రవీంద్ర బృందం.. ఘటనకు సంబంధించి ఫ్యాక్టరీలో తనిఖీ నిర్వహించింది. సామర్లకోట ప్రధాన కేంద్రంగా పనిచేస్తూ జి.రాగంపేట పరిధిలో అనధికారికంగా బ్రాంచి నడపడం, విధుల్లో వేరే వాళ్లు ఉండాల్సిన పరిస్థితుల్లో ఈ ఏడుగురిని ఎందుకు తీసుకురావాల్సి వచ్చిందన్న అంశంపై విచారణ జరిపారు. ఆయిల్ శాంపిల్స్‌ను సేకరించారు. నాణ్యత, ట్యాంకుల పరిమాణం, ఆయిల్ నిల్వలపై ఫ్యాక్టరీ హెచ్ఆర్ ఫణీంద్రను ఆరా తీశారు. సామర్లకోటను ప్రధాన కేంద్రంగా ఉంచి ఇక్కడ బ్రాంచికి అనుమతులు తీసుకోకపోవడాన్ని గుర్తించారు. విచారణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఫైవ్‌మెన్ కమిటీ తెలిపింది.

వాస్తవాలను తెలుసుకుని రాయండి

- ఇంధన శాఖ

సాక్షి, అమరావతి: హిందూజాకు అప్పనంగా చెల్లింపులు జరిపేందుకు ఇంధన సంస్థలు సన్నద్ధమవుతున్నాయంటూ పచ్చ పత్రిక శుక్రవారం 'తూచ్ అంటే సరా' శీర్షికతో ప్రచురించిన కథనాన్ని ఇంధన శాఖ ఖండించింది. ఈ మేరకు వాస్తవాలను 'సాక్షి'కి వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం.. 2018లో అప్పటి ప్రభుత్వ ఆదేశాలతో హిందూజాతో ఒప్పందాన్ని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు రద్దు చేసుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ), సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో ఎక్కడా స్థిర చార్జీల చెల్లింపు ప్రస్తావన లేదని పచ్చ పత్రిక రాయడం పూర్తి అవగాహనారాహిత్యం. హిందూజా టారిఫ్‌ను స్థిర, చర చార్జీలుగా విభజించాలని అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులిచ్చింది. దాని ప్రకారం.. ఏపీఈఆర్సీ అప్పటి తాత్కాలిక (అడ్‌హాక్) చార్జీ అయిన యూనిట్ రూ.3.82ను స్థిర చార్జీ రూ.1.06గా, చర చార్జీ రూ.2.76గా విభజించింది. మెరిట్ ఆర్డర్ సూత్రాలను హిందూజా విద్యుత్ కేంద్రానికి వర్తింపచేయడమే దీని ముఖ్యఉద్దేశం. విద్యుత్ కేంద్రం రోజువారీ అందుబాటు ప్రకటన చేశాక మనం విద్యుత్ వాడకపోతే.. ఆ విద్యుత్ కేంద్రానికి స్థిర చార్జీలు చెల్లించాల్సి వస్తుంది.

ప్రత్యేకంగా ప్రస్తావించక్కర్లేదు..

హిందూజాకు పాత బకాయిల సంగతిని తన ఉత్తర్వుల్లో ఏపీఈఆర్సీ ప్రస్తావించలేదని పచ్చ పత్రిక పేర్కొనడం కూడా సరైంది కాదు. ఇప్పటికున్న అసాధారణ పరిస్థితుల దృష్ట్యా ఇంతకు ముందు నిర్ణయించిన తాత్కాలిక చార్జీ 2016 నుంచి 2022 ఆగస్టు వరకు వర్తిస్తుందని ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది. టారిఫ్‌ను ఇప్పటికే రెండు భాగాలుగా విభజించినందున ఇందులో స్థిర చార్జీ చెల్లింపు అన్నది భాగమే కాబట్టి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన అవసరం లేదు. సుప్రీం, అప్పిలేట్ ట్రిబ్యునల్, ఏపీఈఆర్సీ ఇచ్చిన తీర్పుల ప్రకారం హిందూజా విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందం అమలు చేయాల్సిన బాధ్యత డిస్కంలపై ఉంది. హిందూజాకు స్థిర చార్జీల బకాయిలు దాని ఉత్పత్తి అందుబాటు ప్రకటనలను బట్టి చేయాల్సి ఉంటుందని అడ్వకేట్ జనరల్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి, న్యాయ నిపుణులు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి కూడా డిస్కంలకు ఇచ్చిన న్యాయ సలహాలో ధ్రువీకరించారు.

'శివరామకృష్ణన్ కమిటీ' పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని ఏర్పాటుపై కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ సూచనలు అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. శుక్రవారం న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. అయితే న్యాయవాదులు హాజరుకాకపోవడంతో విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

అమూల్.. ఆరోసారి

▶ మొదటి పేజీ తరువాయి

రాయలసీమ జిల్లాల్లో పాలు సేకరిస్తున్న కైరా యూనియన్ గతేడాది నవంబర్‌లో పెంచగా, సెంట్రల్ ఆంధ్రలో సబర్కాంత్ యూనియన్ సెప్టెంబర్‌లో పాల సేకరణ ధరలను పెంచింది. ప్రస్తుతం లీటర్‌కు గరిష్టంగా గేదె పాలకు రూ.82.50, ఆవు పాలకు రూ.39.48 చొప్పున చెల్లిస్తోంది. కాగా ఆరోసారి ఈ రెండు యూనియన్లు మరోసారి పాలసేకరణ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. లీటర్‌కు గేదె పాలపై కనిష్టంగా (5.5 శాతం కొవ్వు, 9 శాతం ఎస్ఎన్ఎఫ్) రూ.1.65, గరిష్టంగా (11 శాతం కొవ్వు, 9 శాతం ఎస్ఎన్ఎఫ్) రూ.3.30 చొప్పున పెంచాయి. ఆవుపాలపై కనిష్టంగా (3.2 శాతం కొవ్వు, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్) రూ.2.47, గరిష్టంగా (5.4 శాతం కొవ్వు, 8.7 శాతం ఎస్ఎన్ఎఫ్) రూ.3.08 చొప్పున పెంచాయి. దీంతో గేదె పాలకు లీటర్‌కు కనిష్టంగా రూ.40.75 నుంచి రూ.42.40కు, గరిష్టంగా రూ.82.50 నుంచి రూ.85.80కు పెంచింది. ఆవుపాలకు లీటర్‌కు కనిష్టంగా రూ.31.73 నుంచి రూ.34.20కు పెంచగా, గరిష్టంగా రూ.39.48 నుంచి రూ.42.56కు పెంచింది. ఈ పెంపు శనివారం నుంచి వర్తించనుంది. ఉత్తరాంధ్ర పరిధిలో పాలు సేకరిస్తున్న బనస్కాంత్ యూనియన్ డిసెంబర్ 15వ తేదీన పెంచింది.

26 నెలల్లో 6.36 కోట్ల లీటర్ల సేకరణ

జగనన్న పాలవెల్లువ పథకం 2020 డిసెంబర్‌లో మూడు జిల్లాలతో ప్రారంభం కాగా ప్రస్తుతం 17 జిల్లాలకు (పునర్విభజన తర్వాత) విస్తరించింది. 14,845 మంది రైతులతో మొదలైన ఈ ఉద్యమంలో 2.61 లక్షల మంది భాగస్వాములయ్యారు. వంద గ్రామాలతో మొదలై 3,173 గ్రామాలకు విస్తరించింది. 1,608 ఆర్బీకేల పరిధిలోని 3,142 గ్రామాల్లో రైతుల నుంచి రోజూ సగటున 1.72 లక్షల లీటర్ల పాలు సేకరిస్తోంది. రెండేళ్లలో 6.36 కోట్ల లీటర్ల పాలను సేకరించగా పాడి రైతులకు రూ.276 కోట్లు చెల్లించారు. లీటర్‌పై రూ.4 అదనంగా లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వగా అంతకు మించి ప్రస్తుతం లీటర్‌కు గేదె పాలకు రూ.15 నుంచి రూ.20 వరకు, ఆవుపాలకు రూ.10 నుంచి రూ.15 వరకు అదనంగా ప్రయోజనం చేకూరుతోంది. అమూల్ రాకతో పోటీ పెరిగి ప్రైవేట్ డెయిరీలు సైతం సేకరణ ధరలను పెంచాల్సి వచ్చింది. ఫలితంగా పాడి రైతులకు రూ.2,728 కోట్ల మేర అదనంగా లబ్ధి చేకూరింది.

పెరిగిన వెన్న ,ఘనపదార్థాల సేకరణ ధరలు ఇలా (కిలోకు రూ.ల్లో)

	పాతధర	కొత్త ధర	పెరిగిన ధర
వెన్న	750	780	30
ఘనపదార్థాలు	280	302	22

మార్చిలోగా మిగతా జిల్లాలకు..

జగనన్న పాల వెల్లువ కింద పాలుపోసే పాడి రైతులకు అమూల్ తరఫున రాయలసీమ, కోస్తాంధ్రలో కైరా, సబర్కాంత్ యూనిట్లు ఆరోసారి పాలసేకరణ ధరను పెంచడంతో పాటు వెన్న, ఘనపదార్థాల సేకరణ ధరలను పెంచాయి. తాజా పెంపుతో సుమారు 2.29 లక్షల మంది రైతులకు అదనపు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే 17 జిల్లాల్లో జేపీవీ అమలవుతుండగా మార్చిలోగా మిగిలిన జిల్లాలకు విస్తరించేందుకు కృషి చేస్తున్నాం.– అహ్మద్‌బాబు, ఎండీ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

క్లుప్తంగా...

ఆయిల్‌పామ్ ఓఈఆర్ నిర్ధారణ

- ఓఈఆర్ 19.32 శాతం, కెర్నిల్ నట్స్‌కు 10.25 శాతంగా నిర్ణయం
- గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది

సాక్షి, అమరావతి : ఆయిల్ పామ్ గెలల(ఫ్రెష్ ఫ్రూట్ బెంచ్)కు 2022–23 సీజన్‌కు సంబంధించి ఆయిల్ ఎక్స్ ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది 19.22 శాతం ఓఈఆర్‌తోపాటు 10.25 శాతం కెర్నిల్ నట్స్ పర్సంటేజ్‌ను ప్రకటించగా, ఈ ఏడాది ఓఈఆర్ శాతాన్ని 0.10 శాతం పెంచుతూ 19.32 శాతంగా నిర్ణయించింది. కెర్నిల్ నట్స్ పర్సంటేజ్ మాత్రం గత ఏడాది మాదిరిగానే 10.25 శాతం చొప్పున నిర్ణయించారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది అక్టోబర్ వరకు సేకరించే గెలలకు ఓఈఆర్, నట్స్ పర్సంటేజ్ ప్రకారం లెక్కగట్టి ధర చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఏపీ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 16.08 శాతం ఉన్న ఓఈఆర్‌ను గడిచిన మూడేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం 3.44 శాతం మేర పెంచింది. గతంతో పోలిస్తే ఓఈఆర్‌ను పెంచడమే కాదు, ఏటా క్రమం తప్పకుండా ప్రకటించడం వలన మూడేళ్లలో ఆయిల్ పామ్ రైతులు రూ.700 కోట్లకు పైగా లబ్ధి పొందారు.

ఫేస్ యాప్ హాజరు నుంచి వీఆర్‌ఏలను మినహాయించాలి

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: వీఆర్‌ఏలను (గ్రామ రెవెన్యూ సహాయకులు) 'ఫేస్ యాప్ అటెండెన్స్' నుంచి మినహాయించాలని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, జి.జయరాజు... సీసీఎల్‌ఏ సాయిప్రసాద్‌ను కోరారు. ఫేస్ యాప్ అటెండెన్స్‌ను వీఆర్‌ఏలకు వర్తింపజేయడం వల్ల వారంతా తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వీఆర్‌ఏలు పార్ట్ టైమ్‌గా పనిచేసే ఉద్యోగులని, వారికి ఇచ్చేది గౌరవ వేతనమేనని వివరించారు. అందువల్ల ఫేస్ యాప్ హాజరు నుంచి వారిని మినహాయించాలని కోరారు.

'బీసీ'ల కొత్త పార్టీ

- త్వరలోనే పార్టీ పేరు, జెండా, అజెండా ప్రకటన
- వెల్లడించిన బీసీ నేతలు



ఐక్యతను చాటుతున్న బీసీ నాయకులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీసీలకు రాజ్యాధికారాన్ని అందించడమే లక్ష్యంగా కొత్త రాజకీయ పార్టీని స్థాపించనున్నట్లు బీసీ నేతలు అన్నా రామచంద్రయాదవ్, వీజీఆర్ నారగోని, పాలూరు రామకృష్ణయ్య, కాకు ఉమావల్లి వెల్లడించారు. విజయవాడలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. భారీ బహిరంగ సభ ద్వారా త్వరలోనే పార్టీ పేరు, జెండా, అజెండా వంటి అంశాలను ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పార్టీలు బీసీలు, బడుగు బలహీన వర్గాల వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని, కేవలం రెండు అగ్రవర్ణాల పరిపాలనగా మార్చేశాయని ఈ నెల 8న జరిగిన బీసీ నేతల సమావేశం అభిప్రాయపడిందని వెల్లడించారు. బీసీల నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ల కలయికతో కొత్త పార్టీని రూపొందిస్తున్నట్లు వివరించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో సమన్యాయం' అనే నినాదంతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల బరిలో దిగుతున్నట్లు వారు స్పష్టంచేశారు. ఏ పార్టీకీ తమ పార్టీ వ్యతిరేకం కాదని, త్వరలోనే పార్టీ కేంద్ర కార్యాలయాన్ని విజయవాడలో ప్రారంభిస్తామని చెప్పారు. పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గుర్తింపు రద్దు చేయాలని ఈసీని కోరతాం

- టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, నిమ్మల, గోరంట్ల

సాక్షి, అమరావతి : అధికారం కోసం జగన్ సొంత బాబాయ్‌ని బలి తీసుకున్నారని టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బొండా ఉమా, నక్కా ఆనంద్‌బాబు, పంచుమర్తి అనూరాధ ఆరోపించారు. దీనిపై టీడీపీ తరఫున కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం 'జగనాసుర రక్తచరిత్ర' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సొంత బాబాయ్‌ని హత్య చేయించి, ఆ నేరాన్ని చంద్రబాబుపై మోపి, జగన్ లబ్ధి పొందారని ఆరోపించారు. కాబట్టి వైఎస్సార్‌సీపీ గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరతామన్నారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి వివేకా హత్య కేసు విచారణను అడ్డుకుంటూనే ఉన్నారని తెలిపారు. ఇటీవలే ఎంపీ అవినాశ్‌రెడ్డిని సీబీఐ విచారిస్తే, తాను హత్య జరిగిన రోజున సీఎం జగన్, ఆయన సతీమణి భారతితో మాట్లాడినట్లు చెప్పాడని పేర్కొన్నారు. అవినాశ్ ముఖ్యమంత్రి దంపతుల పేర్లు చెప్పాక సీబీఐ వెంటనే వారిని విచారించాల్సి ఉందన్నారు.

'సోషల్' మత్తును వదిలించుకోవచ్చు..

గంటల తరబడి సైట్లకే అతుక్కుపోతున్న యూజర్లు

ఈ వ్యసనం మత్తు పదార్థాల వంటిదేనంటున్న నిపుణులు

విదేశాల్లో పెరుగుతున్న సోషల్ మీడియా డి-అడిక్షన్ సెంటర్లు

మన దేశంలోనూ సైకియాట్రిస్టులను ఆశ్రయిస్తున్న వైనం

సాక్షి, అమరావతి: స్మార్ట్‌ఫోన్‌లో నెట్ రాకుంటే చిరాకు.. గంటపాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలంటే విసుగు.. పోస్టులకు లైక్‌లు, షేర్‌లు చేస్తూ కామెంట్లకు రిప్లయ్ ఇవ్వాలన్న కోరిక.. ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటే అదో మానసిక వ్యసనమే అంటున్నారు మానసిక వైద్యులు. ఇది మద్యపాన, మత్తు పదార్థాలు తీసుకోవడం వంటిదేనంటున్నా రు. ఈ వ్యసనంపై చికాగో యూనివర్సిటీ ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనం చేసింది. మన దేశంలోనూ ఇలాంటి కేసులు పెరుగుతున్నట్టు తేల్చింది. ఆన్‌లైన్‌లో విహరించేవారి మెదడులో డోపమైన్ అనే హా ర్మోన్ ఎక్కువ విడుదలవుతుందని, చేస్తున్న పని పదే పదే చేసేలే ఆ హార్మోన్ ఉత్తేజపరుస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందువల్లనే ఒక్కసారి సోషల్ మీడియా సైట్లకు అలవాటుపడ్డవారు వదలలేకపోతున్నారు. ఇది ఒకస్థాయి వరకు ఇబ్బంది లేకున్నా పరిమితి మించినప్పుడు అనర్థాలకు దారితీస్తున్నట్టు గుర్తించిన సైంటిస్టులు.. అలాంటివారు మానసిక వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

వెనకకు వెళ్తేనే.. ముందుకు

ఆన్‌లైన్ సెర్చింగ్ వ్యసనం మానసిక రోగమని ఇప్పటిదాకా ప్రపంచంలో ఎవరూ ప్రకటించకున్నా వీరికి చికిత్స అందించే థెరపిస్టులు మాత్రం పెరుగుతున్నారు. అమెరికాలో సోషల్ మీడియా వ్యసనం 20 శాతానికి పెరిగినట్టు గుర్తించారు. మన దేశంలోనూ ఈ సంఖ్య 4.7 శాతంగా ఉండగా, ఇది వచ్చే రెండేళ్లలో మూడింతలవుతుందని అంచనా వేస్తున్నారు. కోవిడ్ తర్వాత పిల్లల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగం అధికమైంది. బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా గడుపుతున్న ఇలాంటి పిల్లలను తల్లిదండ్రులు సైకియాట్రిస్టులకు చూపిస్తున్నారు. సామాజిక మా ధ్యమం వ్యసనానికి చికిత్స కోసం అమెరికా, యూకేల్లో డి-అడిక్షన్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. కాలిఫోర్నియా న్యూపోర్టు బీచ్‌లోని మీడియా సైకాలజీ రీసెర్చ్ సెంటర్‌లో డ్రైవింగ్, స్విమ్మింగ్‌తో చికిత్స అందిస్తున్నారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే సోషల్ మీడియాకు ముందున్న పరిస్థితికి వెళ్లాలని సైకాలజిస్టులు సూచిస్తున్నారు. ఫోన్‌ను పక్కనబెట్టి మానవ సంబంధాలను మెరుగుపరచుకోవడం, సన్నిహితులతో ఎక్కువ సమయం గడపడం అలవాటు చేసుకోవాలంటున్నారు.



విలువైన సమయం వృథా

హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టుకు రిప్లయ్ ఇవ్వలేదని తను ప్రేమించిన యువతిపైనే బహిరంగంగా దాడి చేశాడు. ఈ గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. సోషల్ మీడియా కారణంగా జరుగుతున్న ఇలాంటి ఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. రోజుకు 2.30 గంటలకు మించి సోషల్ మీడియా సైట్లలో గడిపేవారిలో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని, వారు మరో పనిపై మనసు నిమగ్నం చేయలేకపోతున్నారని చికాగో యూనివర్సిటీ అధ్యయనంలో తేలింది. ఇలాంటి వారు తమ చదువు, వృత్తి కోసం కేటాయించిన సమయాన్ని కూడా వృథా చేసుకుంటున్నట్టు గుర్తించారు.

తగ్గించుకునే మార్గాలూ ఉన్నాయ్

వ్యక్తిగత, మానసిక ఆరోగ్యం మీద, మానవ సంబంధాల పైనా తీవ్ర ప్రభావం చూపుతున్న సోషల్ మీడియా వ్యసనాన్ని సులువుగా తగ్గించుకోవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు చెబుతున్నారు.

- మొదట మన స్మార్ట్ ఫోన్‌లో అతిగా వినియోగిస్తున్న యాప్స్‌ను డిలీట్ చేయడం ఉత్తమ మార్గం.
- పని సమయంలో, భోజనం, వినోద కార్యక్రమాల సమయాల్లో ఫోన్‌ను ఆఫ్ చేయాలి.
- సోషల్ మీడియా యాప్స్‌లోని నోటిఫికేషన్ సెట్టింగ్స్‌ను ఆఫ్ చేయాలి.
- పడకగదిలో ఫోన్, టాబ్లెట్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లను ఉంచకూడదు.
- సాంకేతికతతో సంబంధం లేని కొత్త అభిరుచిని అలవాటు చేసుకోవాలి.
- సాధ్యమైనప్పుడల్లా స్నేహితులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ప్రత్యేక కోర్సు డిజైన్ చేశాం..

స్మార్ట్‌ఫోన్ వ్యసనం టీనేజ్ పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. అదికూడా ఇంట్లో పెద్దవారే అలవాటు చేస్తున్నారు. లాక్‌డౌన్ నుంచి మరీ ఎక్కువైంది. చాలా మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్ వాడే అవకాశం ఉండదని స్కూళ్లకు కూడా వెళ్లడం లేదు. నావద్దకు వచ్చే పిల్లల్లో కొందరు 7 గంటలకు పైగా స్మార్ట్‌ఫోన్ వాడుతున్నవారున్నారు. పిల్లల్లో కార్పెల్ టెన్నల్ సిండ్రోమ్‌తో మణికట్టు దెబ్బతింటుంది. అధిక సమయం తలను వంచి ఉంచడం వల్ల డ్రూపింగ్ హెడ్ సిండ్రోమ్ వస్తోంది. ఇటీవల పిల్లల్లో కొత్తగా వర్చువల్ ఆటిజం గుర్తించారు. గత పదేళ్లలో అమెరికాలో ఏడీహెచ్‌డీ బారిన పడుతున్న పిల్లలు పెరుగుతున్నారు. అంటే ఏకాగ్రత తగ్గిపోతోంది. హింసాతత్వం పెరుగుతోంది. భావోద్వేగాలను అదుపుచేసుకోలేకపోతున్నారు. స్కూల్ పిల్లలను స్మార్ట్‌ఫోన్ నుంచి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక ప్రోగ్రామ్ డిజైన్ చేసి పిల్లలకు చూపిస్తున్నాం. దీనివల్ల ప్రైమరీ పిల్లల్లో నూరు శాతం మార్పు వచ్చింది. హైస్కూల్ స్థాయి పిల్లల్లో కొందరు తీవ్రంగా ఫోన్‌కు బానిసలుగా మారిపోయారు. అలాంటి వారిని సైకియాట్రిస్టులకు చూపించాలని తల్లిదండ్రులకు సిఫారసు చేస్తున్నాం.

– వాసిరెడ్డి అమర్‌నాథ్, విద్యావేత్త.

డయాఫ్రమ్ వాల్ పరీక్షలు పూర్తి

పోలవరంలో రెండు రకాలుగా ఎన్‌హెచ్‌పీసీ బృందం పరీక్షలు

సాక్షి, అమరావతి: గత సర్కారు నిర్వాకాలతో గోదావరి వరదలకు దెబ్బతిన్న పోలవరం ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ గ్యాప్–2 పునాది అయిన డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చే పరీక్షలు శుక్రవారంతో పూర్తయ్యాయి. ఈ డేటాను ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) బృందం సమగ్రంగా విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ భవితవ్యంపై రెండు వారాల్లోగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ), రాష్ట్ర జల వనరుల శాఖకు నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు డయాఫ్రమ్ వాల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయనుంది. డయాఫ్రమ్ వాల్ పటిష్టంగానే ఉన్నట్లు ఎన్‌హెచ్‌పీసీ తేల్చితే ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులకు మార్గం సుగమం అవుతుంది.

స్పిల్ వే, స్పిల్ చానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా..

గోదావరి వరదను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే టీడీపీ సర్కార్ ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించింది. గోదావరికి 2019లో భారీ వరదలు రావడం.. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడం వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. డయాఫ్రమ్ వాల్ భవితవ్యం తేలితేగానీ ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మించలేని దుస్థితి నెలకొంది. చంద్రబాబు సర్కారు నిర్వాకాల వల్ల పోలవరం పనుల్లో జాప్యం చోటు చేసుకుంటోంది.

16 రోజులు.. రెండు రకాల పరీక్షలు

డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చే పరీక్షలను నిర్వహించడంపై రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి పీపీఏ, డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), సీడబ్ల్యూసీ అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లతో చర్చించింది. సీడబ్ల్యూసీ 2022లో చేసిన సూచనల మేరకు ఈ బాధ్యతను ఎన్‌హెచ్‌పీసీకి అప్పగించింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీన నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్(ఎన్‌హెచ్‌పీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ఎల్.కపిల్ నేతృత్వంలో జియో ఫిజిక్స్ విభాగంలో నిపుణులైన సంస్థ సీనియర్ మేనేజర్లు ఎ.విపుల్ నాగర్, ఎస్.కె.పాండే, ఎంపీ సింగ్‌లతో కూడిన బృందం పోలవరానికి చేరుకుంది. డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు హై రిజల్యూషన్ జియోఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానం, సెస్మిక్ టోమోగ్రఫీ విధానం ప్రకారం ఒకే సారి పరీక్షలను ప్రారంభించింది. ఇవి తాజాగా పూర్తయ్యాయి. మొత్తం 16 రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహించినట్లు స్పష్టమవుతోంది.

పరీక్షలు నిర్వహించారు ఇలా..

ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు ఎన్‌హెచ్‌పీసీ బృందం రెండు రకాల పరీక్షలు నిర్వహించింది. వాటిని ఎలా నిర్వహించారంటే..

హై రిజల్యూషన్ జియో ఫిజికల్ రెసిస్టివిటీ విధానం

ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్–2లో నిర్మించిన 1,750 మీటర్ల డయాఫ్రమ్ వాల్ పొడవునా ప్రతి మీటర్‌కు ఒకచోట 20 మిల్లీమీటర్లు (ఎంఎం) వ్యాసంతో 1.5 అడుగుల లోతుతో వేసిన రంధ్రాల్లోకి ఎలక్ట్రోడ్‌లను పంపి వాటి ద్వారా విద్యుత్ తరంగాలను ప్రసారం చేసి హైరిజల్యూష్ జియో ఫిజికల్ రెసిస్టివిటీ ఇమేజింగ్ విధానంలో ఎన్‌హెచ్‌పీసీ బృందం పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల ద్వారా తీసిన 3–డి చిత్రాలను విశ్లేషించి డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చనుంది.

సెస్మిక్ టోమోగ్రఫీ పరీక్ష..

ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌కు ఒక మీటర్ ఎగువన, ఒక మీటర్ దిగువన 60 మి.మీ. వ్యాసంతో 30 నుంచి 40 అడుగుల లోతు వరకూ ప్రతి 40 మీటర్లకు ఒక బోరు బావిని జిగ్ జాగ్ విధానంలో తవ్వారు. అందులోకి ఎలక్ట్రోడ్‌లను పంపి విద్యుత్ తరంగాలను ప్రసారం చేసి పరీక్షలు నిర్వహించారు.

జాగ్రత్తగా జీవనాడి పనులు

- ఎన్‌హెచ్‌పీసీ నివేదికను బట్టి డయాఫ్రమ్ వాల్‌పై నిర్ణయం: మంత్రి అంబటి



ఎన్‌హెచ్‌పీసీ సభ్యులను సత్కరిస్తున్న అంబటి

పోలవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం పనులను అత్యంత జాగ్రత్తగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాల్సి ఉందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. శుక్రవారం జలవనరుల శాఖాధికారులతో కలిసి ఆయన ప్రాజెక్టును సందర్శించారు. దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్‌వాల్, జెట్‌గ్రౌటింగ్, గైడ్‌బండ్ పనులను పరిశీలించారు. ఈఎన్‌సీ నారాయణరెడ్డితో కలసి నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) నిపుణుల బృందంతో చర్చించారు. చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌బాబు, ఎస్‌ఈ నరసింహమూర్తి, మేఘ ఇంజనీరింగ్ సంస్థ సీజీఎం ముద్దుకృష్ణ తదితరులు వారి వెంట ఉన్నారు. అనంతరం అంబటి విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్‌పీసీ నిపుణుల బృందం నివేదికను అనుసరించి డయాఫ్రమ్ వాల్‌పై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాఫర్ డ్యామ్ నిర్మించకుండా డయాఫ్రమ్ వాల్ చేపట్టడం గత ప్రభుత్వం చేసిన చారిత్రాక తప్పిదమన్నారు. దీనివల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందన్నారు. ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం అతి క్లిష్టమైనదని, అది దెబ్బతినడంతో ప్రాజెక్టు పనుల్లో వేగం తగ్గిందన్నారు. గత సంవత్సరం వరదల సమయంలో ఎగువ కాఫర్ డ్యామ్‌ను యుద్ధప్రాతిపదికన మీటరు ఎత్తు పెంచామన్నారు. పోలవరం 41.15 కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు మొదటి విడతలో పూర్తిస్థాయి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందిస్తామని మంత్రి అంబటి తెలిపారు. నిర్వాసితులకు 18 వేల గృహాలను నిర్మించామన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేది టీడీపీనే

- అధికారంలోకి వచ్చాక నిర్వాసితులకు న్యాయం చేస్తా : చంద్రబాబు

సాక్షి, అమరావతి: వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది తానేనని టీడీపీ అధినేత చంద్రబాబు గుర్తు చేశారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ పనులను పూర్తి చేసి ప్రాజెక్టును ప్రారంభిస్తానని తెలిపారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజ్ ఇవ్వడంతోపాటు వారికి అన్ని విధాలా న్యాయం చేస్తానని చెప్పారు. ప్రాజెక్టు నిర్వాసితుల పేరుతో కొందరిని యర్రగొండపాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు వద్దకు తీసుకు వచ్చారు. చంద్రబాబు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రకాశం జిల్లా అవసరాలను గుర్తించి తాను వెలిగొండ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టానని, జగన్ వచ్చాక నిలిచిపోయిందన్నారు. ఒకప్పుడు తెలంగాణలో భూముల రేట్లు తక్కువ ఉండేవని, ఇప్పుడు ఏపీలో భూముల రేట్లు పడిపోయాయన్నారు.

జనసేనను పవన్‌కు వదిలేయండి

- బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ

గుంటూరు మెడికల్ : జనసేనను అధికారంలోకి తీసుకువచ్చే విషయాన్ని పవన్ కల్యాణ్ నిర్ణయానికి వదిలేస్తే మంచిదని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆ పార్టీని బయట నుంచి ఎవరూ ప్రభావితం చేయకుండా చూడాలని చెప్పారు. శుక్రవారం ఆయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. ఏపీలో 22 శాతం ఉన్న కాపులు ఎటు ఉంటే ఆ పార్టీ అధికారంలోకి రావటం 1989 నుంచి చూస్తున్నామని, ఓట్ల కోసం కాపులను వాడుకుంటున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఏం సాధించారని కాపులతో సన్మానాలు చేయించుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన పార్లమెంట్‌లో అడిగిన సమాచారం గూగుల్‌లో కొట్టినా వస్తుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్‌లకు చట్ట సవరణ చేసి రాష్ట్రాలకు అధికారం ఇచ్చిందనే విషయాన్ని గమనించాలన్నారు. కాపుల సామాజిక, ఆర్థిక సర్వే కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి చర్యలు చేపట్టారని, కాపులకు రిజర్వేషన్ల అంశాన్ని చంద్రబాబు పూర్తి చేశారని వివరించారు. విశాఖలో దోచుకోవటానికే రాజధాని అంటున్నారని విమర్శించారు.

టీడీపీదే రక్త చరిత్ర

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపాటు



సాక్షి, అమరావతి : మర్డర్లు, దాడులు, అఘాయిత్యాలు, అమానుషాలు, అరాచకాలు, రక్తపాతాలకు పేటెంట్ చంద్రబాబునాయుడు అని రాష్ట్ర సాంఘిక సాంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. బాబు హయాంలో రాష్ట్రంలో ఏయే జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో, ఎంత మంది యువకులు గల్లంతయ్యారో తాను చెప్పగలనని తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజకీయ ప్రత్యర్థులను భౌతికంగా లేకుండా చేసే మనస్తత్వం చంద్రబాబుదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కారు కూతలు కూస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీడీపీ తీసుకొచ్చిన పుస్తకంలోని అక్షరాలపై చంద్రబాబుతో తాను ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. వంగవీటి రంగాను హత్య చేయించిందెవరో ప్రజలకు తెలుసని, ఇంకా ఎవరికైనా తెలియకపోతే మాజీ మంత్రి హరిరామ జోగయ్య రాసిన పుస్తకం చదివితే అర్థం అవుతుందన్నారు. మంత్రి మేరుగు నాగార్జున ఇంకా ఏమన్నారంటే..

ఆ దాడుల్లో బాబు హస్తం

- దళితులపై దాడుల్లో, నాయీ బ్రాహ్మణులను బెదిరించడంలో, ముద్రగడ పద్మనాభంపై దాడుల్లో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత రక్తం పారించారో ప్రజలకు తెలియదా? నారా లోకేశ్ పాదయాత్రలో నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు వారిని అడ్డుకోవడంలో తప్పేముంది?
- లోకేశ్ బలం ఏమిటన్నది తేలిపోయింది. లోకేశ్ యువ'గంగాళం' పాదయాత్రపై అచ్చెన్నాయుడు ఫోన్‌లో మాట్లాడిన విషయాలు ప్రజలంతా విన్నారు. అసలు సిసలు పాదయాత్రలంటే డాక్టర్ వైఎస్సార్, వైఎస్ జగన్ చేసినవి. కోట్లాది మంది ప్రజలను వారు అక్కున చేర్చుకున్నారు. జనం కూడా వారి పట్ల అపారమైన ప్రేమానురాగాలు చూపారు. చెత్త వాగుడుతో పాదయాత్ర పరువు తీసేలా లోకేశ్ యాత్ర సాగుతోంది.
- అలాంటి పాదయాత్రను కొనసాగించలేక, ఆపేయడానికి ఏదో కారణం కోసం ఎదురు చూస్తున్నారు. పోలీసులు, ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారు. జనాన్ని రప్పించాలనే ఆలోచనతో చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అలాంటి ఆలోచనే లేదు.

దళితులకు అంతా మేమే చేశాం

- 15వ రోజు పాదయాత్రలో లోకేశ్

సాక్షి, చిత్తూరు/శ్రీరంగరాజపురం : 'దళితులకు అంతా మేమే చేశాం.. ఈ ప్రభుత్వంలో అంతా మోసమే జరుగుతోంది.. చంద్రబాబు దళితుల అభివృద్ధికి ఎంతో మేలు చేశారు'.. అని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురంలో పుల్లూరు, పద్మాపురం, రాణిపురం గ్రామాల్లో యువగళం పాదయాత్ర 15వ రోజు శుక్రవారం కొనసాగింది. పుల్లూరు గ్రామంలో దళితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించారన్నారు. ఈ ప్రభుత్వంలో దళితులకు రక్షణలేదని, తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలపై ఉన్న కేసులను ఎత్తివేస్తామని చెప్పారు. తక్కువ వడ్డీకి రుణాలిస్తామని.. రైతులను వైఎస్సార్‌సీపీ విస్మరించిందన్నారు. చెరకు రైతులను ఆదుకుని గిట్టుబాట ధర కల్పిస్తామని చెప్పారు. చివరిగా ఏఎం పురంలో శుక్రవారం సాయంత్రం పాదయాత్ర ముగిసింది. మరోవైపు. శ్రీరంగరాజపురంలో యువగళం కార్యక్రమానికి వచ్చిన వారికి టీడీపీ నేతలు మద్యం విచ్చలవిడిగా సరఫరా చేశారు. పాదయాత్రకు, సమీపంలోని తమిళనాడు నుంచి రోజు కూలీపై ప్రజలను తీసుకొచ్చారు. కానీ, పాదయాత్ర నిర్వహించిన గ్రామాల్లో ప్రజలు రాకపోవడంతో శుక్రవారం కూడా పాదయాత్ర వెలవెలబోయింది.

లోకేశ్ యువ'గంగాళం' అట్టర్ ఫ్లాప్

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి ధ్వజం

సాక్షి, అమరావతి: నారా లోకేశ్ యువగంగాళం పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ అయిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కారుమూరి వెంకటరెడ్డి అన్నారు. పాదయాత్రలో జనం లేరని అన్ని మీడియాలు బట్టబయలు చేస్తుంటే తట్టుకోలేని టీడీపీ నేతలు ఆ ఉక్రోషాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీపై చూపుతూ నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'యువగళం కామెడీ చానల్‌లానే ఉంది. యువగంగాళం భలే హాస్యాన్ని పండిస్తున్నాడు. ఈ యువగంగాళం నిండా పప్పుంది. పప్పును ఉడకబెట్టడానికి ఎల్లోమీడియా అనే నిప్పుంది. కానీ ఈ గంగాళంలో విషయం లేనప్పుడు ఎల్లోమీడియా ఎంత నిప్పు రాజేసినా ఫలితం ఏముంటుంది' అని వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్‌పై దండయాత్ర చేసేంతటి పోటుగాడా లోకేశ్ అని ప్రశ్నించారు. అంత గట్స్ ఉన్నాయా అని అన్నారు. రెండు సార్లు ఎంపీగా, అది కూడా 5,45,000 ఓట్ల మెజార్టీతో జగన్ గెలిచారని చెప్పారు. ఆరు లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దని చెప్పారు. లోకేశ్ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. దేశంలో చంద్రబాబు కంటే పెద్ద బ్రోకర్ ఎవరన్నా ఉన్నారా అని ప్రశ్నించారు. బాబు బ్రోకర్ పనులపై దర్యాప్తు చేస్తే ఆయనకు వెయ్యేళ్ళు శిక్ష పడుతుందని చెప్పారు. చంద్రబాబు స్వార్థానికి ప్రతిరూపమే అమరావతి అని చెప్పారు.

ఆలయాల భూములు పరిరక్షించండి

దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్



మాట్లాడుతున్న చంద్రకుమార్

సింహాచలం : దేవాలయాల భూముల పరిరక్షణే ధ్యేయంగా ఆయా ఆలయాల ఈఓలు, అసిస్టెంట్ కమిషనర్లు (ఏసీలు), ఇతర అధికారులు పని చేయాలని దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ ఆదేశించారు. వందేళ్ల తర్వాత జరుగుతున్న రీసర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్కడెక్కడ దేవాలయ భూములున్నాయో వాటి కొలతలు సక్రమంగా కొలిపించి భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాలలో శనివారం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఉన్న దేవదాయ శాఖ ఈఓలు, ఏసీలు, ఇతర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. దేవాలయాలకు సంబంధించిన భూములు ఎలా పరిరక్షించాలో వివరించారు. ఆలయాల భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో అవగాహన ఏర్పరుచుకుని, రికార్డులను దగ్గర ఉంచుకుని రీసర్వే జరుగుతున్నప్పుడు రెవెన్యూ అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఎన్ని భూములు ఉన్నాయో వాటి రికార్డులను రీసర్వే చేసే అధికారులకు అందించాలన్నారు. తదుపరి హద్దులను గుర్తించి తిరిగి అప్పగించే ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ విశాఖ డీసీ సుజాత, ఏసీ శిరీష, అమరావతిలోని మండల ఎండోమెంట్ ఆఫీసర్, కాకినాడకు చెందిన ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యలో ఏపీదే అగ్రస్థానం

- యనమల వ్యాఖ్యలపై మంత్రి దాడిశెట్టి రాజా ఆగ్రహం



తుని : విద్యలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, ఈ వ్యవస్థపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లు ఖర్చుచేశారని మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుంటుపడిందంటూ మాజీమంత్రి యనమల రామకృష్ణుడు చేసిన వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. 'నీ సొంత గ్రామం ఏవీ నగరంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు నీకు 30 ఏళ్లు పట్టిందని, అయినా సొంత భవనం ఏర్పాటుచేయలేకపోయావు' అని యనమలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్పట్లో విద్యార్థులకు క్లాసులను కల్యాణ మండపంలో నిర్వహించిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు–నేడులో రూ.2 కోట్లతో భవనాలు నిర్మించామని.. తాము చేసిన అభివృద్ధి కనిపించడం లేదా? అని దాడిశెట్టి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. యనమల సొంత మండలం బెండపూడి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్ల భాషపై చూపించిన ప్రతిభకు దేశ, విదేశాల్లో మేధావుల మన్ననలను అందుకున్న విషయం కూడా మీ కళ్లకు కనిపించలేదా... అని ప్రశ్నించారు. అలాగే, అమ్మఒడి, వసతిదీవెన, విద్యాదీవెన, విదేశీ విద్య.. ఇలా పలు కార్యక్రమాలను చేపట్టి పేదలకు నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులను కేంద్ర ప్రభుత్వం మెచ్చుకుందని, కేంద్ర బడ్జెట్ రూపకల్పనలో ఆదర్శంగా తీసుకుందని దాడిశెట్టి రాజా చెప్పారు. 'టీడీపీలో నంబర్ 2 అని చెప్పుకునే నువ్వు అచ్చెన్నాయుడు కంటే వెనుకబడ్డావు' అని మంత్రి ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో 75 శాతం పాఠశాలలకు మరుగుదొడ్లు లేవని, తమ ప్రభుత్వం వచ్చాక నాడు–నేడులో వంద శాతం సౌకర్యాలు కల్పించామన్నారు. ఇప్పటికైనా అవాక్కులు, చవాక్కులు మానకపోతే ప్రజలు యనమలను చెప్పులతో కొడతారని హెచ్చరించారు. తుని నియోజకవర్గంలో యనమల సోదరుల శకం ముగిసిందన్నారు.

నియత కర్మలను సన్యసించడం తామసిక త్యాగం.
శరీరానికి కష్టం కలుగుతుందనే భయంతో కర్మని వదిలేస్తే
అది రాజసిక త్యాగం. కర్తవ్య బుద్ధితో చేసేది సాత్త్విక త్యాగం.
– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, ఫిబ్రవరి, 11

'సంపూర్ణ యుద్ధం' వికటిస్తుందా?

ప్రభుత్వాలు ఎంత ప్రయత్నిస్తున్నా బడి ఈడు పిల్లలను పెళ్లి పీటలెక్కించే సామాజిక దురాచారం దేశంలో పెద్దగా తగ్గలేదని తరచు వెలుగులోకొస్తున్న ఉదంతాలు చెబుతున్నాయి. బాల్యవివాహాలపై అస్సాంలోని బీజేపీ ప్రభుత్వం సరిగ్గా వారం క్రితం ప్రకటించిన 'సంపూర్ణ యుద్ధం' ఈ సమస్యను మరోసారి ఎజెండాలోకి తెచ్చింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ దీనిపై ప్రకటన చేసిందే తడవుగా ఆ రాష్ట్రంలో పోలీసులు విరుచుకుపడటం మొదలెట్టారు. ఇంతవరకూ దాదాపు మూడువేలమందిని అరెస్టు చేశారంటున్నారు. వీరిలో పెళ్లిళ్లు జరిపించిన పురోహితులు, కాజీలు కూడా ఉన్నారు. అరెస్టయినవారిలో అత్యధికులపై భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ) కింద వేర్వేరు సెక్షన్లు నమోదు చేయటంతోపాటు పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టేందుకు ఉద్దేశించిన పోక్సో చట్టాన్ని కూడా ప్రయోగించారు. వాస్తవానికి దాదాపు పదివేలమందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనా వారిలో చాలామంది పరారయ్యారు. ఈ పోలీసు చర్యకు ప్రభుత్వం చెబుతున్న కారణాలు గమనిం చదగ్గవి. 2019–20 మధ్య జరిపిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం అస్సాంలో 20–24 ఏళ్ల మధ్య ఉన్న వివాహితల్లో 31.8 శాతంమంది చట్టవిరుద్ధంగా 18 ఏళ్ల వయసులోపు పెళ్లిళ్లు చేసు కున్నవారే. జాతీయ స్థాయి సగటు 23.3 శాతంతో పోలిస్తే ఇది ఎక్కువే. హిమంత బిశ్వ శర్మ చేసిన ట్వీట్‌లో అస్సాంలోని ఏయే జిల్లాల్లో ఈ బాల్యవివాహాల దురాచారం ఎక్కువుందో, దానివల్ల ఆ ప్రాంతాల్లో చిన్న వయసులోనే గర్భిణులవుతున్నవారి శాతం ఎంతో వివరించారు. టీనేజ్ తల్లుల, గర్భిణుల జాతీయ స్థాయి సగటు 6.8 శాతం ఉంటే, అస్సాంలో అది 11.7 శాతం. ఇది కూడా ఆందోళనకరమైనదే.

ఎడాపెడా సాగుతున్న ఈ అరెస్టుల వల్ల తాత్కాలికంగా అలాంటి పెళ్లిళ్లకు బ్రేక్ పడొచ్చు. కానీ వీటికి దారితీస్తున్న మూలకారణాలను పరిష్కరించనంతవరకూ అవి పూర్తిగా సమసిపోవటం సాధ్యం కాదని పాలకులు గుర్తించటం అవసరం. విద్యాగంధం అంటని మారుమూల పల్లెలు అస్సాంలో కోకొల్లలు. నామమాత్రంగానైనా పాఠశాలలున్నచోట చదువుకునే బాలికల శాతం తక్కువ. ఆడపిల్లలకు చిన్నవయసులో పెళ్లి చేస్తే అది వారికి రక్షణగా ఉంటుందని భావించే కుటుం బాలకు కొదవలేదు. దశాబ్దాల నిర్లక్ష్యం పుణ్యమా అని మన దేశంలో గ్రామీణ మహిళల్లో చదువు కున్నవారి సంఖ్య స్వల్పం. గ్రామీణ అస్సాంలో 74 శాతంమంది మహిళలు పట్టుమని పదేళ్లు కూడా బడి చదువులకు పోలేదంటే ఏమనుకోవాలి? ఆడపిల్లకు చదువు చెప్పిస్తే ఆమెకు ఉజ్వల భవిష్యత్తుం టుందన్న అవగాహన కలుగుతుందా? నిరక్షరాస్యతతోపాటు పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, బాలి కల రక్షణ, భద్రతలపై ఉండే దిగులు, ఇతర సామాజిక దురాచారాలు బాల్యవివాహాలకు కారణ మవుతున్నాయి. ఈ సమస్యల్లో ఏ ఒక్కదాన్నీ పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కేవలం పోలీసుల సాయంతో బాల్య వివాహాలను అరికట్టాలనుకోవటం మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా బాలికల విద్యకు ప్రోత్సాహాలనందిస్తే బడికొచ్చే ఆడపిల్లల సంఖ్య పెరుగుతుంది. అలాగే పాఠశాలల్లో మరుగుదొడ్లు మొదలుకొని ఉపాధ్యాయుల నియామకం వరకూ శ్రద్ధ తీసు కుంటే నాణ్యమైన విద్య అందటంతోపాటు ఆడపిల్లలు సురక్షితంగా చదువుకోవటం వీలవుతుందన్న భరోసా కుటుంబాలకు కలుగు తుంది. కానీ నీతి ఆయోగ్ 'హేతుబద్ధీకరణ' సూచనతో నిరుడు సెప్టెంబర్‌లో అస్సాంలో 1,700 స్కూళ్లు మూసివేయటమో, సమీప పాఠశాలలతో విలీనం చేయ టమో చేశారు. ఈ స్థితిలో ఆడపిల్లలను ఎక్కడో దూరంలో ఉన్న బడికి పంపటానికి తల్లిదండ్రులు సిద్ధపడతారా? ఇక ఉన్నత పాఠశాలల విషయానికొస్తే అస్సాంలో మారుమూల ప్రాంతాల్లో అవి చాలా తక్కువ. ఎన్నో కిలోమీటర్లు నడిచి వెళ్తే తప్ప చదువుకోవటం సాధ్యంకాదు. ఈ పరిస్థితుల్లో ఆడపిల్లకు ప్రమాదం ఎదురుకావొచ్చన్న భయంతో సహజంగానే కుటుంబాలు ఇక వారి చదువుకు స్వస్తిచెబుతాయి. ఇలా బడి మానేసిన పిల్లలకు ఇక పెళ్లే ప్రత్యామ్నాయంగా మారుతోంది. చిన్న వయసులో పెళ్లిళ్లయి గర్భందాల్చిన కారణంగా ఆడపిల్లలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. గర్భస్రావాలు తప్పడం లేదు. గర్భం నిలబడినా తక్కువ బరువుతో జన్మించటం, మృత శిశు జన నాలు, పుట్టిన శిశువులు కొన్ని వారాలలోపే మరణించటం వంటివి అధికంగా ఉంటున్నాయి. ఇరవై య్యేళ్ల వయసు తర్వాత పెళ్లయ్యే బాలికలకు జన్మించే శిశువులకంటే, అంతకన్నా తక్కువ వయసు వారికి పుట్టిన శిశువుల్లో మరణాలు 50 శాతం ఎక్కువని యునిసెఫ్ నివేదిక చెబుతోంది.

బాల్యవివాహాలను తక్షణం అరికట్టవలసిన సామాజిక సమస్యగా గుర్తించటం బాగున్నా, అందుకోసం అస్సాం ప్రభుత్వం ఎంచుకున్న మార్గం ఏమాత్రం సమర్థనీయం కాదు. ఇందువల్ల ఆ సమస్య మరింత జటిలమవుతుందే తప్ప తగ్గదు. ఇప్పుడు వేలాదిమంది అరెస్టయిన పర్యవసా నంగా మగదిక్కులేక, రోజు గడవటం ఎలాగో, తిండితిప్పలకు ఏంచేయాలో తెలియక మహిళలు అవస్థలు పడుతున్నారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ఆల్ అస్సాం మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్ వంటివి చాన్నాళ్లుగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో దాడులు జరుగుతున్నా వెనక్కి తగ్గటంలేదు. అలాంటి సంస్థలకు చేయూతనందించటం... పేదిరిక నిర్మూలనకూ, విద్యారంగం పటిష్టతకూ అవసరమైన పథకాలు అమలు చేయటం ముఖ్యమని అస్సాం ప్రభుత్వం గుర్తించాలి. ఒక సామాజిక సమస్యను నేరపూరితం చేయటం వల్ల జైళ్లు నిండుతాయి తప్ప ఫలితం శూన్యం.

ఐటీ దెబ్బ ఎందుకు తగల్లేదు?

విశ్లేషణ



సుబీర్ రాయ్

అగ్రరాజ్యం అమెరికా సహా పలు దేశాల్లో లేఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. పెద్ద ఐటీ, టెక్ కంపెనీల్లో వేలాదిమందికి అకస్మాత్తుగా ఉద్వాసన పలికారు. అదే భారతీయ కంపెనీల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. ఇతరులతో పోలిస్తే మన కంపెనీలు కొంచెం మెరుగ్గా ఉండటం కారణం కావచ్చు. కానీ ఒక్క విషయమైతే స్పష్టం. అమెరికా కంపెనీల మాదిరిగా సోషల్ మీడియా సృష్టించిందనుకున్న కొత్త ప్రపంచాన్ని అందుకునే ప్రయత్నాల్లో పడకుండా... భారతీయ కంపెనీలు చేస్తున్న పనుల్లోనే కొత్త మార్గాలను అన్వేషించాయి. ఒకరు సృజనాత్మక సృష్టి చేసేవారైతే, ఇంకొకరు వాటిని అమలు చేసేవారు. వ్యాపార పరిస్థితుల్లో వేగంగా వచ్చిన మార్పుల ప్రభావం అమలు చేసేవారిపై పెద్దగా పడలేదు.

ఆల్ఫాబెట్ (గూగుల్), అమెజాన్, మెటా (ఫేస్‌బుక్), మైక్రోసాఫ్ట్, ట్విట్టర్, ఆపిల్ వంటి దిగ్గజ కంపెనీలు గడచిన కొన్ని నెలల్లో ఒక్కొక్కటీ పదివేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించాయి. ప్రపంచం మొత్తమ్మీద ఈ లేఆఫ్‌లు పెద్ద ప్రకంపనలే సృష్టిం చాయి. మరోవైపు భారతీయ ఐటీ దిగ్గజాలు మాత్రం కొత్త ఉద్యోగులను తీసుకునే వేగాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశాయి. ఇదే సమయంలో అమెరికన్ టెక్ కంపెనీల లేఆఫ్‌ల కారణంగా భారతీయ కంపెనీల్లో 'అట్రి షన్' (ఉద్యోగులు బయటికి వెళ్లిపోవడం) కూడా తగ్గింది. కరోనా మొదలైన సమయంలో ఈ అట్రిషన్ ప్రమాదకర స్థాయికి చేరు కున్న విషయం తెలిసిందే.



టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి భారీ భారతీయ కంపెనీలు ఐటీ సర్వీసుల రంగంలోనే ఎక్కువగా ఉన్నాయి. ఉత్పత్తుల ఆధారిత కంపెనీలూ కొన్ని ఉన్నా వీటిల్లో అత్యధికం ఈమధ్య కాలంలో మొదలైనవనే చెప్పాలి. ఒక రకంగా స్టార్టప్‌ల లాంటివన్నమాట. కరోనా ఉధృతి దిగివస్తున్న క్రమంలో అటు స్టార్టప్‌లు, ఇటు పెద్ద టెక్ కంపెనీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొ న్నాయి. ఆర్థిక మాంద్యం వచ్చే అవకాశం ఉందన్న వార్తలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వడ్డీ రేట్లు పెంచడం ఈ రెండు వర్గాల వారికి గోరుచుట్టుపై రోకటి పోటు చందమైంది. దీంతో ఖర్చులు తగ్గిం చుకునేందుకు ఉద్యోగులకు లేఆఫ్‌లు ఇవ్వడం మొదలైంది. వ్యాపారం తగ్గిపోవడం, పెట్టుబడులు వచ్చే అవకాశాలు సన్నగిల్లడంతో లాభా లను కాపాడుకునేందుకు ఈ చర్యలు అనివార్యమయ్యాయి.

మారిన అంచనాలు...

పరిస్థితులు బాగున్న కాలంలో టెక్ కంపెనీల్లో వృద్ధి బాగా నమో దైంది. ఫలితంగా ఆయా కంపెనీలు క్లౌడ్ సర్వీసులు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పుడు అంచనాలు మారిపోవడంతో మళ్లీ గతంలో మాదిరిగా పనులు చేసే ప్రయత్నం జరుగుతోంది. సరుకుల రవా ణాకు డ్రోన్ల వాడకం మొదలుకొని, గాలి బుడగల ద్వారా మూల మూలకూ ఇంటర్నెట్ అందించడం వంటి పలు ప్రాజెక్టులు అప్పట్లో గొప్ప ఆవిష్కరణలుగా అనిపించాయి. కానీ ఇప్పుడు అవి పెద్దగా పట్టించుకోని స్థితికి చేరాయి. సిలికాన్ వ్యాలీ కేంద్రబిందువు అని చెప్పుకునే శాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతంలోనే గత ఏడాది 80 వేల ఉద్యో గాలకు కోత పడిందంటే పరిస్థితి ఏమిటన్నది ఇట్టే అర్థమవుతుంది.

పెద్ద కంపెనీల్లో ఆపిల్, అమెజాన్ ఇప్పటికీ వృద్ధిని నమోదు చేస్తున్నాయి. కాకపోతే గతం కంటే తక్కువగా. ఈ కంపెనీలిప్పుడు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ కూడా ఇదే పనిలో ఉంది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా 2023 ఏడాది తన సామర్థ్యం పెంచుకునే సంవత్సరమని ప్రకటిం చింది. నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు గానూ కంపెనీ నిర్మాణం లోని మధ్య పొరలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది.

భారత్‌లో పరిస్థితి ఏమిటి?

భారత్‌లో సిలికాన్ వ్యాలీ కేంద్రంగా బెంగళూరును చెప్పుకోవచ్చు. గత మూడు నెలల్లో అతిపెద్ద ఐటీ కంపెనీలు ఏడింటిలో సుమారు ఐదు వేల మందికి ఉద్వాసన పలికారు. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్‌లో 2022 చివరినాటికి మునుపటి కంటే ఎక్కువ మంది ఉద్యోగులు (నియామకాల నుంచి లేఆఫ్‌లు తీసేయగా) ఉండగా... టీసీఎస్, విప్రో, టెక్ మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య తగ్గింది. ఈ ఏడు కంపెనీలు కూడా కొత్త కొత్త ప్రాజెక్టులు సంపాదించుకుంటున్నాయి. కానీ నైపుణ్యానికి చెల్లిస్తున్న మొత్తాలను నియంత్రించుకుంటూ, లాభాలను గరిష్ఠ స్థాయిలో ఉంచే ప్రయత్నం జరుగుతోంది. కరోనా వచ్చిన తొలి నాళ్లతో పోలిస్తే ఈ వైఖరి పూర్తిగా భిన్నం. అట్రిషన్ నియంత్రణకు, వ్యాపారాన్ని కాపాడుకునేందుకు అప్పట్లో కొత్త ఉద్యోగుల నియామ కాలు ఎడాపెడా జరిగాయి. పోటీ కంపెనీలు ఉద్యోగులను ఎగరేసుకు పోతే కొండంత ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయలేమన్న ఆలోచనతో అప్పట్లో అలా జరిగింది.

నైపుణ్యమున్న ఉద్యోగులకు, ఇండస్ట్రీ అవసరాలకు మధ్య అంతరం భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. ఈ తేడా ఈ ఏడాది పది శాతం వరకూ ఉంటుందని అంచనా. ఈ ఏడాది రెండో సగంలో ఉద్యో గుల నియామకాలూ పూర్వస్థితికి చేరుకుంటాయని కంపెనీలు ఆశా భావంతో ఉన్నాయి.

తేడాకు కారణాలివీ...

ఉద్యోగుల నియామకాలు, ఉద్వాసనల విషయంలో అమెరికా, భారతీయ కంపెనీల మధ్య కనిపిస్తున్న స్పష్టమైన తేడాకు కారణా లేమిటో చూద్దాం. కరోనా ప్రపంచాన్ని చుట్టేసిన సందర్భంలో కంపెనీలన్నీ డిజిటల్ మార్గం పట్టే ప్రయత్నం మొదలుపెట్టాయి. క్లౌడ్ సర్వీసులకు ప్రాధాన్యమేర్పడింది. అందివచ్చిన కొత్త అవ కాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని ప్రతి కంపెనీ ఆశిం చింది. కోవిడ్ కారణంగా ఇంటికే పరిమితమైపోయి... అట్టడుగు వర్గాల నుంచి కూడా టెక్నాలజీ కోసం డిమాండ్ ఏర్పడటంతో కంపెనీలు కూడా తమ ప్రణాళికలను మార్చుకోవాల్సి వచ్చింది. టెక్నాలజీ సర్వీసులకు విపరీతమైన డిమాండ్ రావడంతో నియా మకాలు జోరందుకున్నాయి. దీని ఫలితంగా అట్రిషన్ సమస్య పుట్టుకురావడం, ఆ క్రమంలోనే ఉద్యోగుల వేతన ఖర్చులు పెర గడం జరిగిపోయింది.

రెండేళ్ల తరువాత కోవిడ్ తగ్గుముఖం పట్టడం మొదలైంది. అభివృద్ధి చెందిన దేశాల్లో ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచేశాయి. దీంతో మాంద్యం వచ్చేస్తుందన్న ఆందోళన మొదలైంది. చేతిలో ఉన్న నగదును కాపాడు కునే ప్రయత్నాల్లో భాగంగా కంపెనీలు టెక్నాలజీ రంగానికి కేటాయిం చిన నిధులకు కోత పెట్టాయి. ఇదే సమయంలో డిజిటల్ టెక్నాల జీలకు డిమాండ్ కూడా తగ్గిపోవడంతో వీటిని అభివృద్ధి చేసే కంపె నీలు ఉద్యోగులకు ఉద్వాసన పలకాల్సి వచ్చింది.

ఈ మొత్తం పరిస్థితుల్లో ఒక్క విషయమైతే స్పష్టం. భారతీయ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు పాశ్చాత్య కంపెనీల మాదిరిగా పూర్తిగా సృజ నాత్మక ఆలోచనలకు బదులు ముందుగానే నిర్ణయించిన పనులు చేయడంలోనే నిమగ్నమయ్యాయి. అమెరికా కంపెనీల మాదిరిగా సోషల్ మీడియా సృష్టించిందనుకున్న కొత్త ప్రపంచాన్ని అందుకునే ప్రయత్నాల్లో పడకుండా, భారతీయ కంపెనీలు చేసే పనుల్లోనే కొత్త కొత్త మార్గాలను అన్వేషించాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే– ఒకరు సృజనాత్మక సృష్టి చేసే వారైతే, ఇంకొకరు వాటిని అమలు చేసేవారన్నమాట. వ్యాపార పరిస్థితుల్లో వేగంగా వచ్చిన మార్పుల ప్రభావం అమలు చేసేవారిపై పెద్దగా పడలేదు. ఈ తేడా కారణంగానే భారతీయ కంపెనీల్లో పెద్ద స్థాయిలో లేఆఫ్‌లు లేకుండా పోయాయి. మంచి హోదా, వేతనం కోసం యువత ఇప్పుడు పెద్ద టెక్ కంపెనీ స్టార్టప్‌ల వైపు చూడాలి. ఓ మోస్తరు వేతనంతో స్థిరంగా ఉండాలని అనుకుంటే మాత్రం అమలు చేసేవారి వద్ద పనిచేయడం మేలు. అదన్న మాట అమెరికా, భారత కంపెనీల మధ్య తేడా!

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

లిథియం జమ్ము



జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకారం, జమ్ము కశ్మీర్‌లోని రియాసి జిల్లాలో లిథియం వనరులు 5.9 మిలియన్ టన్నులు ఉన్నట్టు అంచనా. ఎలక్ట్రానిక్ వాహనాల బ్యాటరీల తయారీలో లిథియం కీలకం. ఇప్పటివరకూ చైనాలో 5.1 మిలియన్ టన్నులు, అమెరికాలో 7.9 మిలియన్ టన్నుల లిథియం వనరులు ఉన్నాయి. కాబట్టి ఈ అంచనా నిజమైతే ఇది ఈ ప్రాంతా నికే కాదు, దేశానికే గేమ్ ఛేంజర్ అవుతుంది.

– అహ్మద్ అలీ ఫయాజ్, ఇండిపెండెంట్ జర్నలిస్ట్

అదే సమస్య



జంతువులను కౌగి లించుకోవడం స్వస్థత ఇస్తుంది. అవి కుక్కలు, పిల్లులు, పందులు, మేకలు, ఆవులు ఏవైనా. ఒక హిందువు చేయమన్నాడు కాబట్టే వాళ్లు ఆవును కౌగిలించుకోవ డాన్ని ఎగతాళి చేస్తున్నారు. వాళ్ల సమస్య ఆవు కాదు, హిందువు. (ఈ ప్రకటనను ఉపసంహరించుకున్నారు.)

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

రిస్కు తీసుకోవద్దు



ఆవులు 'పశువుల్లా' ప్రవర్తించ వచ్చు, ప్రత్యే కించి వాటిని కౌగిలించు కున్నప్పుడు. కాబట్టి వాలెం టైన్స్ డే రోజున ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచుకోండి.

– రాధికా రమేశన్, జర్నలిస్ట్

అందుకే ఉన్నాయి



ఇదొక ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో విన్నాను. 'ఈజిప్టులోని పిరమిడ్స్ ఇంకా అక్కడే ఎందుకున్నాయి? బ్రిటిష్ మ్యూజియానికి మోసుకెళ్లలేనంత బరువుగా ఉంటాయి కాబట్టి'. నవ్వొచ్చింది. కానీ ఎంత నిజం కదా!

– రిక్కీ కేజ్, సంగీత దర్శకుడు

న్యూనతకు అద్దం



ఆఫ్రికన్లు మాత్రమే మూడు రకాలుగా పెళ్లి చేసుకుం టారు. పాశ్చాత్య పద్ధతి వైట్ వెడ్డింగ్, సంప్రదాయ పెళ్లి, కోర్టు పెళ్లి. నేను ఎక్కడా ఇంత అస్తిత్వ సంక్షోభాన్నీ, సాంస్కృతిక గందరగోళాన్నీ చూడలేదు.

– అడేమోలా, ఆఫ్రికా వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఫ్యామిలీ డాక్టర్స్ విప్లవం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. కొత్తగా అనేక మెడికల్ కాలేజీల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్స్ వ్యవస్థ నిర్మాణం వంటివి ఇందులో ముఖ్యమైన మార్పులు. కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించడం వల్ల వైద్యుల సంఖ్య పెరిగి వైద్యం సులభంగా అందుబాటులోకి వస్తుంది. మెడిసిన్ చదవాల నుకునే విద్యార్థులకు అధిక సీట్లు లభ్యమవుతాయి. ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న వైద్యులపై పనిభారం తగ్గుతుంది.

ఇక ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ వినూత్నమైనది. ఈ విధానంలో ఇంటింటికీ డాక్టర్‌ను పంపించి ఇంట్లో సభ్యులందరి ఆరోగ్య చరిత్ర, ఇతర వివరాలతో డాటాను రూపొందించి దానిని వైద్యులకు అందుబాటులో ఉంచుతారు. అంటే... ఒక్కో ప్రభుత్వ ఆస్పత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద ఉండే నిర్దిష్ట కుటుంబాలకు సంబంధించిన వ్యాధులు, చికిత్సకు సంబంధించిన సమాచారం ప్రభుత్వ వైద్యులకు అందుబాటులో ఉంటుందన్నమాట. ఇందువల్ల ఆయా కుటుంబాల సభ్యులకు ఏ అనారోగ సమస్య వచ్చినా... వారి ఆరోగ్య చరిత్ర తమ దగ్గర ఉంటుంది కాబట్టి డాక్టర్లు వెంటనే రోగనిర్ధారణ చేసి చికిత్స అందించడానికి వీలు కలుగుతుంది.

ఆధునిక కాలంలో మనుషులు యంత్రాల్లా తయారై జీవన పోరాటం చేస్తున్నారు. తమ దేహం గురించిన ధ్యాస పెట్టే అవకాశమే వారికి చిక్కడంలేదు. అందువల్ల బీపీ, షుగర్ వంటి దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారు. అటువంటి వ్యాధులు తమకు వచ్చాయన్న స్పృహ కూడా వారికి కలగడంలేదు. దీంతో వ్యాధులు ముదిరి కిడ్నీ, గుండెకు సంబంధించిన సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని రోగాలు బాగా ముదిరి పోయిన స్థితిలో గుర్తించినా ఫలితం లేకుండా పోతోంది. అటువంటివారు అనేక మంది మృత్యువు వాత పడుతున్నారు. ఇటు వంటి అత్యవసర పరిస్థితుల్లోకి జనం నెట్టివేయబడకుండా ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ కాపాడుతుంది.

అలాగే తలసేమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫిలియా వంటి సమస్యలతో బాధ పడుతున్నవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ కేంద్రాలు ఉచితంగా రక్త మార్పిడి సేవలు అందిస్తున్నాయి. వీరి ఆరోగ్యానికి మరింత అండగా నిలిచే కార్యక్రమానికి ప్రభుత్వం స్వీకారం చుట్టింది. ఈ తరహా జబ్బులతో బాధపడే వారి వైద్య సేవల కోసం ప్రత్యేక వార్డులు ఆసుపత్రుల్లో ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద జగన్ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌ను ఆరోగ్యరంగంలో దేశానికి దిక్సూచిని చేయబోతున్నదని చెప్పడం అతిశయోక్తి కాదు.

– నాగెండ్ల సుమతీ రత్నం, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా

సాక్ష్యాల నమోదులో స్ఫూర్తినిచ్చే తీర్పు!

విశ్లేషణ



డాక్టర్ మంగారి రాజేందర్

ప్రాంతీయ భాషల్లో న్యాయ పాలన జరగడానికి ఉన్న అవకా శాలు మెరుగుపడుతున్నట్టు అనిపి స్తోంది. ఇటీవలి కాలంలోని పరిణా మాలు ఈ విషయాన్నే చెబుతు న్నాయి. తీర్పులను ప్రాంతీయ భాషల్లో వెలువరించడానికి సుప్రీం కోర్టు కంకణం కట్టుకుంది. ఇందు కోసం కృత్రిమ మేధస్సును వాడటమే కాకుండా... ప్రాంతీయ భాషల్లో పరిజ్ఞానం ఉన్న రిటైర్డ్ న్యాయమూర్తుల సహాయాన్నీ తీసుకుంటామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల అన్నారు. ఈ చర్యలను ప్రధాని అభినందించారు.

ఇది ఇలా ఉంటే రిపబ్లిక్ డే సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మరో ముందడుగు వేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను తెలుగులో తీసుకొచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని అన్నారు. తెలుగులో తీర్పులు కాదు, జిల్లా కోర్టుల్లో తెలుగులోనే న్యాయపాలన జరగాలని నేను అంటున్నాను. ఈ దిశగా కూడా తెలంగాణ హైకోర్టు ఒక అడుగు ముందుకు వేసినట్టుగా ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్వల్ భుయాన్ మాటల వల్ల అర్థమవుతుంది.

పెద్దపల్లి ధర్మారం మండలం నంది మేడారంలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గత ఆదివారం ఆయన జస్టిస్ నవీన్ రావు, ఇతర న్యాయ మూర్తులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆంగ్లంలో మాట్లాడితేనే న్యాయ పరిజ్ఞానం ఉన్నట్టు కాదనీ, తాను గౌహతిలో జూనియర్ సివిల్ జడ్జీల సెలక్షన్ కమిటీలో ఉన్నప్పుడు న్యాయ పరిజ్ఞానం ఉండి ఆంగ్ల పరిజ్ఞానం లేని అభ్యర్థులను ఎంపిక చేసినట్టు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అన్నారు. స్థానిక ప్రజలు మాట్లాడే భాషలోనే కోర్టులు తీర్పులు వెలువరిస్తే ప్రజలకు న్యాయవ్యవస్థ మరింత చేరువ అవుతుందని అన్నారు. తెలుగు భాష అమలు కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటు న్నట్టుగా కూడా ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

ఇది ఇలా ఉంటే సుప్రీంకోర్టు 2023 జనవరి 30న ఓ కేసులో భాష గురించిన ప్రస్తావనను తీసుకొచ్చింది. అది ఓ రేప్ కేసు. 'నైమ్ అహ్మద్ వర్సెస్ స్టేట్ (ఎన్.సి.టి. ఆఫ్ ఢిల్లీ) కేసులో జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ బెలా మాధుర్య త్రివేదీలు తీర్పు చెప్పారు. సెషన్స్ కోర్టులో వాదనలు విని పించే దశలో బాధితురాలు తన ప్రాంతీయ భాషలో సాక్ష్యం చెప్పినప్పటికీ ఆమె సాక్ష్యాన్ని ఆ భాషలో నమోదు చేయ కుండా ఇంగ్లిష్‌లో నమోదు చేసిన విషయాన్ని న్యాయ వాదులు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ



విషయం గురించి కోర్టు తన అభిప్రాయాన్ని చెప్పే ముందు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 276, 277 నిబంధనలను ఒకసారి పరిశీలించింది.

సెషన్స్ కోర్టులో సాక్ష్యాల్ని రికార్డు చేసే విషయాన్ని క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 276 చెబుతుంది. ఆ నిబంధనలోని ఉప నిబంధన ప్రకారం – సెషన్స్ కోర్టులో సాక్ష్యాన్ని బహిరంగ కోర్టులో నమోదు చేయాలి. న్యాయ మూర్తి స్వయంగా నమోదు చేయవచ్చు. ఆ పని డిక్టేషన్ ద్వారా కానీ, ఈ విషయం గురించి ప్రత్యేకంగా నియమిం చబడిన అధికారి న్యాయమూర్తి సూచనల మేరకు గానీ సాక్ష్యం నమోదు చేయవచ్చును. సాక్ష్యాలను కథనాత్మకంగా గానీ ప్రశ్నలు జవాబుల రూపంలో కానీ నమోదు చేయ వచ్చు.

కోర్టు భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు అదే భాషలో సాక్ష్యాన్ని నమోదు చేయాలి– సెక్షన్ 277(ఎ). అదే విధంగా వేరే ఇతర భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు, అవకాశం ఉన్నప్పుడు అదే భాషలో నమోదు చేయాలి. ఆ విధంగా లేనప్పుడు, సాక్షి చెప్పిన సాక్ష్యాన్ని కోర్టు భాషలోకి తర్జుమా చేసి నమోదు చేయాల్సి ఉంటుంది – సెక్షన్ 277(బి).

'మాకు వచ్చిన సమాచారం మేరకు జిల్లా కోర్టులు దాదాపుగా అన్నీ సాక్షులు చెప్పిన భాషలోనే సాక్ష్యాలను నమోదు చేయడం లేదు. ఇంగ్లిష్‌లో నమోదు చేస్తున్నాయి. న్యాయమూర్తి ఆ సాక్ష్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువాదం చేస్తు న్నారు. నిబంధన 277 ప్రకారం సాక్షి చెప్పిన భాషలోనే కోర్టులు సాక్ష్యాలను నమోదు చేయాల'ని సుప్రీంకోర్టు అభిప్రా యపడింది. కోర్టులు అనుమతించని భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు కూడా కోర్టులు ఆ భాషలోనే నమోదు చేయాలి. ఆ విధంగా వీలు కాని పరిస్థితుల్లో అంటే ఆ భాషలో రాయలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇంగ్లిష్‌లోకి అనువాదం చేయాల్సి ఉంటుంది. సాక్షి ఇంగ్లిష్‌లో సాక్ష్యం చెప్పి నప్పుడు మాత్రమే కోర్టు ఇంగ్లిష్‌లో సాక్ష్యాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే కోర్టు భాషలోకి అనువాదం అవసరం లేదని సుప్రీంకోర్టు ఈ తీర్పులో స్పష్టం చేసింది. ఒకవేళ కోర్టు భాషలో కాకుండా మరో భాషలో సాక్షి సాక్ష్యం చెప్పినప్పుడు దాన్ని యథాతథంగా కోర్టు భాషలోకి అనువాదం చేయాలని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది.

కోర్టు భాష అంటే ప్రభుత్వం, హైకోర్టులు కలిసి కోర్టులో ఏ భాషను వినియోగించాలో నిర్దేశించిన భాష. తెలుగు రాష్ట్రాలలో తెలుగు, ఇంగ్లిష్‌లలో సాక్ష్యాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

ఇతర రాష్ట్రాలను ఆనుకొని ఉన్న జిల్లాల్లో అక్కడి భాషలో కూడా సాక్ష్యాలను నమోదు చేయవచ్చు. తిరుపతి లాంటి ప్రదేశాల్లో తమిళంలో, అదే విధంగా నిజామాబాద్ లాంటి ప్రదేశాల్లో మరాఠీలో కూడా సాక్ష్యాలను నమోదు చేసే అధికారం ప్రభుత్వం కల్పించింది. కోర్టుల్లో చెప్పిన సాక్ష్యాలను కోర్టు భాషలో కానీ లేక సాక్షి చెప్పిన భాషలో కానీ నమోదు చేసి దాని అనువాదాన్ని కూడా కోర్టు రికార్డులో ఉంచాలి. సాక్షి కోర్టు అనుమతించని భాషలో చెప్పినప్పుడు ఇది తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. సాక్షి చెప్పిన భాషలో నమోదు చేసినప్పుడే వారి సాక్ష్యంలోని స్వరం బోధపడుతుంది. అదే విధంగా ఆ సాక్షి నడవడికను కూడా కోర్టు అర్థం చేసుకోవడానికి వీలవుతుందని సుప్రీం కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ఆ సాక్ష్యాన్ని కోర్టు బాగా ప్రశంసించే అవకాశం ఏర్పడుతుంది. సాక్షి వాస్త వంగా ఏమి చెప్పింది అనే విషయం తెలుసుకోవాలంటే వాళ్ళు చెప్పిన భాషలోనే పరిశీలించాల్సి ఉంటుంది.

ఈ తీర్పు తెలుగులో న్యాయపాలన జరగాలని కోరు కుంటున్న వ్యక్తులకు ఒక ఉపకరణ మాదిరిగా ఉపయోగ పడుతుంది. తన భాషలో చెప్పినది చూసినప్పుడు, చదివి నప్పుడు సాక్షి ఉద్దేశ్యాల్ని సరిగ్గా అర్థం చేసుకోవచ్చు. ఎంత మంచి అనువాదమైనా అనువాదం అనువాదమే. ఈ తీర్పును ఆధారం చేసుకొని తెలుగులో సాక్ష్యాలను నమోదు చేయాలనీ, అదే సాక్షి చెప్పిన భాషలో నమోదు చేయాలని సాక్షిగానీ, న్యాయవాదులు గానీ జిల్లా స్థాయి కోర్టులను కోరడానికి అవకాశం ఉంది. మరో విధంగా చెప్పాలంటే డిమాండ్ చేయవచ్చు కూడా.

ఈ తీర్పు ద్వారా తెలుగులో న్యాయపాలన జరగడానికి మార్గం సుగమం అవుతుంది. రెండు రాష్ట్రాల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు ఆ విధంగా జరపడానికి సుము ఖంగా ఉన్నట్టు అనిపిస్తుంది. భారత ప్రధాన న్యాయమూర్తి స్ఫూర్తి సరేసరి.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు । 94404 83001

గ్రహం అనుగ్రహం


శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.షష్ఠి తె.5.47 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్త రా.10.25 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: తె.4.05 నుండి 5.42 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం: ఉ.6.33 నుండి 8.05 వరకు, అమృతఘడియలు: ప.3.46 నుండి 5.23 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 5.55.


ప్రకాశం జిల్లా చిన్నగుడిపాడులో వృద్ధునితో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్


ఎన్టీఆర్ జిల్లా పరిటాలలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు


శ్రీకాకుళం జిల్లా పున్నానపాలెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

నేడు అంగప్రదక్షిణం టోకెన్ల కోటా విడుదల



తిరుమల/తిరుపతి అలిపిరి: తిరుమలలో మార్చి నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాతో పాటు ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు విడుదల చేయని కోటాను ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గుర్తించి ఆన్‌లైన్‌లో టోకెన్లు బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది. అలాగే తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించి ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు రూ.300 ఎస్‌ఈడీ టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. గురువారం అర్ధరాత్రి వరకు 59,090 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,593 మంది తలనీలాలు సమర్పించారు. రూ.4.03 కోట్ల కానుకలు వేశారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 14 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

అడ్డంగా బుక్కయిన సింగర్ యశస్వి

- మెడికల్ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ కోసం అడ్డదారులు
- తనకి బదులుగా మరో విద్యార్థిని ట్రైనింగ్ పంపి పట్టుబడ్డ వైనం
- ఇంటర్న్‌షిప్ అనుమతులు రద్దు చేస్తూ ఆర్ఎంసీ నిర్ణయం

కాకినాడ క్రైం: ఎంబీబీఎస్ పూర్తి చేసిన సింగర్ యశస్వి కొండేపూడి ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ కోసం అడ్డదారులు తొక్కాడు. శుక్రవారం నిర్వహించిన కీలక మెడికల్ ట్రైనింగ్‌లో మోసానికి పాల్పడి అడ్డంగా బుక్కయ్యాడు. విశాఖ ఆంధ్ర మెడికల్ కాలేజ్‌లో మెడిసిన్ చదివిన యశస్వి బీసీఎల్ఎస్ ఇంటర్న్‌షిప్ కోసం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలను ఎంచుకున్నాడు. అందులో భాగంగా బేసిక్ కార్డియో పల్మనరీ లైఫ్ సపోర్ట్ ట్రైనింగ్ శుక్రవారం కళాశాలలో జరుగుతోంది. శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ సంపాదిస్తేనే వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్ చేస్తుంది. వైద్యుడిగా అర్హత లభిస్తుంది. కీలక ట్రైనింగ్‌లో యశస్వి మోసానికి యత్నించాడు. తనకు బదులుగా ఎంబీబీఎస్ కూడా పూర్తి కాని ఓ విద్యార్థిని తన సంతకాన్ని ఎలా పెట్టాలో నేర్పి మరీ ట్రైనింగ్‌కు పంపాడు. ఫీడ్ బ్యాక్ ఫారం నింపుతున్న సమయంలో బీసీఎల్ఎస్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ పరిశీలనలో యశస్వి వ్యవహారం బట్టబయలైంది. పేరు ఒకరిది, హాజరైంది మరొకరనీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విద్యార్థిపై రంగరాయ యాజమాన్యం చర్యలకు సిఫార్సు చేసింది. రంగరాయ వైద్య కళాశాలలో హౌస్ సర్జన్సీ చేసే అనుమతులను పూర్తిగా రద్దు చేసింది. యశస్వితో పాటు సహకరించిన పీజీ వైద్యురాలిపై చర్యలకు సిద్ధమైంది.

స్టీల్‌ప్లాంట్ విప్స్‌కు జాతీయ స్థాయి అవార్డు

ఉక్కునగరం (గాజువాక): స్టీల్ ప్లాంట్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్)కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. శుక్రవారం కోల్‌కతాలో ఫోరం ఆఫ్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ 33వ జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ విప్స్‌కు నవరత్న కేటగిరీలో మూడో బెస్ట్ ఎంటర్‌ప్రైజెస్‌గా అవార్డు అందజేశారు. అదే విధంగా స్టీల్ ప్లాంట్ ఆర్అండ్‌డీ విభాగం సీనియర్ మేనేజర్ వారణాసి సుగుణ సౌమ్య ఎగ్జిక్యూటివ్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం అవార్డు, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో ఉక్కు అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ డాక్టర్ కె.ఎస్.ఎల్.వి. కృష్ణవేణికి మూడో స్థానం అవార్డు అందించారు. దక్షిణ ప్రాంత స్థాయిలో మహిళా ఉద్యోగులు చేసిన సేవలను గుర్తించి స్టీల్ ప్లాంట్ విప్స్‌ను ప్రత్యేక అవార్డుతో గౌరవించింది. కార్యక్రమంలో స్కోప్ డైరెక్టర్ జనరల్ అతుల్ సోబ్టి, పశ్చిమ బెంగాల్ హోమ్‌గార్డ్ డైరెక్టర్ జనరల్ ఎం.కె.సింగ్, స్టీల్‌ప్లాంట్ నుంచి విప్స్ ప్రతినిధులు ఎస్.భాను, సరళ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి

రూ.50 లక్షల సాయం

చిత్తూరు అర్బన్: యువగళం పాదయాత్రలో విధులు నిర్వహిస్తూ గుండె నొప్పితో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శాఖాపరంగా రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేస్తున్నామని చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి తెలిపారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాగా, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ భౌతికకాయానికి శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తి చేశారు.

బంగారు దుకాణంలో భారీ చోరీ

- 9 కేజీలకు పైగా బంగారం, భారీగా వెండి, వజ్రాలు ..
- సుమారు రూ. 5 కోట్ల విలువ
- నిందితులను పట్టుకునేందుకు 9 ప్రత్యేక బృందాలు
- తమిళనాడులో ఘటన



చోరీ జరిగిన బంగారు నగల దుకాణం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని పెరంబూరు జేఎల్ గోల్డ్ ప్యాలెస్‌లో దోపిడీ జరిగింది. వెల్డింగ్ యంత్రంతో షట్టర్‌కు రంధ్రం చేసి లోపలికి వెళ్లిన దుండగులు సుమారు రూ. 5 కోట్ల విలువ జేసే బంగారం, వజ్రాలు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసు యంత్రాంగం 9 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వివరాలు.. చెన్నై పెరంబూరు బ్యారెక్స్ రోడ్డులో జేఎల్ గోల్డ్ ప్యాలెస్ బంగారు నగల దుకాణం ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్, తొలి అంతస్తులో గోల్డ్ ప్యాలెస్ ఉంది. రెండో అంతస్తులో యజమానులు జయచంద్రన్, శ్రీధర్ కుటుంబం ఉంటోంది. గురువారం రాత్రి గోల్డ్ ప్యాలెస్‌కు తాళం వేసి పైఅంతస్తులోని ఇంటికి జయచంద్రన్, శ్రీధర్ వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయాన్నే షోరూమ్‌ను తెరిచేందుకు వచ్చి షాక్‌కు గురయ్యారు. వెల్డింగ్ యంత్రంతో షట్టర్‌కు కన్నం వేసి ఉండడంతో ఆందోళన చెందారు. లోపలికి వెళ్లి చూడగా షోకేస్‌లో ఉన్న సుమారు రూ. 5 కోట్ల విలువజేసే నగలు, వెండి వస్తువులు కనిపించలేదు. లాకర్ సైతం వెల్డింగ్ యంత్రంతో కట్ చేసి ఉండడం, అందులో ఉన్న రూ. 20 లక్షల విలువగల వజ్రాలు మాయం కావడంతో తిరువీకానగర్ పోలీసులకు సమాచారం అందించారు. అసిస్టెంట్ కమిషనర్ రమ్య భారతీ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. గోల్డ్ ప్యాలెస్ పైభాగంలో యజమాని నివాసం ఉన్నా.. ఎలాంటి చప్పుడు కాకుండా దోపిడీ జరగడంతో తెలిసిన వారి పనేనని భావిస్తున్నారు. వెళుతూ సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు.

పొంచి ఉన్న 'బ్లూబగ్గింగ్'

బ్లూటూత్, వైఫై, హాట్‌స్పాట్‌ల ఆసరాగా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు



- రద్దీ ప్రాంతాల్లో, పది మీటర్ల దూరం నుంచే ఫోన్లను హ్యాక్ చేస్తున్న వైనం
- వ్యక్తిగత సమాచారమంతా లాగేసి.. బెదిరింపులు
- దొరికినంత సొమ్ము దోచేస్తున్న మోసగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న సైబర్ పోలీసులు



విజయవాడ స్పోర్ట్స్: ఫోన్‌లో బ్లూటూత్.. వైఫై, హాట్ స్పాట్ ఎప్పుడూ ఆన్ చేసుకుని ఉంటున్నారా.. అయితే జాగ్రత్త పడండి. సైబర్ నేరగాళ్లు మాటు వేసి ఉంటున్నారు. ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారమంతా దోచేస్తున్నారు. ఆ తర్వాత వేధింపులు, బెదిరింపులతో మానసిక క్షోభకు గురి చేసి.. అందిన కాడికి దండుకుంటున్నారు. ఇటీవల ఇలాంటి బ్లూబగ్గింగ్ తరహా ఘటనలు పెరిగిపోతున్నాయి.

రద్దీగా ఉండే ప్రాంతాల్లో..

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే బ్లూ బగ్గింగ్ నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు పది మీటర్ల దూరం నుంచే బ్లూటూత్, హాట్ స్పాట్ ద్వారా 'పెయిర్' రిక్వెస్ట్‌లు పంపుతున్నారు. ఏదో పనిలో ఉండి చూసుకోకుండా 'ఓకే' బటన్ క్లిక్ చేయగానే సైబర్ నేరగాళ్ల ఫోన్‌తో మన ఫోన్ కనెక్టవుతుంది. వెంటనే మాల్‌వేర్‌తో పాటు ప్రత్యేకంగా తయారు చేసుకున్న ప్రోగ్రామింగ్‌ను ఫోన్‌లోకి పంపిస్తారు. అక్కడి నుంచి మన ఫోన్ ఆపరేటింగ్ పూర్తిగా వారి చేతిలోకి వెళ్లిపోతుంది. ఫోన్‌లో బ్లూటూత్ ఆపేసినా.. వారు అప్పటికే పంపించిన ప్రోగ్రామింగ్, మాల్‌వేర్ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండట్లేదు. సాధారణంగా వైఫై వినియోగించే వారికి తప్పనిసరిగా పాస్‌వర్డ్ ఉంటుంది. అయితే ఈ మధ్యకాలంలో కొన్ని ప్రాంతాల్లో వైఫై ఫ్రీగా లభ్యమవుతోంది. ఫోన్‌లో వైఫై ఆప్షన్ ఆన్ చేసుకున్న వారికి ఆటోమేటిక్‌గా వైఫై కనెక్ట్ అవుతోంది. ఫ్రీగా వైఫై ఇచ్చే ప్రాంతాల్లో తరచూ బ్లూబగ్గింగ్ సైబర్ నేరాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు చెబుతున్నారు. క్విక్ సపోర్ట్, టీం వ్యూయర్, ఎనీడెస్క్ తదితర యాప్స్ సాయంతో ఫోన్ ఆపరేటింగ్ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు పసిగడుతుంటారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు ముందుగా సొమ్మును దోచేస్తున్నారు. ఫొటోలు, వీడియోలను పూర్తిగా కాపీ చేసుకుని.. వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి దొరికినంత లాగేస్తున్నారు. మన ఫోన్‌కు వచ్చే కాల్స్‌ను సైబర్ నేరగాళ్లు పూర్తిగా వారి మొబైల్‌కు మళ్లించుకుంటున్న ఘటనలు కూడా జరిగాయని సైబర్ పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా కేసులు ఇప్పటివరకు విజయవాడ కమిషనరేట్ పరిధిలో 15 వెలుగు చూశాయని పోలీసులు చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలి



బ్లూ బగ్గింగ్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. బ్లూటూత్, వైఫై, హాట్‌స్పాట్‌లను అవసరమైనప్పుడే ఆన్ చేసుకోవాలి. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు వాటిని ఉపయోగించకుండా ఉంటే మంచిది. స్క్రీన్ షేర్ చేసుకునేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే పెయిర్ రిక్వెస్ట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించొద్దు.
– ఎల్.రాజవర్ష, ఎస్ఐ, సైబర్ పోలీస్‌స్టేషన్

నేటి నుంచి అరసం రాష్ట్ర మహాసభలు

తెనాలిరూరల్: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు- 80వ వార్షికోత్సవాలు శనివారం నుంచి జరగనున్నాయి. గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలోని బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రాంగణంలో సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలిరోజు అరసం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖ్‌దేవ్‌సింగ్ సిర్సా ప్రారంభోపన్యాసం చేస్తారు. ప్రారంభ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. ప్రముఖ సాహితీవేత్త, అభ్యుదయ కవి డాక్టర్ కత్తి పద్మారావు కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం నేతి పరమేశ్వరశర్మ స్మారక సంచికను ఆవిష్కరిస్తారు. అరసం 80 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానంపై తెలుగు విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి, అరసం జాతీయ నేత ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ప్రసంగిస్తారు. 'తెలుగు సాహిత్యం–దశ దిశ', 'తెలుగునాట తెలుగు భాష గమనం–గమ్యం' అన్న అంశాలపై పలువురు వక్తలు ప్రసంగిస్తారు. అనంతరం పలు రచనలు ఆవిష్కరిస్తారు. సాయంత్రం పాదయాత్ర, విజయనగరం డప్పు శ్రీను బృందం అభ్యుదయ గీతాలాపన ఉంటుంది. రెండో రోజైన ఆదివారం 'ప్రగతిశీల సాహిత్య, సాంస్కృతిక శక్తులపై దాడులు–కర్తవ్యాలు అన్న అంశంపై వక్తలు ప్రసంగిస్తారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభ నిర్వహిస్తారు.

146 గ్రామాల్లోనే 'వాల్టా'

- ఉత్తర్వులు జారీ చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- ఆ గ్రామాల్లో కొత్తగా బోర్ల తవ్వకంపై ఆంక్షలు
- మూడున్నర ఏళ్ల క్రితం వీటి సంఖ్య 1,094
- రాష్ట్రంలో వర్షాలు బాగా కురవడంతో పెరిగిన భూగర్భ జలమట్టాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూగర్భ జలమట్టాలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండే గ్రామాలు (ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ విలేజెస్) సంఖ్య గణనీయంగా తగ్గింది. మూడున్నరేళ్ల కిందట ఈ గ్రామాల సంఖ్య 1,094 ఉండేది. మూడున్నరేళ్లుగా రాష్ట్రంలో వర్షాలు బాగా కురుస్తుండటంతో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. దీంతో కేవలం భూగర్భ జలమట్టాలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండే గ్రామాలు కేవలం 146 ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ వాటర్, లాండ్ అండ్ ట్రీ యాక్ట్ (వాల్టా) అమలు చేస్తూ కొత్తగా బోర్లు, బావుల తవ్వకంపై ఆంక్షలు విధించారు. ఈ మేరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర భూగర్భ జలశాఖలు వేర్వేరుగా రెండు విడతల్లో గ్రామాల వారీగా భూగర్భ జల మట్టాల వివరాలు సేకరిస్తుంటాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూగర్భ జల మట్టాలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న గ్రామాల్లో 'వాల్టా' అమలు చేసి బోర్లు, బావుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో 12, చిత్తూరు–6, పల్నాడు–14, ప్రకాశం –53, శ్రీ సత్యసాయి–46, వైఎస్సార్ జిల్లాలో 15 గ్రామాల్లో భూగర్భ జల మట్టాలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు గుర్తించి 'వాల్టా' అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడున్నరేళ్ల కిందట 1,094 గ్రామాల్లో భూగర్భ జలమట్టాలు అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండగా, ఆ సంఖ్య గత ఏడాది 387 గ్రామాలకు తగ్గింది. ప్రస్తుతం కేవలం ఆరు జిల్లాల్లోని 146 గ్రామాల్లో మాత్రమే ఈ పరిస్థితి ఉంది. 'ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్ విలేజెస్' నుంచి బయటకు వచ్చిన గ్రామాల రైతులు కూడా వైఎస్సార్ జలకళ పథకం ప్రయోజనాలను పొందే అవకాశం ఏర్పడిందని అధికారులు వివరించారు.

లక్షచండీ మహాయజ్ఞానికి అంకురార్పణ

- కురుక్షేత్రకు 22 రాష్ట్రాల నుంచి 2,160 మంది బ్రాహ్మణులు రాక
- దేశ రక్షణ కోసమే యజ్ఞం: స్వరూపానందేంద్ర సరస్వతి


అంకురార్పణ పూజల్లో స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంతీ మాత

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రంలోని కురుక్షేత్రలో 16 రోజుల పాటు జరగనున్న లక్ష చండీ మహా యజ్ఞానికి శుక్రవారం శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన గురువందన, గోపూజలను శారదాపీఠాధిపతులు, గుంతీమాత, జాగృతి జీ నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞకర్తలకు దీక్షా వస్త్రాలు అందజేశారు. అనంతరం యజ్ఞంలో పాల్గొనే పండితులు, బ్రాహ్మణులు మండప ప్రవేశం చేశారు. గోపూజ, చండీమాతకు విశేష పూజలు నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 2,160 మంది బ్రాహ్మణులు ఈ మహాయజ్ఞంలో పాల్గొనేందుకు కురుక్షేత్ర చేరుకున్నారు. యజ్ఞశాలలో ఏర్పాటు చేసిన 110 హోమగుండాల వద్ద 1,760 మంది పండితులతో ఏకకాలంలో హోమాలు, ప్రతీ రోజూ 7,040 చండీ పారాయణ హోమాలు నిర్వహించనున్నారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. యావత్ జగత్తులో సర్వశ్రేష్ఠమైనది భారత భూమని తెలిపారు. వేద శాస్త్రాలకు, పురాణ ఇతిహాసాలకు పుట్టినిల్లుగా ఉన్న భారతావని సర్వ జగత్తుకు మార్గదర్శి అని చెప్పారు. ఆదిశంకరాచార్యులు అవతార మూర్తి అని, యజ్ఞయాగాదుల నిర్వహణపై శంకరాచార్యులు సూచించిన సిద్ధాంతాలనే విశాఖ శ్రీశారదాపీఠం అనుసరిస్తోందని తెలిపారు. లక్ష చండీ మహా యజ్ఞం చేపట్టాలన్న గుంతీమాత ఆలోచన దైవ సంకల్పమేనని అన్నారు. యాగ ఫలాలు దేశ రక్షణ కోసం అందాలని ప్రార్థించారు. యజ్ఞభూమిలో ఏర్పాటైన కాషాయ వర్ణ ధ్వజ పతాకను గుంతీమాతతో కలిసి పీఠాధిపతులు ఆవిష్కరించారు.

మరియమాతకు భక్తుల నీరాజనాలు


ప్రార్థనలు చేస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): గుణదల మేరీ మాత పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. వేలాదిగా పుణ్యక్షేత్రానికి తరలివస్తున్న భక్తులు మరియతల్లిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఉత్సవాల రెండో రోజైన శుక్రవారం విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. మరియతల్లిని ఆశ్రయిస్తే కష్టాలు దూరమై సకల శుభాలు కలుగుతాయని, ప్రతి ఒక్కరూ దేవుని యెడల విశ్వాసం కలిగి సన్మార్గంలో నడుచుకోవాలని పేర్కొన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ అనిల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ జగన్ వెంటే ఉంటా

దేవినేని ఉమాది కబ్జాల సంస్కృతి • మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తాను ఎప్పటికీ సీఎం వైఎస్ జగన్ వెంటే ఉంటానని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ స్పష్టంచేశారు. అనివార్య కారణాలవల్ల నియోజకవర్గంలో తాను కొంతకాలంగా చురుగ్గా లేనని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో కొందరు దుష్ప్రచారం చేశారన్నారు. తన మనసు సహకరించకపోతే తన పని తాను చేసుకుంటూ పోతానే తప్ప పార్టీ మారబోనన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ తనను పిలిపించి నియోజకవర్గానికి సంబంధించిన అంశాలపై తనకు స్పష్టతనిచ్చారన్నారు. మరో వారం రోజుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తానన్నారు.

టీడీపీకి లోకేశ్ పెనుభారం



లోకేశ్ పాదయాత్ర టీడీపీకి పెనుభారమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. ఇక ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు టీడీపీని ఏ విధంగా దొంగిలించాడో అదే రీతిలో మాజీమంత్రి దేవినేని ఉమా కబ్జాల సంస్కృతి నేర్చుకున్నాడని వసంత ఆరోపించారు. పార్టీ కార్యాలయం కోసం వృద్ధ మహిళ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విషయాన్ని గుర్తుచేశారు. టీడీపీ అధికారంలో ఉండగా మంత్రిగా పనిచేసిన ఉమా.. రూ.300 కోట్లపై చిలుకు ఇరిగేషన్ కాంట్రాక్టులు ఇప్పిస్తానని ఖమ్మం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.20 కోట్లు తీసుకుని ఎన్నికల్లో ఖర్చుచేశాడన్నారు. గుంటుపల్లికి చెందిన ఒక నాయకుడి వద్ద రూ.7 కోట్లు, కొండపల్లికి చెందిన మరో వ్యక్తి వద్ద రూ.5 కోట్లు, మూర్తి అనే కాంట్రాక్టర్ వద్ద రూ.3 కోట్లు తీసుకున్నాడని, మరో ఇద్దరి వద్ద రూ.50లక్షల చొప్పున తీసుకుని తిరిగి చెల్లించలేదని, పైగా వాళ్ల ఫోన్లు కూడా ఎత్తడం లేదని వసంత చెప్పారు.

విశాఖలో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ మోడల్ భవనం

తొమ్మిది నెలల్లో పూర్తి : ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్



సాక్షి, అమరావతి: ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్(ఈసీబీసీ) మోడల్ భవనాన్ని విశాఖలో నిర్మిస్తున్నట్టు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం), విశాఖ నగరపాలక సంస్థ, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) అధికారులతో శుక్రవారం ఆయన వర్చ్యువల్ సమావేశం నిర్వహించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) సహకారంతో జీ+1 అంతస్తుల ఇంధన సామర్థ్యం ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను విశాఖలో తొమ్మిది నెలల్లోనే అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. తక్కువ విద్యుత్ వినియోగం, విద్యుత్ బిల్లుల తగ్గుదల, హీటింగ్, వెంటిలేషన్, కూలింగ్ లోడ్, పగటి కాంతి వంటివి సమర్థంగా ఉపయోగించడం ఈ భవనం ప్రత్యేకతలుగా చెప్పారు. సాధారణ భవనాలకంటే 30–40 శాతం మెరుగైన భవన నిర్మాణ సాంకేతికతతో ఈసీబీసీ భవనాలుంటాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ 701 వాణిజ్య భవనాలను ఈ విధంగా నిర్మించేందుకు 'ఈసీబీసీ' ద్వారా అనుమతులిచ్చామని పేర్కొన్నారు. వీటితో పాటు దేశంలో నిర్మించే భవనాలకు వైజాగ్‌లో నిర్మించే భవనం సూపర్ మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని 541 కోర్టు భవనాలు, 100 మోడల్ పాఠశాలలు, ఒక ప్రధాన ఆస్పత్రిలో ఇంధన సామర్థ్య చర్యలు అమలు చేసినట్లు స్టేట్ డిజిగ్నేటెడ్ ఏజెన్సీ ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగంలో (వాణిజ్య భవనాలు) ఇంధన డిమాండ్ దాదాపు 4,800 మిలియన్ యూనిట్లుగా ఉందని, ఈసీబీసీని అమలు చేయడం వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్లు డి.చంద్రం, బి.రమేష్ ప్రసాద్, ఏవీవీ సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

నిందితులను చంచల్‌గూడకు తరలించండి

వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించాలని పోలీసులను సీబీఐకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసు తెలంగాణకు బదిలీ అయిన విషయం తెలిసిందే. విచారణకు స్వీకరించిన సీబీఐకోర్టు రెండు వారాల క్రితం నిందితులకు నోటీసులు జారీ చేసింది. దీంతో ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకరరెడ్డి, దస్తగిరి, శివశంకర్‌రెడ్డి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. విచారణ కోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున నిందితులు కూడా ఇక్కడే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని ఆయన తరపు న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డిపై మరో కేసు విచారణ విజయవాడలో సాగుతోందని, అతన్ని హైదరాబాద్‌లో ఉంచితే విచారణకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ...విచారణ ఉన్న రోజు అనుమతి తీసుకుని పోలీసులు తరలిస్తారని చెప్పారు. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

విభజన హామీలపై బీజేపీ అవకాశవాదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా, రాజధాని విషయంలో కేంద్రంలోని బీజేపీ పచ్చి అవకాశవాదంగా వ్యవహరిస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర హక్కులను సాధించేంతవరకు పోరాటం సాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదానీ అవినీతి కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే 'కౌ హగ్' పేరుతో భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. బీజేపీ ముద్దులతో ఆరోగ్యంగా ఉండే ఆవులకు కూడా జబ్బులొస్తాయని చమత్కరించారు. ఈ రోజు ముద్దులని, రేపు పెళ్లి చేసుకోవాలని కూడా కోరతారేమోనన్నారు. ఇది వ్యక్తుల స్వేచ్ఛపై దాడి తప్ప దేశభక్తి కాదన్నారు.

క్లుప్తంగా...

హెచ్-1బీ, ఎల్1 రెన్యువల్ ఇక అమెరికాలోనే

వాషింగ్టన్: 'డొమెస్టిక్ వీసా రీవాలిడేషన్' ప్రక్రియను పునఃప్రారంభించాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అమెరికాలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు, ప్రధానంగా భారతీయులకు ఎక్కువ మేలు జరుగనుంది. హెచ్-1బీ, ఎల్1 వంటి నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల గడువు ముగిస్తే స్వదేశానికి తిరిగి వెళ్లి, రెన్యువల్ చేసుకోవాల్సిన పని ఉండదు. అమెరికాలోనే ఆ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. 2004 వరకూ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల రెన్యువల్, ఎక్స్‌టెన్షన్ స్టాంపింగ్‌ను అమెరికాలోనే చేసేవారు. తర్వాత ఈ విధానాన్ని రద్దుచేశారు. ఇప్పుడు పునరుద్ధరించబోతున్నారు. త్వరలోనే ఇది అమల్లోకి రాబోతోంది.

బీబీసీని నిషేధించాలన్న పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(బీబీసీ)పై పూర్తిస్థాయిలో నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. 2002 నాటి గుజరాత్ అల్లర్లపై ఇటీవల బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో బీబీసీని పూర్తిగా నిషేధించాలంటూ హిందూసేన అధ్యక్షుడు విష్ణు గుప్తా, రైతు బీరేంద్రకుమార్ సింగ్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇది జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బీబీసీ గురించి తప్పుగా అర్థం చేసుకొని ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు ఉన్నారని వెల్లడించింది.

పాత బడ్జెట్ చదివిన గెహ్లాట్

రాజస్తాన్ అసెంబ్లీలో కలకలం..

జైపూర్: రాజస్తాన్ రాష్ట్ర 2023-24 వార్షిక బడ్జెట్ సమావేశాల్లో పొరపాటు జరిగింది. ఆర్థికశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం అశోక్ గెహ్లాట్ శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే, పొరపాటున గత ఏడాది బడ్జెట్ వివరాలను చదివారు. సభలో గందరగోళం చెలరేగడంతో తప్పును గ్రహించి ఆయన క్షమాపణ చెప్పారు. అయితే, వివరాలు ముందుగానే లీకయ్యాయని, బడ్జెట్‌ను మరో రోజు ప్రవేశపెట్టాలంటూ ప్రతిపక్ష బీజేపీ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో అసెంబ్లీ రెండుసార్లు వాయిదాపడింది. బీజేపీ అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని సీఎం గెహ్లాట్ అన్నారు. బడ్జెట్ లీక్ కాలేదన్నారు. బడ్జెట్ ప్రసంగం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డ్రామా ఆడుతోందని వ్యాఖ్యానించారు. ఇలా జరగడం దురదృష్టకరమని స్పీకర్ సీపీ జోషి అన్నారు.

హృదయ విదారకం

తుర్కియే, సిరియాలో ముమ్మరంగా శిథిలాల తొలగింపు

- 100 గంటల తర్వాత ప్రాణాలతో బయటపడుతున్న పలువురు!
- మూత్రం తాగి ప్రాణాలు నిలుపుకున్న వైనం
- 22 వేలు దాటిన మృతులు

అంకారా/న్యూఢిల్లీ: తుర్కియే(టర్కీ), సిరియాలో భూకంప మృతుల సంఖ్య ఏకంగా 22,000 దాటింది. సహాయక చర్యలతోపాటు శిథిలాల తొలగింపు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. భీకర భూకంపం సంభవించి 100 గంటలు గడిచిపోయింది. శిథిలాల కింద మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. కొందరు సజీవంగా బయటపడడం ఊరట కలిగిస్తోంది. తుర్కియేలో శిథిలాలను తొలగిస్తుండగా శుక్రవారం ఒక్కరోజే 100 మందికిపైగా బాధితులు ప్రాణాలతో బయటకు వచ్చారు. కొన్నిచోట్ల హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి. తీవ్రమైన చలిలో ఆకలి బాధలతో ప్రాణాలు నిలుపుకొనేందుకు వారుపడిన కష్టాలు వర్ణనాతీతం. శిథిలాల కింద ఇరుక్కుపోయి, బయటపడే మార్గం లేక కేవలం మూత్రం తాగి ఆకలిదప్పులు తీర్చుకున్నామని బాధితులు చెబుతుండడం కన్నీరు పెట్టిస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. తుర్కియేలో అంత్యక్రియల కోసం తీసుకొస్తున్న మృతదేహాలతో ఇప్పటికే శ్మశానాలు కిక్కిరిసిపోతున్నాయి. చాలా సమయం వేచి చూడాల్సి వస్తోందని మృతుల బంధువులు చెబుతున్నారు. ఈ భూకంపం 'ఈ శతాబ్దపు విపత్తు' అని తుర్కియే అధ్యక్షుడు తయీప్ ఎర్డోగాన్ వ్యాఖ్యానించారు. భూకంపం వల్ల తీవ్రంగా నష్టపోయిన తుర్కియేకు దాదాపు 95 దేశాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. సిరియా అధ్యక్షుడు బషర్ అసద్, ఆయన భార్య అస్మా శుక్రవారం అలెప్పో యూనివర్సిటీ ఆసుపత్రిలో భూకంప మృతులను పరామర్శించారు. భూకంపం సంభవించినప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే మొదటిసారి.

75,000 మంది నిరాశ్రయులు

భూకంపం వల్ల తుర్కియేలో ఇప్పటిదాకా 18,900 మంది మరణించారని, దాదాపు 75,000 మంది గాయపడ్డారని తుర్కియే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ వెల్లడించింది. ఇళ్లు కూలిపోవడంతో 75,000 మందికిపైగా జనం నిరాశ్రయులైనట్లు అంచనా వేస్తున్నామని తెలిపింది. సిరియాలో భూకంపం కారణంగా 3,300 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వం ధ్రువీకరించింది. రెండు దేశాల్లో కలిపి ఇప్పటివరకు 22,000 మందికి పైగా బలైనట్లు తెలుస్తోంది. తుర్కియేలో 12,000 దాకా భవనాలు నేట్టమట్టం కావడమో లేక దెబ్బతినడమో జరిగిందని మంత్రి మురాత్ కరూమ్ చెప్పారు.

తుర్కియే ప్రజలకు అండగా ఉంటాం: మోదీ

'ఆపరేషన్ దోస్త్'లో భాగంగా తుర్కియేలో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో మన దేశ సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం తెలిపారు. రిలీఫ్, రెస్క్యూ ఆపరేషన్లలో చురుగ్గా పాల్గొంటున్నాయని చెప్పారు. సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రాణాలను, ఆస్తులను కాపాడడానికి మన బృందాలు కృషి చేస్తూనే ఉంటాయని ట్విట్టర్‌లో వెల్లడించారు. ఈ సంక్షోభ సమయంలో తుర్కియే ప్రజలకు భారత్ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు.



ఈ ఫొటోల్లో ఉన్న మృత్యుంజయులిద్దరూ భార్యాభర్తలు. పేరు రజియే కిలింక్ (పైన), ఆమె భర్త హసీ మురత్ కిలింక్ (కింది ఫొటో). టర్కీలోని ఇస్కెందరన్‌లో భవన శిథిలాల కింద ఏకంగా 109 గంటలపాటు ప్రాణాలను నిలుపుకుని ఇలా సజీవంగా బయటపడ్డారు.





ఇతని పేరు ఎయుప్ ఎక్. 60 ఏళ్ల వృద్ధుడు. టర్కీలోని అదియమన్‌లో శిథిలాల్లో చిక్కిన ఇతను ఏకంగా 104 గంటల పాటు మృత్యువుతో పోరాడి గెలిచాడు! చివరికి శుక్రవారం జర్మనీ నుంచి వచ్చిన ఎమర్జెన్సీ రెస్క్యూ బృందాలు ఆయన్ను కాపాడి ఇలా అంబులెన్స్‌లో హుటాహుటిన ఆస్పత్రికి తరలించాయి.



దక్షిణ టర్కీలోని కరమన్మారస్‌లో ఈ బాలిక మొక్కవోని ధైర్యంతో ఏకంగా 100 గంటలకు పైగా శిథిలాల కింద గడిపింది. శుక్రవారం ఉదయం సురక్షితంగా బయట పడింది.



ఇతను అద్నాన్ మొహమ్మెట్ కొర్కుట్. దక్షిణ తుర్కియేలోని గాజియన్‌తెప్‌లో శిథిలాల కింద చిక్కుబడ్డాడు. దాదాపు 100 గంటల తర్వాత శుక్రవారం సహాయ బృందాలు ఇతన్ని గుర్తించి జాగ్రత్తగా బయటికి తీశాయి.

భారత సౌభాగ్యంతోనే ప్రపంచ సౌభాగ్యం

- పెట్టుబడులకు స్వర్గం యూపీ
- లక్నో అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ



లక్నో: ప్రపంచ సౌభాగ్యం భారతదేశ అభివృద్ధితో ముడిపడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశ ఉజ్వల భవిష్యత్తే ప్రపంచ ఉజ్వల భవిష్యత్తుకు హామీ అని స్పష్టం చేశారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని దేశ విదేశీ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమైంది. విదేశీ ప్రతినిధులకు, దేశీయ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రపంచ ఆర్థిక ప్రగతి ఇండియాతో అనుసంధానమై ఉందని చెప్పారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారిందని వివరించారు. ఇక్కడున్న అపార అవకాశాలను అందిపుచ్చుకోవాలని పెట్టుబడిదారులకు సూచించారు. ఇండియా ప్రగతికి ఉత్తరప్రదేశ్ కీలకమైన నాయకత్వాన్ని అందిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలి సంక్షోభాల నుంచి భారత్ వేగంగా బయటపడిందని, దేశ ఆర్థిక పరిస్థితి స్థిరంగా కొనసాగుతోందని చెప్పారు. భారతీయుల్లో ఆత్మవిశ్వాసం పెరగడమే ఇందుకు కారణమని అన్నారు. దేశంలో యువత ఆలోచనా ధోరణిలో, సమాజం ఆకాంక్షల్లో భారీ మార్పు కనిపిస్తోందని వివరించారు. సాధ్యమైనంత త్వరగా మరింత అభివృద్ధిని చూడాలని ప్రతి భారతీయుడూ కోరుకుంటున్నాడని వెల్లడించారు.

ఆరేళ్లలో యూపీకి సొంత గుర్తింపు

భారత్‌లో సంస్కరణల పర్వం కొనసాగుతుందని మోదీ తెలియజేశారు. ఆధునిక భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్నామని చెప్పారు. ఉత్తరప్రదేశ్ గతంలో 'బీమారు' రాష్ట్రాల్లో ఒకటిగా ఉండేదని, ఇప్పుడు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని వ్యాఖ్యానించారు. ఆరేళ్ల వ్యవధిలో సొంత గుర్తింపును సాధించిందని చెప్పారు. సుపరిపాలన, మెరుగైన శాంతి భద్రతలు, స్థిరత్వం వంటి వాటితో సంపద సృష్టికర్తలకు అవకాశాల గనిగా మారిందన్నారు. సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పారిశ్రామికవేత్తలు ముకేశ్ అంబానీ, కుమార మంగళం బిర్లా, ఎన్.చంద్రశేఖరన్ తదితరులు మాట్లాడారు. వివిధ కంపెనీలతో 18,000 ఎంఓయూ కుదుర్చుకుంటామని యోగి వివరించారు.

మధ్యతరగతి బడ్జెట్

ముంబై: కేంద్రం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో మధ్యతరగతిని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. యూపీఏ పాలనలో ప్రజల ఆదాయంపై 20 శాతం దాకా పన్ను ఉండేదని, ఈ బడ్జెట్‌లో సున్నా శాతం పన్ను విధించినట్లు గుర్తుచేశారు. ముంబైలో ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ నుంచి షోలాపూర్, షిర్డీకి వందేభారత్ రైళ్లను మోదీ శుక్రవారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. వేతన జీవులను, మధ్యతరగతి ప్రజలను బడ్జెట్ సంతోషపెట్టిందని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. తమ నియోజకవర్గాల్లోని స్టేషన్లలో రైళ్లను ఒక ట్రెండు నిమిషాలపాటు ఆపాలని గతంలో లేఖలు రాసిన ఎంపీలు ఇప్పుడు వందేభారత్ రైళ్ల కోసం డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి నారాయణ్ రాణే, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో 59 లక్షల టన్నుల లిథియం

న్యూఢిల్లీ: బ్యాటరీలు, విద్యుత్ పరికరాల తయారీలో ఉపయోగించే అత్యంత కీలకమైన లిథియం నిక్షేపాలను తొలిసారిగా మన దేశంలో గుర్తించారు. జమ్మూకశ్మీర్‌లో దాదాపు 59 లక్షల టన్నుల లిథియం నిల్వలు ఉన్నట్లు కేంద్ర గనుల శాఖ వెల్లడించింది. ''జమ్మూకశ్మీర్‌లోని రిసాయి జిల్లా సలాల్ హైమనా ప్రాంతంలో లిథియం నిల్వలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) గుర్తించింది'' అని ట్వీట్ చేసింది. గనుల శాఖ 2018-19లో నిర్వహించిన సర్వేలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 51 ఖనిజ క్షేత్రాలను కనిపెట్టింది. సంబంధిత సమాచారాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు చేరవేసింది. బంగారంతో పాటు పొటాషియం, మాలిబ్డినం, ఇంకా ఇతర ప్రాథమిక లోహాల నిక్షేపాలను 11 రాష్ట్రాల్లో గుర్తించారు. బంగారం నిల్వలను 5 క్షేత్రాలను కనుగొన్నారు. జమ్మూకశ్మీర్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, జార్ఖండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గనుల శాఖ తెలిపింది. భారత్ ప్రస్తుతం లిథియంను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. విద్యుత్ వాహనాల తయారీలో లిథియం చాలా కీలకం. ఇప్పుడు ఈ ఖనిజ నిల్వలు జమ్మూకశ్మీర్‌లో బయటపడడంతో రాబోయే రోజుల్లో దేశంలో విద్యుత్ వాహనాల తయారీ రంగం వేగం పుంజుకోనుంది. లిథియం దిగుమతుల భారం పెద్దగా ఉండదు కాబట్టి విద్యుత్ వాహనాల ధరలు దిగివచ్చే అవకాశాలున్నాయి. స్మార్ట్‌ఫోన్ల తయారీలోనూ లిథియం ఉపయోగిస్తారు.

మోత మోగేనా?



2018 అసెంబ్లీ ఎన్నికలు. లెఫ్ట్ కూటమి పాతికేళ్ల పాలనతో విసిగిపోయిన త్రిపుర ప్రజలను బీజేపీ అభివృద్ధి మంత్రం ఆకట్టుకుంది. దాని భాగస్వామ్య పార్టీ ఐపీఎఫ్‌టీకి గిరిజనుల్లో ఉన్న ఆదరణ తోడైంది. దాంతో 60 సీట్లకు గాను కాషాయ పార్టీ ఏకంగా 36 స్థానాల్లో నెగ్గింది. ముఖ్యంగా 20 ఎస్టీ స్థానాల్లో ఏకంగా 17 సీట్లను కొల్లగొట్టింది! ఐదేళ్ల తర్వాత పరిస్థితులు తారుమారవుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్ర నినాదంతో రాజకీయ పార్టీ అవతారమెత్తిన ఉద్యమ సంస్థ టిప్రా మోతా ఈసారి అధికార పార్టీ పుట్టి ముంచేలా కన్పిస్తోంది...

ఆసక్తికరంగా త్రిపుర ఎన్నికలు

- బీజేపీని వణికిస్తున్న టిప్రా మోతా
- తిప్రాలాండ్ హామీకి జైకొడుతున్న గిరిజనులు
- 20 ఎస్టీ సీట్లలో అధికార పార్టీకి గట్టి సవాలు
- గిరిజన ప్రాబల్యమున్న 23 స్థానాల్లోనూ దెబ్బే
- హంగ్ వస్తే కింగ్‌మేకర్‌గా మారనున్న మోతా!

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరుతోంది. పోలింగ్ (ఫిబ్రవరి 16) తేదీ సమీపిస్తున్న కొద్దీ పార్టీలన్నీ అమ్ములపొదుల్లోంచి అన్ని అస్త్రాలూ బయటికి తీస్తున్నాయి. రాష్ట్రంలో పాతికేళ్ల లెఫ్ట్ పాలనకు 2018 ఎన్నికల్లో బీజేపీ తెర దించింది. గిరిజనుల్లో బాగా పట్టున్న ఐపీఎఫ్‌టీ పార్టీతో జట్టు కట్టి ఘన విజయం సాధించింది. సీపీఎం 16 సీట్లకు పరిమితం కాగా కాంగ్రెస్ సోదిలోకూడా లేకుండా పోయింది. ఈసారి మాత్రం టిప్రా మోతా రూపంలో కొత్త పార్టీ తెరపైకి రావడంతో సమీకరణాలన్నీ మారిపోయాయి.

మొత్తం అసెంబ్లీ స్థానాలు	60
జనరల్	30
ఎస్టీ	20
ఎస్సీ	10

కులాలవారీగా త్రిపుర జనాభా (శాతాల్లో)	
జనరల్	16
బీసీలు	21
ఎస్సీలు	20
ఎస్టీలు	32
ముస్లింలు	9
క్రిస్టియన్లు	2

పరిస్థితి తారుమారు...

త్రిపుర మాజీ రాజ కుటుంబానికి చెందిన ప్రద్యోత్ బిక్రం మాణిక్యదేబ్ బర్మన్ సారథ్యంలో కొంతకాలంగా ప్రత్యేక గిరిజన రాష్ట్రం కోసం పోరాడుతున్న టిప్రా (త్రిపుర ఇండిజినస్ ప్రోగ్రెసివ్ రీజనల్ అలయన్స్) మోతా ఈసారి పార్టీగా రూపాంతరం చెందింది. బీజేపీతో పొత్తు ప్రయత్నాలు విఫలం కావడంతో ఒంటరిగానే రంగంలోకి దిగి పోటీని ముక్కోణంగా మార్చేసింది. అధికార బీజేపీ కూటమికి గట్టి సవాలు విసురుతోంది. మూలవాసులైన గిరిజనులకు ప్రత్యేక రాష్ట్రంగా గ్రేటర్ తిప్రాలాండ్‌ను సాధిస్తామన్న మోతా హామీ ఎస్టీలను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా గత ఎన్నికల్లో ఐపీఎఫ్‌టీతో పొత్తు ద్వారా బీజేపీ కొల్లగొట్టిన గిరిజన ఓట్లు ఈసారి చాలావరకు మోతావైపు మళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. గిరిజనుల్లోని లెఫ్ట్ ఓటు బ్యాంకుకూ మోతా గండి కొట్టేలా ఉంది. త్రిపురలో గిరిజన ప్రాబల్యం ఎక్కువ. మొత్తం 60 అసెంబ్లీ స్థానాల్లో 20 వారికి రిజర్వయ్యాయి. అంతేగాక మరో 23 గిరిజనేతర స్థానాల్లోనూ 10 శాతానికి పైగా ఉన్న ఎస్టీలు అక్కడా నిర్ణయాత్మకంగానే ఉన్నారు. 2018లో బీజేపీ కూటమి 20 ఎస్టీ సీట్లలో ఏకంగా 17 స్థానాలను దక్కించుకుంది! అలా బీజేపీ కూటమికి అధికారంలోకి రావడంలో కీలకంగా మారిన గిరిజన ఓట్లరు ఈసారి టిప్రా మోతాకే ఓటేస్తామని బహిరంగంగానే చెబుతున్నారు. ఈ సీట్లలో ముఖ్యంగా గిరిజనులు 60 శాతానికి పైగా ఉన్న 12 చోట్ల మోతాకు విజయావకాశాలు అధికంగా కన్పిస్తున్నాయి. 50-60 శాతం మధ్య ఉన్న 5 స్థానాల్లో మోతా గట్టి పోటీ ఇవ్వనుండగా 50 శాతం కంటే తక్కువగా ఉన్న మిగతా మూడు చోట్ల ముక్కోణ పోరు జరిగేలా కన్పిస్తోంది. ఎలా చూసినా బీజేపీ కూటమికి ఈ 20 సీట్లలో ఈసారి రెండు మూడు సీట్లకు మించి దక్కకపోవచ్చని అంచనా. దీనికి తోడు గిరిజన ప్రాబల్యమున్న 23 గిరిజనేతర అసెంబ్లీ స్థానాల్లో కూడా మోతా ఏకంగా 22 చోట్ల పోటీకి దిగడం బీజేపీకి నిద్ర లేకుండా చేస్తోంది. బీజేపీ కూటమి 12 నుంచి 15 సీట్లు కోల్పోయి హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చని అంచనా. 10 నుంచి 15 సీట్లు గెలిచేలా కన్పిస్తున్న మోతా కింగ్‌మేకర్ అయ్యే అవకాశం లేకపోలేదంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓట్ల చీలికపైనే లెఫ్ట్ ఆశలు

గత ఎన్నికలఓల 42 శాతానికి పైగా ఓట్లు సాధించినా సీట్ల లెక్కలో వెనకబడ్డ సీపీఎం, ఈసారి ఓట్ల చీలికపై బాగా ఆశలు పెట్టుకుంది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమిని ఓడించేందుకు శత్రుత్వాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్‌తో జట్టు కట్టింది. 20 గిరిజన సీట్లతో పాటు 22 గిరిజనేతర స్థానాల్లో బీజేపీ ఓటు బ్యాంకుకు మోతా గండికొట్టనుండటం సీపీఎం-కాంగ్రెస్ కూటమికి కలిసొచ్చేలా కన్పిస్తోంది. దీనికి తోడు 2.5 లక్షల ఉద్యోగాలు తదితర హామీలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. కాకపోతే కాంగ్రెస్ ఓటర్లలో చాలామంది పొత్తును గౌరవించి సీపీఎం అభ్యర్థులకు ఓటేసేందుకు సిద్ధంగా లేరు. ఏడు దశాబ్దాల వైరాన్ని, అధికారంలో ఉండగా తమపట్ల సీపీఎం అనుసరించిన అణచివేత ధోరణిని మర్చిపోలేమని స్పష్టంగా చెబుతున్నారు. అయితే ముస్లింల్లో అత్యధికులు లెఫ్ట్ వైపే మొగ్గుతున్నారు.

బీజేపీ.. అభివృద్ధి మంత్రం

2018లో బీజేపీ అభివృద్ధి నినాదాన్ని జనం నమ్మడంతో ఆ పార్టీ ఏకంగా 43 శాతం ఓట్లు సాధించింది! ఆశించిన అభివృద్ధి కనిపించలేదన్న అసంతృప్తి జనాల్లో ఉంది. శాంతిభద్రతలు క్షీణించాయన్నది మరో పెద్ద ఆరోపణ. అయితే మరోసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూస్తామంటున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంది. పీఎం ఆవాస్ యోజన మొదలుకుని కిసాన్ సమ్మాన్ నిధి దాకా పలు కేంద్ర పథకాల లబ్ధిదారులు ఎక్కువగానే ఉన్నారు. వీరిలోనూ మహిళల సంఖ్య ఎక్కువ. వారు మళ్లీ బీజేపీకే ఓటేస్తామంటున్నారు. పైగా సీఎం మాణిక్ సాహాకు ప్రజల్లో మంచి పేరుంది. కానీ 9 నెలల క్రితం దాకా సీఎంగా ఉన్న బిప్లబ్ దేబ్ పట్ల జనంలో ఉన్న వ్యతిరేకత బీజేపీకి నష్టం చేసేలా కన్పిస్తోంది. పైగా 2018లో గిరిజనుల్లో మంచి ఆదరణతో 8 సీట్లు సాధించిన భాగస్వామ్య పార్టీ ఐపీఎఫ్‌టీ ఆ తర్వాత అధ్యక్షుడు ఎన్.సి.దేబ్‌బర్మ మృతితో బాగా బలహీనపడింది. దాంతో బీజేపీ ఈసారి ప్రభుత్వ పథకాలనే నమ్ముకుని వాటిపై భారీ ప్రచారంతో హోరెత్తిస్తోంది. రాష్ట్రమంతటా కాషాయ జెండాలే ఎగురుతున్నాయి! ఎక్కడికక్కడ పోలింగ్ బూత్ కార్యాలయాలు తెరిచి తమ నేతలు, కార్యకర్తలను ఓటర్లతో నిత్యం టచ్‌తో ఉంచుతూ అధికార పార్టీ పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు పోతోంది. హిందువుల్లో అత్యధికులైన బెంగాలీలు, ఎస్టీల్లో ఎగువ కులాల వారు బీజేపీ వైపే మొగ్గుతున్నారు. ఇక గిరిజన స్థానాల్లోని బెంగాలీలు బీజేపీకి, ముస్లింలు సీపీఎంకు జై కొడుతున్నారు.



ఈవిడ పేరు హాటిస్. కరమన్మారస్‌లోనే శిథిలాల కింద చిక్కింది. అయినా కుంగిపోకుండా ఏకంగా 92 గంటల పాటు ప్రాణాల కోసం పోరాడి గెలిచింది. శుక్రవారం ఉదయం సజీవంగా బయటికొచ్చింది. అంబులెన్స్ ఎక్కుతూ కూడా అక్కడివారికేసి నవ్వుతూ చేయి ఊపింది!



ఈ చిన్నారికి ఏడేళ్లు. పేరు జనా అల్ అబ్దో. ఉత్తర సిరియాలో ఇద్లిబ్ ప్రావిన్స్‌లో భూకంపం బారిన పడి శిథిలాల కింద చిక్కుకుపోయింది. 70 గంటలకు పైగా నరకం అనుభవించినా ధైర్యం కోల్పోలేదు. చివరికిలా సజీవంగా బయట పడింది. ఆస్పత్రికి తరలించగా క్రమంగా కోలుకుంటోంది. కానీ సొంతవాళ్లంతా భూప్రకోపానికి బలవడంతో అనాథగా మారింది!

అదానీ అంశంపై ప్రశ్నిస్తూనే ఉంటాం: ఖర్గే



న్యూఢిల్లీ: అదానీ అంశాన్ని పార్లమెంట్ లోపలా, బయటా లేవనెత్తుతూనే ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఇది చాలా పెద్ద కుంభకోణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అదానీ అంశంతోపాటు తన, పార్టీ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడం తదితర 10 ప్రశ్నలను ఆయన ప్రభుత్వానికి సంధించారు. ప్రజల డబ్బుకు సంబంధించిన అదానీ అంశం పెద్ద కుంభకోణమని ఖర్గే పేర్కొన్నారు. 'దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోంది? ఆర్‌బీఐ, సెబీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థలు తమ విధులను నిర్వర్తించకుండా ఎందుకు చేశారు? కుంభకోణాలెన్ని జరిగినా మౌనంగా ఉన్నారెందుకు?అని ఆయన అన్నారు. వీటిపై పార్లమెంట్ వెలుపల, లోపల ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. వీటిపై ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకుండా, నియంత మాదిరిగా వ్యవహరిస్తానంటే ప్రజలు ఈ ప్రభుత్వాన్ని సాగనంపుతారని హెచ్చరించారు. రాజ్యసభలో ప్రశ్నలు మాత్రమే అడిగాను తప్ప ఎలాంటి అన్‌పార్లమెంటరీ మాటలు మాట్లాడలేదన్నారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ, రాజ్యసభ రికార్డుల నుంచి తన మాటలను తొలగించడంపై ఆయన.. ప్రజాస్వామ్యం పేరుతో ఏం జరుగుతోందో మీరే ఊహించుకోండని వ్యాఖ్యానించారు. తన మిత్రుడి కుంభకోణాల మకిలిని పోగొట్టేందుకు ప్రధాని మోదీ పార్లమెంట్‌ను వాషింగ్ మెషీన్‌లాగా వాడుకుంటున్నారని ఖర్గే ట్వీట్ చేశారు.

క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా



కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి దాడులు తీవ్రతరం చేసింది. కీలక పారిశ్రామిక ప్రాంతం డోన్‌బాస్‌పై గురిపెట్టింది. లుహాన్‌స్క్, డొనెట్‌స్క్ ప్రావిన్స్‌లతోపాటు రాజధాని కీవ్, లీవ్‌పైనా క్షిపణి దాడులు జరిగాయని ఉక్రెయిన్ సైనిక వర్గాలు తెలిపాయి. ''గురువారం సాయంత్రం నుంచి 71 క్రూయిజ్ క్షిపణులను, 35 ఎస్-300 క్షిపణులను, 7 షహెడ్ డ్రోన్లను ప్రయోగించారు. 61 క్రూయిజ్ మిస్సైళ్లు, 5 డ్రోన్లను కూల్చేశాం'' అని చెప్పింది. విద్యుత్ వ్యవస్థలపై దాడులతో కొన్ని ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఖర్కీవ్‌లో క్షిపణి దాడిలో ఏడుగురు గాయపడినట్లు అధికారులు చెప్పారు. జపొరిజియాపై గంట వ్యవధిలోనే 17సార్లు క్షిపణి దాడులు జరిగాయి. ఐదు క్షిపణులను, 5 షాహెద్ కిల్లర్ డ్రోన్లను కూల్చివేశామన్నారు. రష్యా క్షిపణులు రెండు రొమేనియా, మాల్డోవా గగనతలంలోకి వెళ్లినట్లు ఉక్రెయిన్ సైనిక జనరల్ ఒకరు చెప్పారు. నిరసనగా మాల్డోవా తమ దేశంలోని రష్యా రాయబారికి సమన్లు పంపింది. డొనెట్‌స్క్‌లో రష్యా అదనంగా బలగాలను రంగంలోకి దించింది. లుహాన్‌స్క్ ప్రావిన్స్‌పై పట్టు సాధించేందుకు రష్యా ఆర్మీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

అనారోగ్యంతో ఆస్పత్రిలో శిబు సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) చీఫ్ శిబు సోరెన్(79) అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. ఆయనకు జరిపి శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌ను గుర్తించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సోరెన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్స కొనసాగుతోందని ఆయన కుమారుడు జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ట్వీట్ చేశారు. 2005-10 మధ్య సోరెన్ జార్ఖండ్ సీఎంగా పనిచేశారు. లోక్‌సభకు 8 పర్యాయాలు ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపీ రజనీపై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: నిబంధనలకు విరుద్ధంగా రాజ్యసభ కార్యకలాపాలను ఫోన్‌లో చిత్రిస్తున్న కాంగ్రెస్ ఎంపీ రజనీ అశోక్‌రావ్ పాటిల్‌ను సభాధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్ శుక్రవారం సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలయ్యే దాకా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీలపై ఆయన చర్యలు తీసుకోవడం ఇదే ప్రథమం. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానానికి ప్రధాని మోదీ సమాధానమిస్తుండగా విపక్ష సభ్యుల నిరసనను పాటిల్ వీడియో తీశారు. ఆమెను సస్పెండ్ చేయాలంటూ రాజ్యసభ నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం ధన్‌ఖడ్ అన్ని పార్టీల నేతల అభిప్రాయం కోరారు. ఆమెపై చర్య తీసుకునే ముందు విచారణ జరిపితే బాగుంటుందని వారన్నారు.



ఈ వృద్ధురాలిని కూడా కరమన్మారస్‌లోనే భవన శిథిలాల నుంచి 87 గంటల అనంతరం ప్రాణాలతో బయటికి తీశారు.



ఇతన్ని కరమన్మారస్‌లో సహాయ బృందాలు 87 గంటల అనంతరం గురువారం శిథిలాల నుంచి సజీవంగా కాపాడాయి.



ఈ బుజ్జి కుక్క పిల్ల పేరు పముక్. టర్కీలోని హతాయ్ వద్ద 72 గంటల తర్వాత శిథిలాల నుంచి ఇలా సజీవంగా బయట పడింది!

బెంగళూరుకు చెందిన ఇంజినీర్ టర్కీలో అదృశ్యం


విజయ్‌కుమార్(ఫైల్)

యశవంతపుర: బెంగళూరుకు చెందిన ఇంజినీర్ టర్కీలో చోటు చేసుకున్న భూకంపంలో గల్లంతయ్యాడు. వివరాలు.. డెహ్రాడూన్‌కు చెందిన విజయ్‌కుమార్ బెంగళూరులో పీణ్యలోని నైట్రోజన్ ఉత్పత్తి సంస్థలో తమ్ముడితో కలిసి ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. అదే ప్రాంతంలో ఇద్దరూ నివాసం ఉంటున్నారు. ఫ్యాక్టరీకి అవసరమైన పరికరాల కోసం విజయ్‌కుమార్ నాలుగు నెలల క్రితం టర్కీకి వెళ్లారు. టర్కీలో భూకంపం వచ్చినప్పటినుంచి విజయ్‌కుమార్ నుంచి ఫోన్ రాలేదని తమ్ముడు అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఫోన్ చేసి మాట్లాడాడని, ఆ తర్వాత అతని నుంచి ఎలాంటి సమాచారం లేదని అరుణ్‌కుమార్ తెలిపారు.

న్యూస్‌రీల్

బండహళ్లి గ్రామంలో వీరగల్లు శిలాశాసనం


వీరగల్లు శిలాశాసనం వద్ద ప్రమోద్‌కుమార్

చిక్కబళ్లాపురం: తాలూకాలోని బండహళ్లి గ్రామంలో 8వ శతాబ్దానికి చెందిన వీరగల్లు శాసనం బయటపడి పడినట్లు గుల్బర్గాలోని శ్రీసత్యసాయి మానవ అభ్యుదయ విశ్వవిద్యాలయంలో చరిత్ర చదువుతున్న ప్రమోద్ కుమార్ తెలిపారు. కన్నడలో ఉన్న శాసనాన్ని ప్రొఫెసర్లు మంజునాథ్ హేమంత్‌కుమార్, మునిరత్నం రెడ్డి సహకారంతో అధ్యయనం చేశారు. శాసనంపై సహదేవ అనే వీరుని పేరు ఉందని, సహదేవుడు పశు సంపదను రక్షించే సమయంలో వీర మరణం పొందినట్లు శాసనంలో ఉందన్నారు.

ఫ్యాక్టరీలో పేలుడు..ఒకరి మృతి

యశవంతపుర: బాగల్‌కోటె జిల్లా, ముధోళ్‌లో మంత్రి మురుగేశ్ నిరాణికి చెందిన షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం పేలుడు జరిగింది. బాయిలర్ వద్ద పనిచేస్తున్న జంబరకొప్పకు చెందిన గురునాథ హంచ్చణ్ణనవర(27) అనే కార్మికుడు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించారు. ముధోళ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డీకేశికి హైకోర్టులో ఊరట

బనశంకరి: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టి ఈనెల 24వరకు మధ్యంతర స్టే ఇస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కాగా సీబీఐ ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తు నివేదికను 24లోగా అందజేయాలని, అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం సూచించింది.

మలె మహదేశ్వరస్వామి హుండీ లెక్కింపు

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలో ప్రసిద్ధి చెందిన మలెమహదేశ్వర స్వామి హుండీ కానుకలను సాలురుమఠం శాంత మల్లికార్జున స్వామి సమక్షంలో లెక్కించారు. 22 రోజుల్లో రూ.1,33,37,871 నగదు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదుతో పాటు 38 గ్రాముల బంగారు, కిలో 600 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ప్రాధికార కార్యదర్శి కాత్యాయని తెలిపారు.

పార్కుల వద్ద పోలీసు గస్తీ

బనశంకరి: ఈనెల 14 న ప్రేమికులరోజు సందర్భంగా హిందూసంఘాలు అడ్డంకులు సృష్టించవచ్చని భావించి నగరపోలీసులు పార్కులు, మాల్స్ వద్ద భద్రత కల్పించనున్నారు. కాగా ప్రేమికులరోజుకు అనుమతి ఇవ్వరాదని హిందూ సంఘాల నాయకులు ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి

- రైతులు, పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభోపన్యాసంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్


ప్రసంగిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్

శివాజీనగర: రాష్ట్రంలో పాలన భేష్ అంటూ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ కితాబు ఇచ్చారు. శుక్రవారం ప్రారంభమైన బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రారంభోపన్యాసం చేశారు. కర్ణాటక అన్ని రంగాల్లో ప్రగతి సాధించినట్లు 34 పేజీలతో కూడిన ప్రసంగంలో కొనియాడారు. రైతులు, పేదలు అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నగర ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవల కోసం 438 నమ్మ క్లినిక్‌ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటికే 271 నమ్మ క్లినిక్‌లు ప్రారంభం అయ్యాయన్నారు.

మెరుగైన రవాణా సదుపాయాలు

మైసూరు–బెంగళూరు–చెన్నై మధ్య సెమి హైస్పీడ్ రైలు సేవలు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా రాష్ట్ర ప్రజలకు రవాణా సదుపాయాలు మెరుగుపడ్డాయని గవర్నర్ అన్నారు. బెంగళూరు మెట్రో రైల్వే పథకం కింద మైసూరు రోడ్డు నుంచి కెంగేరి వరకు 7.53 కిలోమీటర్లు, యలచేనహళ్లి నుంచి పట్టు సంస్థ వరకు 6.12 కి.మీ. రైలు మార్గం పనులు పూర్తయ్యాయని గవర్నర్ తెలిపారు. ప్రస్తుతం బయ్యప్పనహళ్లి నుంచి వైట్‌ఫీల్డ్ వరకు 18.81 కి.మీ మేర పనులు పూర్తయ్యాయని, ఈ మార్గం మార్చిలో అందుబాటులోకి వస్తుందన్నారు. రింగ్‌రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం మెట్రో పనులు ప్రగతి దశలో ఉన్నాయన్నారు. బెంగళూరు ఉపనగర రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రగతి దశలో ఉన్నాయని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. 50:50 శాతం కేంద్ర, రాష్ట్ర నిధులతో 9 కొత్త రైలు మార్గాలను ప్రభుత్వం చేపట్టబోతోందన్నారు.

మూగజీవాల రక్షణకు చర్యలు భేష్

అనారోగ్యపీడిత, నిస్సహాయ స్థితిలో ఉన్న పశువులను కాపాడేందుకు 100 కొత్త ప్రభుత్వ గోశాలలను నిర్మించినట్లు గవర్నర్ తెలిపారు. చర్మగంటు రోగంతో మృతి చెందిన పశువులకు సంబంధించి పాడి రైతులకు పరిహారం కోసం రూ.37 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కేంద్ర పరిష్కార పథకం కింద రూ.199 కోట్లతో 640 ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించినట్లు గవర్నర్ తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 50 లక్షల మందికి పనులు కల్పించినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా 37.54 లక్షల ఇళ్లకు నీటిని సరఫరా చేస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. ఎత్తిపోతల సమగ్ర తాగునీటి పథకం ద్వారా హాసన్, చిక్కమగళూరు, తుమకూరు, బెంగళూరు గ్రామీణ, రామనగర, చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాల్లో 527 చెరువులకు నీటిని నింపనున్నట్లు తెలిపారు. కళసా–బండూరి నాలా మళ్లింపు పథకం విస్తృత ప్రణాళికా నివేదికకు కేంద్ర జల కమిషన్ ఆమోదించినట్లు గవర్నర్ తెలిపారు.

నేరాల నివారణ

అత్యాచార కేసులు, పోక్సో చట్టం కేసుల విచారణ కోసం 31ఫాస్ట్ ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. కన్నడ, ప్రాంతీయ భాషల సినిమాలకు ఇచ్చే సహాయ ధనాన్ని 125 నుంచి 200 సినిమాలకు పెంచినట్లు గవర్నర్ వెల్లడించారు.

అందరికీ విద్య

జాతీయ విద్యా విధానాన్ని అమల్లోకి తెచ్చామని, బీదర్, హావేరి, చామరాజనగర, బాగలకోట, కొడుగు, కొప్పళ, హాసన్‌లో 7 కొత్త విశ్వవిద్యాలయాల స్థాపన, 7 ఇంజినీరింగ్ కాలేజీలను ఐఐటీ తరహాలో తీర్చిదిద్దుతున్నట్లు గవర్నర్ తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న 11,333 మంది పౌరకార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. 5,11,587 మంది కార్మికులను కార్మిక సంక్షేమ మండలిలో లబ్ధిదారులుగా నమోదు చేసినట్లు తెలిపారు. కార్మికుల రాష్ట్ర బీమా పథకం ఆసుపత్రుల సామర్థ్యాన్ని 50 నుంచి 100 పడకలకు పెంపు, 19 కొత్త కార్మికుల బీమా చికిత్సాలయం ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు గవర్నర్ తెలిపారు. ముఖ్యమంత్రి రైతు విద్యానిధి పథకాన్ని చేనేతకారుల, వ్యవసాయ కార్మికులకు వర్తింపజేసినట్లు తెలిపారు. 10.79 లక్షల మంది విద్యార్థులకు రూ.484 కోట్ల విద్యార్థి వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు.

డిమాండ్ల సాధనకు టవరెక్కి ఆందోళన


డిమాండ్లు పరిష్కరించాలని ధార్వాడలోని ఓ వాటర్ వర్క్స్ ఉద్యోగి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని సముదాయించి క్షేమంగా కిందకు దించారు.

మండ్య ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించండి

- సీఎం బొమ్మైకు మంత్రి అశోక్ లేఖ

శివాజీనగర: మండ్య జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తనను తప్పించాలని రెవెన్యూ శాఖ మంత్రి ఆర్ అశోక్ ముఖ్యమంత్రి బొమ్మైకు లేఖ రాశారు. అశోక్ ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మండ్య జిల్లాలో బీజేపీ కార్యకర్తలు సోషల్ మీడియాలో బహిరంగంగానే మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి అశోక్ సీఎం లేఖ రాశారు. నియమించిన పలు కార్యక్రమాల కారణంగా తాను సొంత నియోజకవర్గానికి సమయం కేటాయించేందుకు సాధ్యం కాలేదని, దీంతో తనను మండ్య జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆ లేఖలో కోరారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం


గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం బొమ్మై, స్పీకర్ కాగేరి

సాక్షి బెంగళూరు: రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం విధానసౌధకు విచ్చేసిన గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు అపూర్వ స్వాగతం లభించింది. విధానసౌధ మెట్లపై రెడ్ కార్పెట్ పరిచి గుర్రాలతో కవాతు చేస్తూ, మేళతాళాల మధ్య గవర్నర్‌కు ఘన స్వాగతం ఏర్పాటు చేశారు. సీఎం బసవరాజు బొమ్మై, స్పీకర్ విశ్వేశ్వరయ్య హెగ్డే కాగేరి, శాసనసభ వ్యవహారాల మంత్రి మాధుస్వామి తదితరులు గవర్నర్‌కు సాదర స్వాగతం పలికారు.

మాజీ సీఎంల గైర్హాజరు

చివరి బడ్జెట్ సమావేశాలకు మాజీ సీఎంలు సిద్ధరామయ్య, హెచ్‌డీ కుమారస్వామితో పాటు సుమారు 80 శాతం మంది సభ్యులు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాధ్వని యాత్ర, జేడీఎస్ పంచరత్న యాత్రలో నిమగ్నమైన విషయం తెలిసిందే. బీజేపీ రెండో దశ జనసంకల్ప యాత్రకు సిద్ధమవుతోంది.దీంతో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చేందుకు ఆసక్తి కనపరచలేదు. గవర్నర్ ప్రసంగం సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యుల కుర్చీలు చాలా వరకు ఖాళీగా కనిపించాయి. గవర్నర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన తర్వాత అసెంబ్లీ, పరిషత్‌లు సోమవారానికి వాయిదా పడ్డాయి. ఈనెల 17న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రభుత్వం సభ ముందుకు తీసుకురానుంది. ఈ నెల 24 వరకు అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. సోమవారం గవర్నర్ ప్రసంగంపై చర్చ, ధన్యవాద తీర్మానం చేయనున్నారు.

బీడీఏ ఆఫీసులో తనిఖీలు

బనశంకరి: నగరంలోని బీడీఏ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం లోకాయుక్త అధికారులు తనిఖీ చేశారు. బీడీఏ కార్నర్‌సైట్ల గోల్‌మాల్‌కు సంబంధించి ఇంజినీరింగ్, భూ పరిహారం విభాగంలోని ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. లోకాయుక్త ఐజీ సుబ్రమణ్యేశ్వరరావ్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు దాడుల్లో పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి ఓకే

శివాజీనగర: ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ల పరిష్కారానికి సీఎం బసవరాజ బొమ్మై హామీ ఇచ్చారు. శ్రీనివాసాచారి నివేదిక సిఫార్సుల మేరకు జీతం పెంపు, 60 సంవత్సరాల వరకు సేవా భద్రత కల్పించేందుకు సీఎం అంగీకరించారని భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్రాధ్యక్షుడు విశ్వారాధ్య హెచ్.యమోజి తెలిపారు.



ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకున్న వాతావరణ మార్పుల వల్ల ప్రపంచ దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, భూమిని, పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని చాటి చెబుతూ శుక్రవారం బెంగళూరు బ్రిగేడ్ రోడ్డులో జంతు సంరక్షణ సంస్థ(పెటా) కార్యకర్తల వినూత్న ఆందోళన.

సకాలంలో వైద్యం అందక శిశువు మృతి


ఘటనపై ఆరా తీస్తున్న ఆరోగ్యాధికారి రవికుమార్

మైసూరు: అంబులెన్స్ ఆలస్యంగా రావడం, సరైన సమయంలో వైద్యం అందకపోవడంతో నవజాత శిశువు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మైసూరు జిల్లా హెచ్.డి.కోటె తాలూకా బుండనమాళ గ్రామానికి చెందిన శీలా, మహదేవ దంపతలకు నాలుగు రోజుల క్రితం బిడ్డ జన్మించింది. శుక్రవారం చిన్నారికి అనారోగ్యంగా ఉండటంతో అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గంట ఆలస్యమవుతుందని చెప్పడంతో బైక్‌పైనే ఎన్.బేగూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో హెచ్.డి.కోటెకు తీసుకొస్తుండగా మార్గం మధ్యలో అంబులెన్స్ వచ్చింది. చిన్నారిని అందులోకి ఎక్కించగా ఆక్సిజన్ సిలిండర్ లేకపోయింది. అయినప్పటికీ అందులోనే హెచ్.డి.కోటె ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ ఉంటే తమ బిడ్డ బతికి ఉండేదని, అటు వైద్యులు, ఇటు అంబులెన్స్ నిర్వాహకుల నిర్లక్ష్యం వెరసి తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. హెచ్.డి.కోటె తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ రవికుమార్ బుండనమాళ గ్రామానికి వచ్చి దంపతులను పరామర్శించారు. చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఏరో ఇండియాకు రంగం సిద్ధం



గగనతలంలో ఫైటర్‌జెట్ రిహార్సల్స్ , పక్కన ఆకాశంలోకి దూసుకుపోతున్న సూర్యకిరణ్ విమానం

- యలహంకలో ఈనెల 13 నుంచి ఐదు రోజుల పాటు విమానాల ప్రదర్శన
- దేశ విదేశాలనుంచి తరలివచ్చిన లోహ విహంగాలు
- వేలాదిగా తరలిరానున్న సందర్శకులు

సాక్షి, బెంగళూరు: ఏటా భారతదేశం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రపంచ స్థాయి ఎయిర్ షోకు మరోసారి రంగం సిద్ధమైంది. 14వ ఏరో ఇండియా యలహంకలో సోమవారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. 13 నుంచి 17 వరకు భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే విమానాల సంతను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. దేశ, విదేశాలకు సంబంధించిన విమానాలను ఇందులో ప్రదర్శించనున్నారు. జీవితంలో ఒక్కసారి అయినా యుద్ధ విమానాలను దగ్గరి నుంచి చూడాలనే ఆశ ఈ ఏరో ఇండియా ద్వారా సాకారం చేసుకోవచ్చు.

ఇది 14వ ఎడిషన్..

1996లో తొలిసారిగా ఏరో ఇండియా బెంగళూరులో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు అప్రతిహతంగా ప్రతి రెండేళ్లకొకసారి ఈ ప్రదర్శన జరుగుతూ వస్తోంది. ఈ విమానాల విన్యాసాలను తిలకించేందుకు బెంగళూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివస్తుంటారు. ఇందులో ప్రపంచ నలుమూలల నుంచి నాయకులు, ఏరోస్పేస్ పెట్టుబడిదారులు, మేధావులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొంటున్నారు.

70కి పైగా విమానాల ప్రదర్శన..

ఈసారి భారత రక్షణ శాఖ అమ్ముల పొది నుంచి ప్రతిష్టాత్మక తేజస్ తేలికపాటి యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సూర్యకిరణ్, సారంగ్, రఫేల్, డకోట, ఎల్‌సీఏ, సుకోయ్–30, ఎంకే–1 తదితర 40కి పైగా యుద్ధవిమానాలు ఈప్రదర్శనలో ఉంచనున్నారు. వీటితోపాటు 20 పౌరయాన విమానాలు, 10కి పైగా విదేశీ విమానాలు గాలిలో చక్కర్లు కొట్టనున్నాయి. ఈ విమానాల ప్రదర్శన కోసం యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో సుమారు 35 వేల చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. ఈ ప్రదర్శనకు సంబంధించి విమానాల విన్యాసాలను ఇప్పటికే ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కోసం ఈవెంట్ జరిగే ప్రాంతానికి 10 కిలోమీటర్ల పరిధిలో ఫిబ్రవరి 20 వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉండనున్నాయి.

ఏరో ఇండియాలో ఏముంటుంది?

ఏరో ఇండియా 2023లో వైమానిక ప్రదర్శన, వైమానిక రంగ పారిశ్రామికవేత్తల చర్చలు, ఒప్పందాలు, ఉత్పత్తుల ప్రదర్శన, సెమినార్లు నిర్వహిస్తారు. దేశ విదేశాల నుంచి వైమానిక రంగ ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు వాటి విక్రయాల ఒప్పందాలు జరగనున్నాయి. ఏటా మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన ఈసారి మాత్రం ఐదు రోజులు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు ఏరో ఇండియా జరగనుంది. మొదటి మూడు రోజులు పారిశ్రామిక వేత్తలు, దౌత్యవేత్తలు చర్చలు, సెమినార్లు, ఒప్పందాలకు అవకాశం కల్పించారు. ఇక చివరి రెండు రోజులు 16, 17 తేదీల్లో సామాన్య ప్రజల సందర్శనానికి అనుమతించనున్నారు. సామాన్య ప్రజలు ww-w.-aesoi nd-i-a.g-ov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. సాధారణ వీక్షకులకు రూ.2,500, పారిశ్రామికవేత్తలకు రూ. 5 వేల టికెట్ రుసుం నిర్ణయించారు.

ఫారెస్ట్ అధికారికి లోకాయుక్త షాక్

- 8 చోట్ల సోదాలు

కోలారు/ బనశంకరి: కోలారు జిల్లా జిల్లా ఉప అటవీ సంరక్షణాధికారి వెంకటేష్‌కు లోకాయుక్త షాక్ ఇచ్చింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై కోలారులోని ఆయన ఇల్లు, రామనగర మాగడిలో ఫాంహౌస్, బెంగళూరులో ఫ్లాట్‌తో పాటు 8 చోట్ల లోకాయుక్త ఎస్పీ కేవీ అశోక్ నేతృత్వంలో అధికారులు సోదాలు చేపట్టారు. వేకువజామున లోకాయుక్త అధికారులు బెంగళూరులోని విజయనగరలో ఉన్న వెంకటేశ్ ఇంటి తలుపు తట్టారు. ఆ సమయంలో వెంకటేశ్ కోలారుకు వెళ్లడానికి రైల్వేస్టేషన్‌లో రైలుకోసం వేచి ఉన్నారు. భార్య ఇచ్చిన సమాచారంతో వెంకటేశ్ ఇంటికి చేరుకున్నారు. సోదాల్లో మూడుచోట్ల కోట్లాదిరూపాయలు విలువైన ఫాంహౌస్, పొలాలు ఉన్నట్లు పత్రాలు లభ్యమయ్యాయి. అయితే వెంకటేశ్ తన ఐటీ రిటర్న్స్ చూపించారు. తన చెల్లెలు స్నేహితుడిపేరుతో ప్రాపర్టీ, ఆర్థిక వ్యవహారాలు నిర్వహించినట్లు సమాచారం లభించింది. లోకాయుక్త దాడి సమయంలో ఇంట్లో బంగారు ఆభరణాలు లభించాయి.

మాజీ మంత్రి టీ.జాన్ కన్నుమూత

శివాజీనగర: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టీ.జాన్ (92) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో జాన్ శుక్రవారం తెల్లవారజామున తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. జాన్‌కు భార్య చచ్చమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2010 నుంచి 2016 వరకు విధాన పరిషత్ సభ్యుడిగా పనిచేశారు. కేరళలోని కొట్టాయం జిల్లాకు చెందిన జాన్ మడికేరికి వచ్చి స్థిరపడ్డారు. జాన్ మృతికి ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.



రైతుల పోరుబాట

అటవీ భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెంగళూరు ఫ్రీడం పార్కులో అరణ్య భూమి హక్కు వేదిక ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న రైతులు, రైతు బిడ్డలు

ఒకే బోనులో రెండు చిరుతలు


చిరుతలు బందీ అయిన దృశ్యం

మైసూరు : అటవీశాఖ ఏర్పాటు చేసిన బోనులో ఏకంగా రెండు చిరుతలు పడిన ఘటన మైసూరు జిల్లా టి. నరిసిపుర తాలూకాలో జరిగింది. ఆ తాలూకాలో చిరుతల సంచారం అధికమైంది. ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ముసువినకొప్పలు గ్రామానికి చెందిన రైతు చంద్రప్ప పొలంలో అటవీశాఖ బోను ఏర్పాటు చేసింది. శుక్రవారం స్థానికులు వెళ్లి చూడగా బోనులో రెండు చిరుతలు చిక్కుకొని కనిపించాయి. అటవీశాఖ అధికారులు వచ్చి చిరుతలను బంధించి తీసుకెళ్లారు. సాధారణంగా ఒక బోనులో ఒక చిరుత పడటం సహజం. ఇక్కడ రెండు చిరుతలు బందీ కావడం చర్చనీయాంశమైంది

క్లుప్తంగా

పిల్లల రక్షణ అందరి బాధ్యత

రాయచూరు రూరల్: పిల్లల సంరక్షణ మనందరి బాధ్యత అని జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ సభ్యురాలు రూపాలి బెనర్జి పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ సభాంగణంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల కార్మిక వివాహాలు, అత్యాచారాల అడ్డుకట్టకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈనెల 13న జరగనున్న బాలల హక్కుల సంరక్షణ శిబిరంలో ఫిర్యాదుల సమావేశానికి ప్రతి అధికారి హాజరు కావాలని సూచించారు. సమావేశంలో న్యాయమూర్తి దయానంద, రాకేష్, ప్రయాగ, చేతన్ కుమార్, మన్సూర్, వృషబేంద్రయ్య, సురేంద్ర బాబులున్నారు.

వైభవంగా నీరమాన్వి యల్లమ్మ జాతర


యల్లమ్మదేవి రథోత్సవం

రాయచూరు రూరల్: మాన్వి తాలూకా నీరమాన్విలో యల్లమ్మదేవి జాతర వైభవంగా జరిగింది. శుక్రవారం వేలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం నెరవేరింది. రాయచూరు, లింగసూగూరు, సింధనూరు, మాన్వి, బళ్లారి, ఆదోని, కర్నూలు, మహబూబ్ నగర్, హైదరాబాద్‌ల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ తగదు

రాయచూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థల ప్రైవేటీకరణ తగదని టీయూసీఐ డిమాండ్ చేసింది. శుక్రవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అమరేష్ మాట్లాడారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, బ్యాంకింగ్ రంగాల ప్రైవేటీకరణ నిర్ణయాలను, ఏపీఎంసీ, విద్యుత్, కార్మిక చట్టాలకు సవరణలను విరమించుకోవాలన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహించే ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అమ్మవారి జాతర ప్రారంభం


అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు

మండ్య : మండ్య జిల్లా నాగమంగల తాలూకాలోని సోమనహళ్లి ఆమ్మవారి జాతర వేడకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. శుక్రవారం వేకువజామునుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్య గ్రామం నుంచి అమ్మవారి విగ్రహాన్ని జానపద కళాబృందాల ప్రదర్శన మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి పూజలు చేశారు. ఈనెల 12న రథోత్సవం జరుగుతుంది.

కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వండి

రాయచూరు రూరల్: వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంచాలకురాలు పద్మ మాట్లాడారు. నెలకు రూ.ఐదు వేల కనీస పారితోషికం ఇవ్వాలని, విద్యుత్, ఏపీఎంసీ, కార్మిక చట్టాలకు సవరణలను ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానికాధికారి హిరేమఠకు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో శరణ బసవ, వీరేష్, శబ్బీర్‌లు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడి..బాలుడికి గాయం


గాయంతో ఆస్పత్రిలో చేరిన బాలుడు

హొసపేటె: చిత్తవాడిగిలో వీధి కుక్క ఓ బాలుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శుక్రవారం జరిగింది. ఆటో డ్రైవర్ లింగప్ప కుమారుడు ఉదయం పాఠశాలకు వెళుతుండగా ఆకస్మికంగా వీధి కుక్క దాడి చేసింది. గాయపడిన 12 ఏళ్ల బాలుడు ప్రస్తుతం నగరంలోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా నెల క్రితం చిత్తవాడిగిలో వీధి కుక్కలు గుంపుగా ఓ విద్యార్థిపై దాడి చేసి గాయపరచిన విషయం తెలిసిందే.

పోలీసు వేషంలో దోపిడీ

• ముగ్గురు నిందితుల అరెస్ట్

యశవంతపుర: పోలీసు వేషంలో దోపిడీకి పాల్పడిన బెంగళూరుకు చెందిన ముగ్గురు నిందితులను బ్యాటరాయనపుర పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 7న తమిళనాడుకు చెందిన సుందరం అనే వ్యాపారి శివమొగ్గ నుంచి రూ.6 లక్షలు నగదు, బంగారు బిస్కెట్‌ను తీసుకొని తమిళనాడుకు వెళ్తుండగా మైసూరు రోడ్డు శాటిలైట్ బస్టాండ్ వద్ద పోలీసుల వేషంలో వచ్చిన నాగరాజు, అరుణ్, మంజుల అడ్డుకున్నారు. సోదాలు చేయాలని చెప్పి కారులో ఎక్కించుకొని నగదు, బంగారం లాక్కొని అతన్ని దింపేసి ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాల ద్వారా ఆధారాలు సేకరించి నిందితులను అరెస్ట్ చేశారు.

క్రికెట్‌లో చలాకీలు ఈ అక్కాచెల్లెళ్లు

- రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో రాణింపు
- అండర్ -19లో శ్లోకావీర హైందవి
- అండర్ -15లో ప్రజ్ఞావీర బ్రహ్మణి



బ్యాటింగ్, కీపింగ్‌లో రాణిస్తున్న శ్లోకావీర హైందవి


బౌలింగ్ చేస్తున్న ప్రజ్ఞావీర బ్రహ్మణి

సాక్షి,బళ్లారి: అటు చదువుతో పాటు ఇటు రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణిస్తూ బళ్లారికే కీర్తి తెచ్చారు ఈ అక్కాచెల్లెళ్లు. నెల్లూరు జిల్లాకు చెందిన రామచంద్ర కిశోర్ బాబు వ్యాపారరీత్యా 20 ఏళ్లుగా బళ్లారిలో స్థిరపడి తన ఇద్దరు కుమార్తెలను ఇక్కడే చదివిస్తున్నారు. వీరిద్దరూ సమయం వృథా చేయకుండా చదువుతో పాటు క్రికెట్‌లో రాణించి తమ సత్తా చాటుతున్నారు. పెద్ద కుమార్తె శ్లోకావీర హైందవి పీయూసీ మొదటి సంవత్సరం ఇండిపెండెంట్ కళాశాలలో చదువుతోంది. ఈమె 10వ తరగతిలో 94 శాతం మార్కులు తెచ్చుకోవడంతో పాటు క్రికెట్‌లో కూడా రాణిస్తోంది. గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన అండర్-19 టీ20 మ్యాచ్‌లో ఈమె తన ప్రతిభ చాటింది. ఇక చిన్న కుమార్తె ప్రజ్ఞావీర బ్రహ్మణి 9వ తరగతి తిలక్ నగర్‌లోని జయరాం విద్యాలయంలో చదువుతోంది. ఈమె చెన్నైలో జరిగిన అండర్-15 మ్యాచ్‌లో తన ప్రతిభను ప్రదర్శించింది. వీరు వికెట్‌కీపర్, బ్యాటర్‌గా రాణిస్తున్నారు. చిన్న కుమార్తె బౌలింగ్‌లో తన సత్తా చాటుతోంది. ఈ సందర్భంగా అక్కా చెల్లెళ్లు సాక్షితో మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదువుతో పాటు క్రికెట్ కోచ్ నూర్ అందించిన సహకారంతో క్రికెట్‌లో రాణిస్తున్నామన్నారు. తండ్రి రామచంద్ర కిశోర్‌బాబు మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టమన్నారు. తాను కూడా క్రికెట్‌లో రాణించడంతో పది మందికి క్రికెట్ నేర్పిస్తున్నానన్నారు. ప్రస్తుతం తుమకూరు జోన్‌కు సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా పని చేస్తున్నానన్నారు. ఎంతో మంది యువతీ యువకులను క్రికెట్ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


భూమిపూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

గంగావతి: కనకగిరి నియోజకవర్గంలోని బరగూరులో శ్రీబీరలింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన, సముదాయ భవనాల నిర్మాణానికి కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, కనకగిరి ఎమ్మెల్యే బసవరాజ్ దఢేసూగూరు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కరడి సంగణ్ణ మాట్లాడుతూ బీరలింగేశ్వర సముదాయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి శ్లాఘనీయం అన్నారు. ప్రజల దైవభక్తికి అనుగుణంగా ఈ సముదాయ భవనాల నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపనలను తాము చేపడుతున్నామన్నారు. మాజీ మంత్రి సాలోణి నాగప్ప, కనక గురు పీఠం స్వామీజీ చంద్రశేఖర్ ముతాలిక్, సిద్దప్ప నీరలూటి, నెక్కంటి సూరిబాబు పాల్గొన్నారు.

హుబ్లీ-అంకోలా రైలుమార్గానికి పునర్జీవం

- తాజా ప్రతిపాదనలకు మండలి సూచన
- మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్


మాట్లాడుతున్న మాజీ సీఎం జగదీశ్ శెట్టర్

హుబ్లీ: కొంకణ తీరం, ఉత్తర కర్ణాటక ప్రాంతాన్ని కలిపే హుబ్లీ-అంకోలా రైలుమార్గ పథకం గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో పడింది. తిరిగి ఆ పథకానికి ప్రస్తుతం మళ్లీ ఊపిరి వచ్చింది. గతంలో పథకం అమలు కోసం అంతా సిద్ధమైన వేళ పర్యావరణ, అటవీ శాఖ అనుమతులు నిరాకరించాయి. గతనెల 27న జరిగిన జాతీయ వన్యజీవి మండలి సమావేశంలో ఆ పథకానికి సంబంధించి అధ్యయనం జరిగి అభిప్రాయాన్ని సేకరించారు. ఆ మేరకు కొత్త సమితిని ఏర్పాటు చేసి సవరించిన సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని జాతీయ వన్యజీవి మండలి ఆదేశాలు ఇచ్చిందని మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇది కొత్త ఆశాకిరణం అన్నారు. మొదట ఈ పథకానికి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ప్రస్తుతం కేంద్రం వద్దనున్న ఈ పథకానికి సంబంధించి ఓ బృందం అన్ని పరీక్షలను సానుకూలంగా జరిపి నివేదిక సిద్ధం చేసిందన్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖా మంత్రులతో తాను మాట్లాడానన్నారు. ఈ రైలు మార్గ పథకం ఆ ప్రాంతవాసుల ఎన్నో ఏళ్ల కల అని, ఎట్టకేలకు దీనికి మోక్షం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

డిమాండ్లు తీర్చాలని ధర్నా


వినతిపత్రం సమర్పిస్తున్న కార్మిక సంఘం నేతలు

చెళ్లకెరె రూరల్ : వివిధ డిమాండ్లు నెరవేర్చాలని ఒత్తిడి చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తాలూకా కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ నాయకుడు తిప్పేస్వామి మాట్లాడుతూ కార్మికులు పెట్టుబడిదారుల వద్ద కష్టాలకు గురయ్యారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, రైతులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశ్రమ్ కార్డు పథకం అమలు చేసినా కార్మికులకు ప్రయోజనం కాలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.31 వేలు చేయాలి, 17న జరిగే బడ్జెట్ సమావేశంలో కార్మికుల హక్కులు, జీవిత భద్రతపై చర్చించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రెహాన్‌పాషాకు మనవి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షులు టీ.నింగప్ప, నాగరాజు, ఎస్.రాజన్న, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

సముదాయ భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి : రూపేన అగ్రహారలో సముదాయ భవనం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, చీఫ్ విప్ ఎం.సతీష్ రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నరేంద్రబాబు, అనిల్, బీబీఎంపీ అధికారులు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

రాయచూరు రూరల్ : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దిలీప్ పాండ్య పిలుపుఇచ్చారు. శుక్రవారం ప్రైవేట్ హోటల్‌లో పార్టీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ఆధ్వర్యంలో బీజేపీ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. సమావేశంలో జిల్లాధ్యక్షుడు బసవరాజ్, సుభాష్ శంభోజీ, వీరేష్, మహ్మద్ అజరుద్దీన్‌లున్నారు.

మాది మోదీ సంస్కృతి

• సీఎం బసవరాజ్ బొమ్మై

హుబ్లీ: ఎవరిది ఏ సంస్కృతో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని, తమది మోదీ సంస్కృతి అని ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై తెలిపారు. శుక్రవారం లక్కుండి ఉత్సవాలకు బయలుదేరి వెళ్లే ముందు హుబ్లీ విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వారిది టిప్పు సంస్కృతి. తమది నాల్వడి కృష్ణరాజ ఒడెయర్ల సంస్కృతి అని సీటీ రవి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన తన ప్రకారం తమది ప్రధాని మోదీ సంస్కృతి అన్నారు. మోదీ భారత దేశాన్ని అత్యంత పటిష్టవంతంగా, ధనిక దేశంగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఆయన అమృత కాలాన్ని కర్తవ్య కాలంగా పరిగణించారన్నారు. కర్తవ్యం ద్వారా దేశాన్ని మొత్తం ప్రపంచంలో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇదే అంశమే ధ్యేయంగా తాము కూడా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఉల్లిగడ్డల కొనుగోలుకు ముట్టడి

రాయచూరు రూరల్ : రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఏపీఎంసీలో కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ రైతులు గురువారం రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ నేతృత్వంలో ఏపీఎంసీ కార్యాలయాన్ని ముట్టడించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెచ్చిన ఉల్లిగడ్డలను ఏపీఎంసీ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు నిరసన తెలియజేశారు.

నింగజ్జకు సన్మానం


నింగజ్జను సన్మానిస్తున్న పలు సంఘాల నేతలు

గంగావతి: మీడియా అకాడమి ప్రశస్తికి ఎంపికైన సీనియర్ విలేకరి, మీడియా క్లబ్ కార్యదర్శి కే.నింగజ్జను ఆయన నివాసంలో వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, దళిత, ఇతర సంఘాలు సన్మానించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తన కలంతో పరిష్కారానికి కృషి చేశానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలిపేందుకు శ్రమించానన్నారు. తన ప్రజా సేవను గుర్తించి అకాడమికి ఎంపిక చేశారని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షులు ఇంగళిగి నాగరాజ్, మాజీ అధ్యక్షులు విశ్వనాథ్ బెళగలమఠ్ , ప్రసన్న దేశాయి, ఎంజే.శ్రీనివాస్, హరీష్ కులకర్ణి, దశరథ, వసంత, దళిత సంఘం నేతలు కుంటోజీ మరియప్ప, హులుగప్ప మాస్టర్, ఆరతి రవి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి సన్నిధిలో తహసీల్దార్

చెళ్లకెరె రూరల్: దేశం ధార్మిక పరంపరలో విశిష్టతను పొందిందని బదిలీ తహసీల్దార్ ఎం.రఘుమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని వెంకటేశ్వర్ నగర్‌లో చౌడేశ్వరిదేవి 5వ సంవత్సర జాతర మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. చౌడేశ్వరి దేవి ప్రజల కోరికలను తీర్చి సుఖశాంతులు, నెమ్మదిని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసే సమయంలో పేద ప్రజల సమస్యలపై స్పందించానన్నారు. తాలూకా ప్రజల సహకారం ఎన్నటికి మరవలేనిదన్నారు. నగరసభ సభ్యుడు మల్లికార్జున, జగదీశ్, పాలాక్షలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నడుం బిగించాలి

హొసపేటె: ప్రభుత్వ పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సంఘం సంస్థలు ముందుకు రావాలని బణవికల్లు ప్రభుత్వ పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు బసవరాజ్ తెలిపారు. శుక్రవారం కూడ్లిగి తాలూకా బణవికల్లు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వివిధ సంఘ సంస్థల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి ఫిల్టర్ యూనిట్ వ్యవస్థను కల్పించామన్నారు. పాఠశాలలోని అనేక గదులు దుస్థితికి చేరుకొన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా సంఘం నేతలు భాగ్యమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బళ్లారి-1 కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించండి


వినతిపత్రాన్ని అందిస్తున్న వేదిక పదాధికారులు

బళ్లారిఅర్బన్: నగరంలోని బుడా కాంప్లెక్స్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి బళ్లారి-1 కేంద్రం గత ఏడాది విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో మూతవేశారు. అప్పటి నుంచి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటుండడంతో తిరిగి ప్రారంభించాలని సువర్ణ కర్ణాటక వేదిక రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి నేతృత్వంలో కలెక్టరేట్‌లో జిల్లాధికారికి పదాధికారులు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బళ్లారి వన్ కార్యాలయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు విద్యుత్ తదితర బిల్లులను చెల్లించేందుకు ప్రజలకు అనుకూలంగా ఉండేదని తెలిపారు. ఇది మూత పడటం వల్ల గ్రామీణ ప్రజలతో పాటు స్థానికులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ కార్యాలయాన్ని తిరిగి ప్రారంభించాలన్నారు. సిటీ కార్పొరేషన్‌లో, జిల్లాధికారి కార్యాలయంలో మాత్రమే ఉండటం వల్ల బుడా కాంప్లెక్స్‌లో కూడా ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా వేదిక పదాధికారులు పీ.రాజాసాబ్, మంజునాథ, ఉమేష్, హేమంత్‌రాజు, మౌనేష్, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా నగరసభ బడ్జెట్ సమావేశం


వివరాలను చదువుతున్న అధికారి అమరేశప్ప


పాల్గొన్న నగరసభ కౌన్సిలర్లు, ఇతర అధికారులు

సిరుగుప్ప: నగరంలోని నగరసభ కార్యాలయ సభాంగణంలో శుక్రవారం 2023-24వ వార్షిక బడ్జెట్ సమావేశం వాడీవేడిగా జరిగింది. బడ్జెట్ నిల్వ, ఆయ, వ్యయ వివరాలను అధికారి అమరేశప్ప సమావేశంలో చదివి వినిపించారు. సమావేశంలో నగరసభ అధ్యక్షురాలు సుశీలమ్మ వెంకటరామరెడ్డి, కమిషనర్, సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్‌లతో పాటు 14 మంది పురుష కౌన్సిలర్లు, ఆరుగురు మహిళా కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలకు డిమాండ్


వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: పీయూసీ చదువుతున్న విద్యార్థినిపై అత్యాచారం జరిపి హత్య చేసిన కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలని అఖిల భారత బంజార సేవా సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు హనుమంతు చౌహాన్ మాట్లాడారు. లింగసూగూరులోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న ఐశ్వర్య అనే విద్యార్థినిని ప్రిన్సిపాల్ రమేష్ మానసికంగా, శారీరకంగా హింసించడమేగాక అత్యాచారానికి పాల్పడి హత్య చేశాడన్నారు. ఆయనకు కఠిన శిక్ష విధించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో దీపా నాయక్, రాజు, జ్యోతి బాయి, లచ్చప్ప, వెంకటేష్, ఈరణ్ణలున్నారు.

15 నుంచి బీజేపీ జన సంకల్ప యాత్ర


మాట్లాడుతున్న సిద్ధరాజు

రాయచూరు రూరల్: బీజేపీ జన సంకల్ప యాత్ర ఈ నెల 15(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధరాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఆరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు నళిన్ కుమార్ కటీల్ బసవన బాగేవాడి, కూడల సంగమల నుంచి జన సంకల్ప యాత్రకు శ్రీకారం చుడతారన్నారు. సీఎం, మాజీ సీఎంల ఆధ్వర్యంలో వంద నియోజకవర్గాల్లో పర్యటనలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరచిన పథకాలను ప్రజల్లో ప్రచారం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో 150 స్థానాల్లో గెలుపు కోసం జన సంకల్ప యాత్రను చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలకు 15 నుంచి 17 శాతం, ఎస్టీలకు 3.5 నుంచి 7 శాతం రిజర్వేషన్లు పెంచిందన్నారు.

కుమారస్వామిపై విమర్శలు తగదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ సభ్యులు

గంగావతి రూరల్: కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ హెచ్.ఆర్.శ్రీనాథ్ మిడిమిడిజ్ఞానంతో మాజీ ముఖ్యమంత్రి హెచ్.డి.కుమారస్వామిని విమర్శించడం తగదని జేడీఎస్ తాలూకా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పత్రికా భవనంలో విలేకరులతో మాట్లాడారు. సముచిత స్థానాన్ని కల్పించి గౌరవాన్ని పెంచిన పార్టీని వీడిన తర్వాత ఆ పార్టీ నాయకుల గురించి మాట్లాడడం సరికాదన్నారు. గత ఎన్నికల్లో తమరు ఏ పార్టీలో ఉన్నారో గుర్తు చేసుకోవాలన్నారు. జేడీఎస్ ఉపాధ్యక్షులుగా, హై-క ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన మీరు గతాన్ని మరిచి మాట్లాడడం తగదన్నారు. నాడు సంకీర్ణ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న కుమారస్వామి రూ.98 కోట్లతో తాలూకాలో 7 చెరువులను నింపారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తాలూకా ఎస్సీ, ఎస్టీ అధ్యక్షులు ఏఎన్ కృష్ణప్ప, తాలూకా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఖాజా బాషా, హుసేన్ ఖాజా పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

భూవివాదంలో వృద్ధురాలికి ఎస్పీ అండ


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణ

మాలూరు : భూ వివాదంలో ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు ఎస్పీ ఎం నారాయణ అండగా నిలిచారు. మాస్తి ఫిర్కా తరుణసి గ్రామంలో వెంకటలక్ష్మమ్మ అనే వృద్ధురాలికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నా ఒంటరిగానే జీవిస్తోంది. తన మామ కాలంలో గ్రామంలోని సర్వే నెంబర్-34లో ఇచ్చిన 24 గుంటల ఇనాంతి భూమిలో వెంకటలక్ష్మమ్మ రాగి పంటను పండిస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన మునిరాజప్ప, అశోక్, సీతమ్మ, ప్రేమ అనే వారు తమ స్వాధీనంలో ఉన్న భూమిలో నుంచి వెంకటలక్ష్మమ్మ భూమిలోకి వెళ్లడానికి దారి ఇవ్వకుండా పదే పదే ఇబ్బంది కలుగజేసేవారు. గత జనవరి 21న అశోక్ వృద్ధురాలిపై దాడి కూడా చేశాడు. అంతేకాకుండా సీతమ్మ, ప్రేమలు వెంకటలక్ష్మమ్మ పొలంలో పండించిన అనపకాయలు తదితర పంటలను తొలగించి ఇబ్బంది పెట్టారు. దీనిపై వెంకటలక్ష్మమ్మ మాస్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో వృద్ధురాలు వెంకటలక్ష్మమ్మ నేరుగా ఎస్పీ కార్యాలయానికి గురువారం వచ్చి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ నారాయణ శుక్రవారం తానే స్వయంగా తరుణసి గ్రామానికి వెళ్లి వృద్ధురాలిని కలిసి పోలీసులు అండగా ఉంటారని, ఎవరికీ భయపడాల్సిన పని లేదని ధైర్యం చెప్పారు. వెంకటలక్ష్మమ్మపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని మాస్తి పోలీసులకు సూచించారు. ఎస్పీ ఆదేశాలతో కేసు నమోదు చేసుకున్న మాస్తి ఎస్ఐ సునీల్‌కుమార్ అశోక్‌ను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

బదిలీ ఆదేశాలు బేఖాతరు

• విధుల నుంచి రిలీవ్ కాని తహసీల్దార్


తహసీల్దార్ సుజాత

కేజీఎఫ్ : కేజీఎఫ్ తహసీల్దార్ సుజాతను తుమకూరు జిల్లా పావగడకు బదిలీ చేసినట్లు ఆదేశాలు వచ్చి 10 రోజులు గడుస్తున్నా ఇంకా కార్యాలయం నుంచి ఆమె రిలీవ్ కాలేదు. తన బాధ్యతలను ఇతరులకు అప్పగించలేదు. జిల్లా కలెక్టర్ వెంకటరాజ ఈ నెల 8న కేజీఎఫ్ తహసీల్దార్‌గా బంగారుపేటె తహసీల్దార్ దయానంద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ కేజీఎఫ్ తహసీల్దార్ సుజాత, శిరస్తెదార్ సురేష్ రహస్య స్థలంలో ఉండి గత రెండు రోజులుగా పాత ఫైళ్లను క్లియర్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడం వల్ల రైతులు, ప్రజలు, కార్యాలయానికి వచ్చి పనులు కాక తిరిగి వెళుతున్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా ధిక్కరించిన తహసీల్దార్ సుజాత తీరుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ సుజాతకు పలువురు రాజకీయ నాయకుల అండదండలు ఉండడం వల్లనే ఆదేశాలను ధిక్కరిస్తోందనే విమర్శలున్నాయి. తహసీల్దార్ సుజాత వెంటనే తన స్థానాన్ని వదిలి వేరే అధికారికి అవకాశం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆధునీకరణ పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా సంఘం పాత భవనానికి ఆధునీకరణ పనులను సంఘం జిల్లా అధ్యక్షుడు జి సురేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం పాత భవనాన్ని రూ.1.75 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 16 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు సమావేశాల నిర్వహణ కోసం భవనాన్ని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. భవనంతో పాటు ముందు భాగంలో కొత్తగా దుకాణ సముదాయాన్ని కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. మార్చి నెల మొదటి వారంలో జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన క్రీడాకారులందరూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల గౌరయర బళగ అధ్యక్షుడు నారాయణస్వామి, సంఘం ప్రధాన కార్యదర్శి అజయకుమార్, గౌరవ అధ్యక్షుడు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కోలారు : పత్రికా రంగంలో విశేష సేవలందించిన ముగ్గురు సీనియర్ విలేకరులకు ప్రభుత్వం మీడియా అకాడమి అవార్డులు ప్రకటించడంతో జిల్లా పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వారిని సన్మానించారు. సంఘం అధ్యక్షుడు బి.వి.గోపినాథ్ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం మీడియా అకాడమి అవార్డుకు జిల్లాకు చెందిన ముగ్గురు పాత్రికేయులు ఎన్నికవడం జిల్లాకు గర్వకారణమన్నారు. అవార్డులు అందుకున్న పీటీఐ విలేకరి బి సురేష్, దునియా పత్రిక ఎస్ మునియప్ప, కేజీఎఫ్‌కు చెందిన రాకేష్‌లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి మునిరాజు, రాష్ట్ర సంఘం కోశాధికారి ఎం వాసుదేవ హొళ్ల, ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతులు

కోలారు : వేమగల్ నుంచి రామాపురానికి వెళ్లే రోడ్డు అధ్వానస్థితికి చేరుకుని వాహన సంచారానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుండడంతో గ్రామస్తుల కోరిక మేరకు శుక్రవారం జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ తన స్వంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. చాలా ఏళ్లుగా వేమగల్ నుంచి రామాపురం వెళ్లడానికి రైతులు, విద్యార్థులు, ఇతర పనులపై వెళ్లే వారు చాలా ఇబ్బందులు పడేవారు. ఇటీవల గ్రామానికి వెళ్లినప్పుడు గ్రామస్తులు రోడ్డు గురించి విన్నవించడంతో స్పందించిన ఆయన రోడ్డును బాగు చేయించారు.

ఔట్‌పోస్ట్‌ను అప్‌గ్రేడ్ చేయరూ

కోలారు : తాలూకాలోని నరసాపురం పోలీస్ ఔట్ పోస్టును అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ నరసాపురం గ్రామస్తులు శుక్రవారం అదనపు ఎస్పీ భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నరసాపురం, వక్కలేరి ఫిర్కా చుట్టుపక్కల గ్రామాలన్నీ నరసాపురం ఔట్ పోస్ట్ పరిధిలో చేరడంతో పాటు ఇటీవల పరిశ్రమలు అధికం కావడం వల్ల జనాభా అధికమైందన్నారు. వాహనాలు, జన సంచారం కూడా అధికమైనందున నేరాల అదుపునకు ఇక్కడి పోలీస్ ఔట్‌పోస్టును అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. నరసాపురం ఫిర్కాలో దాదాపు 45 లక్షల మంది నివాసం ఉంటున్నారు. జనాభా అధికంగా ఉండడం వల్ల ఔట్‌పోస్టును అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. జాతీయ రహదారి కూడా పక్కనే ఉండడం వల్ల తరచుగా ప్రమాదాలు కూడా జరుగుతున్నా యి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఔట్ పోస్టు ను పూర్తి స్థాయి పోలీస్ స్టేషన్‌గా మార్చాలని కోరారు.

క్లుప్తంగా

దొడ్డ తాలూకాలో చిరుతల సంచారం



కోళూరు శివారులో ప్రత్యక్షమైన చిరుత

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో చిరుతలు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోళూరు గ్రామ శివారులో గురువారం రాత్రి కొందరు వాహనదారులకు వెలుతురులో చిరుత కనిపించగా ఫొటోలు, వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. ఇది శుక్రవారం వైరల్ కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వణికిపోతున్నారు. రైతులు పొలం, తోటలకు వెళ్లలేకపోతున్నారు. చిరుత గ్రామ శివారులోని నీలగిరి తోపుల్లో సంచరిస్తోందని, అటవీశాఖ అధికారులు స్పందించి బోను ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా దొడ్డ తాలూకా బచ్చళ్లిలో కూడా చిరుత కనిపించడంతో అటవీశాఖ అధికారులు 26న బోను ఏర్పాటుచేసినా ఇప్పటి వరకూ చిరుత బోనులో చిక్కడంలేదు.

కాంగ్రెస్‌లో చేరిక



కృష్ణరాజపురం: హొసకోటె నియోజకవర్గంలోని ఆలప్పనహళ్లి గ్రామంలో ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శరత్ బచ్చేగౌడ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలప్పనహళ్ళి గ్రామస్తులు రవి కుమార్ తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

గౌరిబిదనూరు: సుస్థిర ప్రభుత్వం, దేశాభివృద్ధి కోసం వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తొండేబావి హోబళీలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీపీ కృష్ణమూర్తితో మంతనాలు జరిపారు. అనంతరం తిప్పగానహళ్లి, బందార్లహళ్లి, కల్లినాయకహళ్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 20 ఏళ్లుగా తాను చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కుడుములకుంటె పారిశ్రామిక వాడలో పెద్ద సంఖ్యలో గార్మెంట్స్, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేయించి నిరుద్యోగులను ఆదుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అశ్వత్థనారాయణగౌడ, నగరసభ సభ్యుడు కలీంవుల్లా తదితరులు పాల్గొన్నారు.

అటవీ గ్రామాల్లో వన్యప్రాణుల నుంచి రక్షణ

మైసూరు : అటవీ గ్రామాల్లో వన్యప్రాణుల దాడులనుంచి ప్రజలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన లెపర్డ్ టాస్క్‌ఫోర్స్ వచ్చే వారం నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తుందని డీసీఎఫ్ డాక్టర్. కే.ఎన్. బసవరాజు తెలిపారు. శుక్రవారం మైసూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిరుతలు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకట్ట వేసేందుకు డీసీఎఫ్ రేంజ్ అధికారి నేతృత్వంలో ఈ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా 40మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఐదు బృందాలుగా ఏర్పాటు చేసి వాహనాలను సమకూర్చుతామన్నారు.

మారిషస్‌కు హెచ్‌ఏఎల్ హెలికాప్టర్



సాక్షి బెంగళూరు: అత్యాధునిక తేలికపాటి హెలికాప్టర్ (ఏఎల్‌హెచ్)ను మారిషస్ ప్రభుత్వానికి హిందూస్తాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) అందించింది. శుక్రవారం హెచ్‌ఏఎల్ హెలికాప్టర్ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మారిషస్ పోలీసు దళం (ఎంపీఎఫ్)కు డివిజన్ జీఎం నిఖిల్ ద్వివేది ఈ మేరకు అధికారిక ధ్రువీకరణపత్రం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఏఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ ఈపీ జయదేవ తదితరులు పాల్గొన్నారు. కాగా, గతేడాది జనవరిలో మారిషస్ ప్రభుత్వంతో ఒక ఏఎల్‌హెచ్ ఎంకే-3 అందిస్తామని హెచ్‌ఏఎల్ ఒప్పందం చేసుకుంది.

అక్రమ మద్యం ధ్వంసం

శిడ్లఘట్ట: అక్రమంగా పట్టుబడిన మద్యం బాటిళ్లను అబ్కారి శాఖ అధికారులు ధ్వంసం చేశారు. చిక్కబళ్లాపుర జిల్లా అబ్కారి శాఖ జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు సహాయక తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం శిడ్లఘట్టలో వివిధ దాడుల్లో పట్టుబడిన రూ. 8 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని నగరంలోని బుదాల చెరువు వద్ద ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అబ్కారి సీఐ సురేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల అగచాట్లు



ట్రాక్టర్లలోనే రాగుల బస్తాల లోడ్లు



గోడౌన్ల వద్ద రైతుల పడిగాపులు

- రాగుల కొనుగోళ్లలో ఆలస్యం
- పట్టించుకోని అధికారులు
- గోడౌన్‌ల వద్ద వాహనాలతో పడిగాపులు

తుమకూరు: రైతుల సమస్యలు తీరుస్తామని అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఆ తరువాత అన్నదాతల సమస్యలపై అసలు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. తుమకూరు నగరంతో పాటు జిల్లాలోని రైతులు తాము సాగు చేసిన రాగులను విక్రయించడానికి నానా కష్టాలు పడుతున్నారు. నగరంలోని అంతరసనహళ్లి సమీపంలో ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న రాగుల కొనుగోలు కేంద్రాల వద్దకు ట్రాక్టర్లు, లారీలలో తీసుకువస్తే కొనుగోలు చేసేవారు లేక రైతులు రోజుల తరబడి వేచి ఉంటున్నారు. ఒక్కో రైతు తాను తీసుకువచ్చిన రాగులు విక్రయించడానికి మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతోంది. రైతులు ఇబ్బందులు ఇబ్బందులను రాజకీయ నాయకులు గాని, అధికారులు గాని పట్టించుకోవడం లేదు. వాహనాలకు అద్దె కట్టలేక, ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వివాహేతర సంబంధం వివాదం

- విషం తాగి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన డెలివరి బాయ్

బనశంకరి: విషం తాగి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన డెలివరి బాయ్‌ని పోలీసులు ఆస్పత్రికి తరలించిన ఘటన చంద్రాలేఔట్‌లో చోటుచేసుకుంది. వివరాలు...డెలివరి బాయ్ అనిల్ (30)కు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం కొద్దిరోజుల క్రితం మహిళ భర్తకు తెలిసింది. దీంతో అతను అనిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనిల్‌ను హెచ్చరించినప్పటికీ మహిళను కలవడానికి ప్రయత్నించాడు. తనతో సంబంధం కొనసాగించాలని మహిళను వేధింపులకు పాల్పడ్డాడు. మనస్తాపం చెందిన మహిళ అనిల్‌పై ఫిర్యాదు చేయడానికి గురువారం చంద్రాలేఔట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. తనపై కేసు నమోదు అవుతుందని తెలియగానే పోలీస్‌స్టేషన్‌కు అనిల్ వచ్చాడు. తనపై అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని, తాను చనిపోవడానికి విషం తాగానని అనిల్ పోలీసులకు తెలిపాడు. తక్షణం పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించారు.

పాల సమాఖ్య నూతన భవనం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: ప్రతి ఇంటిలో పాడి పశువులను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తుమకూరు పాల సమాఖ్య అధ్యక్షుడు సీవీ మహాలింగయ్య అన్నారు. శుక్రవారం తుమకూరు తాలూకా హెందొరె, పాల ఉత్పత్తిదారుల మహిళా సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...తుమకూరు సమాఖ్యలో 8 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నామని, అదే విధంగా కుణిగల్ ప్రాంతంలో లక్షన్నర లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు.

ధార్మిక కార్యక్రమాలతో ప్రశాంతత



హోమ పూజల్లో ఎమ్మెల్యే శివశంకరరెడ్డి, లోకేశ్ తదితరులు

గౌరిబిదనూరు: ధార్మిక కార్యక్రమాల వల్ల మనసుకు ఎంతో ప్రశాంతత కలిగిస్తుందని, తరచూ ఆలయాలను సందర్శించాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి అన్నారు. గురువారం రాత్రి తాలూకా కోటాలదిన్నెలోని గ్రామ దేవత మారెమ్మ దేవాలయంలో హోమాలు నూతన విగ్రహ, గోపుర కలశ స్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శుక్రవారం హనుమంతస్వామి దివ్య సాన్నిధ్యంలో జరిగిన ఈ ధార్మిక కార్యక్రమాలలో గంగాపూజ, గణపతి పూజ, వేద పారాయణం, పంచామృతాభిషేకాలు జరిగింది. నూతన విగ్రహ ప్రతిష్టాపన, గోపుర కలశ స్థాపన జరిగింది. ధార్మిక కార్యక్రమాలలో తా.పం.మాజీ అధ్యక్షుడు లోకేశ్, నాగరాజు, లక్ష్మణరావ్, గురుమూర్తి, తిమ్మరాజు, నరసింహమూర్తి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

బీబీఎంపీ వికేంద్రీకరణపై ప్రభుత్వానికి నివేదిక



సీఎం బొమ్మైకి నివేదిక అందజేస్తున్న టీఎం.విజయ భాస్కర్, మంత్రులు

బనశంకరి: పాలనా సంస్కరణలు కమిషన్ అధ్యక్షుడు టీఎం.విజయ భాస్కర్ బీబీఎంపీ పాలనా సంస్కరణలపై నివేదికను శుక్రవారం ముఖ్యమంత్రి బసవరాజబొమ్మైకు అందజేశారు. కమిషన్‌లో బీబీఎంపీ వికేంద్రీకరణకు పలు సిఫార్సులు చేసింది. విభాగ స్థాయిలో స్థానిక పాలనను మరింత మెరుగు పరచడానికి 30 మంది డిప్యూటీ కమిషనర్ల పోస్టులు సృష్టించాలని తెలిపింది. నేరుగా నియామకమ్యే కేఏఎస్ అధికారులను బీబీఎంపీలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టుల్లో నియమించాలన్నారు. ఇక రెవెన్యూలో అదనంగా 70 మంది రెవెన్యూ అధికారులు, 94 మంది ట్యాక్స్ అధికారులను, ప్రతి మూడు వార్డులకు రెవెన్యూ అధికారి, 17 కొత్తగా అసిస్టెంట్ రెవెన్యూ అధికారులు, ఇతర విభాగాలకు మరిన్ని పోస్టులను పెంచడానికి సిఫార్సు చేసింది. ముఖ్యమంత్రిని కలిసి నివేదిక అందజేసిన మంత్రులు సీసీ.పాటిల్, డాక్టర్ సుధాకర్, పాలనాధికారి రాకేశ్‌సింగ్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి మంజునాథ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

మైసూరు: లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందిన ఘటన మైసూరు నగరంలో కారంజికెరె సమీపంలో ఉన్న ట్యాంక్ బండ్ రోడ్డులో చోటుచేసుకుంది. మృతుడిని గౌరిబిదనూరుకు చెందిన రాధాకృష్ణ (23)గా గుర్తించారు. ఇతను ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కళాశాలకు బైక్‌పై వెళ్తుండగా భారీ ట్రెయిలర్ ఉన్న లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి...

చింతామణి: బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన కంచార్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి గడ్డ దగ్గర శుక్రవారం జరిగింది. మృతుడిని శిడ్లఘట్ట ప్రాంతానికి చెందిన తబరేజ్ (35)గా గుర్తించారు. ఇతను మురగమల్లాకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కెంగల్ జీవిత చరిత్ర అందరికీ తెలియాలి

శివాజీనగర: ప్రతి కన్నడిగుడికీ మాజీ ముఖ్యమంత్రి కెంగల్ హనుమంతయ్య జీవిత చరిత్ర తెలియాలని, ఇందుకోసం గ్రంథాన్ని ముద్రించి ఇదే సంవత్సరం విడుదల చేయనున్నట్లు సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. దివంగత కెంగల్ హనుమంతయ్య జయంతిని పురస్కరించుకొని విధానసౌధ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రెండో ముఖ్యమంత్రిగా, కేంద్ర రైల్వే మంత్రిగా రాష్ట్రాభివృద్ధికి విశేషంగా శ్రమించారన్నారు. రామనగరలో కెంగల్ హనుమంతయ్య విగ్రహ నిర్మాణం జరుగుతోందన్నారు. బెంగళూరు-మైసూరు రోడ్డు మార్గంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. కెంగల్‌లో ఉన్న ఆయన స్మారకాన్ని స్మృతి ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తామన్నారు.

డ్రైవర్ కం కండక్టర్ పోస్టుల్లో అక్రమాలు

యశవంతపుర: కలబురిగి జిల్లాలో డ్రైవర్, కండక్టర్ నియామకాలకు సంబంధించి అక్రమాలు బయటపడ్డాయి. కల్యాణ కర్ణాటక రవాణా సంస్థ (కెకెఆర్‌టీసీ) నిర్వహించిన డ్రైవర్ కం కండక్టర్ నియామకాలకు సంబంధించి బరువు ఎక్కువగా కనిపించడానికి అభ్యర్థులు కాళ్లకు ఇనుప రాడ్లను కట్టుకొని అక్రమాలకు పాల్పడిన విషయం బయట పడింది. నియమాలకు సంబంధించి నిర్దిష్టమైన బరువు ఉండాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. బరువు తక్కువ ఉన్న నలుగురు అభ్యర్థులు ఈ అక్రమాలకు పాల్పడి చిక్కిపోయారు. 1619 పోస్టులకు 38 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఎత్తుతో పాటు 55 కేజీలు బరువు ఉండాలి. ఒక అభ్యర్థి ఐదు కేజీలున్న రెండు ఇనుప కంబిలను డ్రాయర్‌లో పెట్టుకుని చిక్కిపోయాడు. పర్యవేక్షిస్తున్న అధికారి అనుమానంతో తనిఖీ చేయగా అక్రమాలు బయటపడ్డాయి.

అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటాం



బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిష్టానం పెద్దల వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం నగరంలోని బొమ్మనహళ్లి బిళ్ళెకహళ్ళి వార్డులో ఓ కన్వెన్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి అభిషేక్ దత్, బెంగళూరు దక్షిణ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అడూరు ప్రకాశ్, కేపీసీసీ కార్యాధ్యక్షుడు రామలింగారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కృష్ణప్ప ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బొమ్మనహళ్లిలో అధికార బీజేపీపై విజయం సాధించడానికి సరైన అభ్యర్థి లేకపోవడంతో మూడు పర్యాయాల నుంచి ఓటమి పాలవుతున్నామని, స్థానిక ఎమ్మెల్యేపై ఆ పార్టీలో పూర్తి వ్యతిరేకత ఉందని, వెంటనే అభ్యర్థిని ప్రకటిస్తే బొమ్మనహళ్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కార్యకర్తలు పెద్దల వద్ద విన్నవించారు.

హోసూరు వార్తలు..

ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య

క్రిష్ణగిరి: ఉద్యోగానికెళ్లని భర్తను భార్య నిలదీయడంతో భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు ... సూళగిరి సమీపంలోని సింపల్‌త్రాడి గ్రామానికి చెందిన కుప్పుస్వామి (30) ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా పనికెళ్లకపోవడంతో భార్య నిలదీసింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన కుప్పుస్వామి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటనపై సూళగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యా సహాయ నిధి వినతులపై చర్యలు చేపట్టండి

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సహాయం పథకంలో పెండింగ్‌లో వినతులపై తక్షణం చర్యలు చేపట్టాలని శుక్రవారం కలెక్టర్ దీపక్ జేకబ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలకు ప్రోత్సాహక నిధి పథకం ప్రవేశపెట్టిందని, ఈ పథకం ద్వారా క్రిష్ణగిరి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న 4152 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకొన్నారని, వీరిలో 3023 మందికి ప్రోత్సాహక నిధి అందజేసేందుకు అనుమతులు వచ్చాయని, 388 వినతులను నిరాకరించబడ్డాయని, 741 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, మహేంద్రన్, కళాశాల, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి

క్రిష్ణగిరి: రెండు ద్విచక్ర వాహనాలు నేరుగా ఢీకొన్న ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి సమీపంలోని గుడిలీకొటాయ్ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు చిన్నతంబి (28) గురువారం సాయంత్రం మామ అరియప్ప (42)తో కలిసి ద్విచక్ర వాహనంలో క్రిష్ణగిరి- రాయకోట రోడ్డుపై వెళ్తడంగా ఎదురుగా మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన చిన్నతంబిని ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. క్రిష్ణగిరి తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

హాసన టికెట్ విషయంలో గందరగోళం లేదు

- హెచ్.డీ.కుమారస్వామి

శివాజీనగర: హాసన టికెట్ విషయంలో ఎలాంటి గందరగోళం లేదని, ముఖ్యంగా భవాని రేవణ్ణ ఈ ఎన్నికల్లో అనివార్యం కాదని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం బెళగావిలో విలేకరులతో మాట్లాడిన ఆయన, హాసన్, హొళెనరసీపుర టికెట్ విషయంలో ఎలాంటి గందరగోళం తమలో లేదని తెలిపారు. హాసన్ టికెట్ విషయం మరో వారంలో పరిష్కరిస్తామని అన్నారు. 30 నుంచి 40 నియోజకవర్గాల్లో అభ్యర్థుల కొరత ఉందన్నారు. కొత్తవారికి అవకాశం ఇస్తామన్నారు. రమేశ్ జారకిహొళి సీడీ కేసు గురించి ప్రస్తావిస్తూ, సీడీ గురించి మాట్లాడేంత సమయం లేదని, అంతేకాకుండా సీడీలపై తనకు నమ్మకం లేదు. దీనిని ఉంచుకొని ఎన్నికలు ఎదుర్కొవటానికి సాధ్యమేనా? ప్రజల ముందు దీనిని ప్రస్తావిస్తే ఓట్లు పొందటానికి సాధ్యపడుతుందా? ప్రజల సమస్యల వైపు దృష్టిసారిస్తే మంచిదన్నారు.

నిలిపి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- ఇద్దరు దుర్మరణం



విజయపుర (బెంగళూరు గ్రామీణ): రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీని బుల్లెట్ బైక్‌తో ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన విజయపుర పీఎస్ పరిధిలోని జాతీయ రహదారి వద్ద ఉన్న సాయిబాబా దేవాలయం ముందు చోటు చేసుకుంది. మృతులను భరత్ (31)గా గుర్తించారు. మరో మహిళ వివరాలు తెలియ రాలేదు. రోడ్డుపై లారీ రిపేరి కావడంతో అక్కడే ఆగిపోయింది. వేగంగా వచ్చి లారీని ఢీకొట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుల వివరాలపై ఆరా తీస్తున్నారు.

ఓటుతో బుద్ధి చెప్పండి

తుమకూరు: తప్పుడు హామీలు ఇచ్చిన రాజకీయ పార్టీల నేతలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కర్ణాటక రాష్ట్రపార్టీ సమితి అధ్యక్షుడు రవికృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందించి మాట్లాడారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజాధనాన్ని లూటీ చేసిన నేతలను నమ్మవద్దని సూచించారు.

గ్రామాల్లోకి ఏనుగులు

మైసూరు: మైసూరు జిల్లా హెచ్‌డి.కోటె తాలూకా అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఐదు ఏనుగుల గుంపు సమీపంలోని చెరువులో సేద తీరుతున్నాయి. ఏనుగుల రాకను గుర్తించిన సమీపంలోని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను ఎక్కడ నాశనం చేస్తాయోనని భయపడిపోతున్నారు.ఏనుగులు అడవిలోకి వెళ్లకుండా ముల్లూరు సమీపంలో మకాం వేశాయి.

యువకుడి ఆత్మహత్య

- పోలీసులు వేధిస్తున్నారని సెల్ఫీ వీడియో

బొమ్మనహళ్లి: పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆనేకల్ తాలూకా సర్జాపుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోవిపాళ్యలో నివాసం ఉంటున్న సురేష్ (25) ఆత్మహత్యకు ముందు తన బాధను సెల్ఫీ వీడియోలో రికార్డు చేసి ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేశాడని పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు...డ్రైవర్‌గా పనిచేసే సురేశ్ బోవిపాళ్యలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. వైట్‌ఫీల్డ్‌లో ఉన్న సమయంలో అక్కడ ఓ యువతిని ప్రేమించాడు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సురేశ్‌పై కేసు నమోదు చేశారు. అత్యాచారం కేసు నమోదు చేశామని, స్టేషన్‌కు రావాలని పదే పదే ఫోన్లు చేసి పోలీసులు బెదిరించినట్లు సమాచారం. దీంతో అతను తీవ్ర మనోవేదనతో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బ్యాంక్ చోరీ కేసు

- పెద్దల సమక్షంలో గ్రామస్తుల సమావేశం

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా హొసహళ్లి గ్రామంలోని కర్ణాటక గ్రామీణ బ్యాంక్ చోరీ కేసులో తాకట్టు ఆభరణాలు కూడా చోరీకి గురవడంతో పెద్దల సమక్షంలో బ్యాంకు సిబ్బందితో గ్రామస్తులు సమావేశమయ్యారు. బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు పోగొట్టుకున్న కస్టమర్లు మూడు ప్రధాన డిమాండ్లను ముందుంచారు. చోరీ జరిగి నెలలు గడుస్తున్నా బ్యాంక్ వారు బాధితులకు ఎటువంటి హామీ ఇవ్వలేదని, తమకు ఆభరణాలు తిరిగి ఇవ్వాలని లేదా వాటి విలువ కట్టి నగదు రూపంలో చెల్లించాలని కస్టమర్లు డిమాండు చేస్తున్నారు. బాధితులు అందరికీ ఒకేసారి పరిహారం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ డబ్బులు కూడా కస్టమర్లకు చెల్లించాలని సభలో డిమాండు చేసారు. కస్టమర్ల డిమాండ్లు విన్న బ్యాంకు సిబ్బంది తమ పై అధికారులకు తెలియజేసి త్వరలో ఒక నిర్ణయం చెబుతామన్నారు. సమావేశంలో కర్ణాటక గ్రామీణ బ్యాంక్ రీజనల్ ఆఫీసర్ మంజునాథ్, సెక్యూరిటీ ఆఫీసర్ రవీంద్ర, రీజనల్ మేనేజర్ రామ్‌రాజ్, హొసహళ్లి బ్యాంక్ మేనేజర్ తనుచౌబె, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని అగళకోట వద్ద కొత్తగా నిర్మించిన మాదేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈనెల 6 నుంచి ఆలయంలో ఉత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, వాస్తు హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్టాపన, కాలయాగ పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం భాజా భజంత్రీలు మోగుతుండగా వేద పండితుల మంత్రోక్షరణల మధ్య పుణ్యజలాలతో గోపుర కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అగళకోట, జవుళగిరి, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం జరిగింది.

టిప్పర్ చోరీకి గురైనట్లు నాటకం

- డ్రైవర్, అతని స్నేహితుడి అరెస్ట్

హోసూరు: టిప్పర్ చోరీకి గురైనట్లు యజమానిని వంచించిన డ్రైవర్‌తోపాటు మరి వ్యక్తిని బాగలూరు పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని తాదయ్యంగరపట్టి గ్రామానికి చెందిన సురేష్(39) టిప్పర్ నిర్వహిస్తున్నాడు. హోసూరు సమీపంలోని తుమ్మనపల్లి వద్ద నివాసముంటున్న చెన్నై తాంబరం ప్రాంతానికి చెందిన శ్రీధర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5న బాగలూరు సమీపంలోని నారీపురం వద్ద టిప్పర్ నిలిపి ఉంచగా చోరీకి గురైనట్లు డ్రైవర్ శ్రీధర్ యాజమాని సురేష్‌కు సమాచారం అందించాడు. దీంతో బాగలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని కోలారు జిల్లా మాలూరు సమీపంలోని శానమంగలం అటవీ ప్రాంతంలో టిప్పర్ నిలిపి ఉన్నట్లు తేలడంతో సీఐ బాలక్రిష్ణన్, పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. నారీపురం గ్రామానికి చెందిన మురుగేషన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా శ్రీధర్ అతని స్నేహితుడని తేలింది. లారీ చోరీకి గురైనట్లు ఈ ఇద్దరూ యజమానిని వంచించినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

రథోత్సవానికి సన్నాహాలు



పాలకంబ నాటి రథోత్సవ కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తేరుపేటలో వెలసిన చారిత్రక ప్రసిద్ధి పొందిన మరకతంబ సమేత శ్రీ చంద్ర చూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవానికి శుక్రవారం ఉదయం పాలకంభం నాటి కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవం మార్చి 7న ఘనంగా జరుగనుంది. అందులో భాగంగా శుక్రవారం ఆలయ కమిటీచే ఏర్పాటు చేసిన పాలకంబ నాటే కార్యక్రమానికి హోసూరు మాజీ ఎమ్మెల్యే కే. గోపీనాథ్, బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం. నాగరాజ్, ఆలయ కమిటీ కార్యవర్గ నిర్వాహకులు పాల్గొని విశేష పూజలు నిర్వహించి రథోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను ప్రారంభించారు. శుక్రవారం నుంచి ఆలయంలో రోజూ నిత్య పూజలతో పాటు వివిధ కార్యక్రమాలు జరుగనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కెలమంగలం: కెలమంగలం సమితి ఉళ్లుగురికి గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి పారిశ్రామికవేత్త వరదరాజన్ భూమిపూజ చేశారు. ఉళ్లుగురికి గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.40 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు ఈశ్వరిముత్తన్, ఉపాధ్యక్షుడు సురేఖ గోవిందరాజ్, పంచాయతీ కార్యదర్శి వివేకానంద, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భార్య, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

కెలమంగలం: భార్య, ఇద్దరి పిల్లల అదృశ్యంపై భర్త డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... పట్టణంలోని మేల్‌కోట ప్రాంతానికి చెందిన మణిగంటన్ (38). ఇతని భార్య రుక్షణ (29). వీరికి ఐశ్వర్య (13), సౌందర్య (11) పిల్లలున్నారు. భర్త పనికి వెళ్లకపోవడంతో దంపతులు మధ్య తరుచు గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన గొడవతో భార్య తన ఇద్దరి కూతుర్లను తీసుకుని బయటకు వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించిన కనిపించలేదు. దీంతో మణిగంటన్ డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యాపారి ఇంట్లో చోరీ

హోసూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగలు దోచుకెళ్లిన ఘటన క్రిష్ణగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి సమీపంలోని పెద్దమోటూరు గ్రామానికి చెందిన వ్యాపారి శివకుమార్. రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి క్రిష్ణగిరిలోని బంధువుల ఇంటికెళ్లాడు. గురువారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 11 పొన్ల బంగారు నగలు, రూ. 5000 నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

క్లుప్తంగా...



వెక్కిరించిన వైకల్యాన్ని 'కాళ్ల'రాశాడు

కాళ్లతో పరీక్ష రాసిన విద్యార్థి

బెల్లంపల్లి: రెండు చేతుల్లేకపోయినా కాళ్లతో పరీక్ష రాసి ఆత్మవిశ్వాసానికి అసలు సిసలైన చిరునామాగా మారాడు ఎల్లూరి శంకర్. నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి శంకర్ బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం(కంప్యూటర్స్) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చిన్నతనంలోనే విద్యుదాఘాతంతో రెండు చేతులు కోల్పోయినా పట్టుదలతో చదువు కొనసాగిస్తున్నాడు. ప్రస్తుతం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. భవిత డిగ్రీ కళాశాల కేంద్రంలో శుక్రవారం జరిగిన పరీక్షకు హాజరయ్యాడు. బెంచిపై కూర్చుని ఎడమకాలితో జవాబు పత్రాన్ని.. కుడి కాలివేళ్లతో పెన్ను పట్టుకుని పరీక్ష రాశాడు. తోటి విద్యార్థులతోపాటే శంకర్ నిర్ణీత సమయంలో పరీక్ష పూర్తి చేయడం విశేషం.

'బీజేపీయేతర రాష్ట్రాల్లో పెట్రో ధరలెక్కువ'



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా బీజేపీయేతర రాష్ట్రాల్లోనే పెట్రోల్ ధరలు అధికంగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణతో పాటు పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, జార్ఖండ్ రాష్ట్రాలు పెట్రో ఉత్పత్తులపై వ్యాట్ తగ్గించనందునే అక్కడ ధరలు అధికంగా ఉన్నాయని వివరించారు. ఇవి మినహా మిగతా అన్ని రాష్ట్రాలు పెట్రో ధరలను తగ్గించాయని వెల్లడించారు. బడ్జెట్ పై నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్న సమయంలో విపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. దీనిపై నిర్మల ప్రతిస్పందిస్తూ..కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తోందని, వాటికి సమాధానం చెబుతుంటే సభలోంచి వెళ్లిపోవడం చేస్తుందని మండిపడ్డారు.

'సాహితీ' లక్ష్మీనారాయణకు బెయిల్

సాక్షి, హైదరాబాద్: డబుల్, ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్స్‌తో అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ముందే ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో అనేకమందిని ఆకర్షించి వారిని మోసగించిన కేసులో అరెస్టు అయిన సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీ నారాయణకు బెయిల్ మంజూరైంది. నాంపల్లి కోర్టు శుక్రవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,500 మంది నుంచి రూ.900 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఈయనపై ఆరోపణలున్నాయి.

సీవీ ఆనంద్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ఆదేశాలు అమలు చేయనందుకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆనంద్‌తో పాటు సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్తెయ్య, ఎస్సై సురేశ్‌రెడ్డిలకు కూడా నోటీసులు జారీచేసింది. నిరుద్యోగులతో కలసి ఫిబ్రవరి 3న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు.. అసెంబ్లీ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కోర్టు ఆదేశాలను పాటించకుండా తనను అరెస్టు చేశారని పేర్కొంటూ బల్మూరి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు వాదనలు వినిపిస్తూ కోర్టు ఆదేశాల మేరకు అరెస్టు చేసిన 24 గంటల్లో ఆ వ్యక్తిని మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టాలన్నారు. కానీ, పోలీసులు ఆ ఆదేశాలను పాటించలేదని చెప్పారు. దీంతో న్యాయమూర్తి పోలీస్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు హైకోర్టు నోటీసులు


సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎయిడెడ్ స్కూల్‌లో పనిచేస్తున్న వారి వేతనాలకు సంబంధించి తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయనందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. మార్చి 10న కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలిచ్చినా అమలు చేయకపోవడంతో హరిబౌలీ హైస్కూల్‌లో ఉద్యోగి రాఫ్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ పైవిధంగా ఆదేశాలు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేశారు.

కాసుల యావ.. కోతల హవా

ఎడాపెడా సిజేరియన్లు చేసేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

- సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా కడుపు కోతకే మొగ్గు
- తల్లీబిడ్డల ఆరోగ్యం పట్టించుకోని వైనం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ భారీ సంఖ్యలోనే సిజేరియన్లు
- సర్కారు ఆదేశాలు బేఖాతరు.. రంగారెడ్డి జిల్లాలో ఇష్టారాజ్యం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వైద్యుల కాసుల కక్కుర్తి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా అధిక ఫీజుపై ఆశతో ఎడాపెడా 'కోత'లు పెడుతున్నారు. దీనికితోడు మంచి ముహూర్తంలో బిడ్డకు జన్మనివ్వాలనే కొందరు భార్యాభర్తల ఆలోచన.. తమ బిడ్డ పురిటి నొప్పులు భరించ లేదనే కొందరు తల్లిదండ్రుల ఆందోళన.. సిజేరియన్లు పెరిగిపోయేందుకు దోహదపడుతోంది. సాధారణ ప్రసవాల్లో తక్కువ రక్తస్రావంతో పాటు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం పెద్దగా ఉండదు. కేవలం వారం రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు. అదే సిజేరియన్లతో అధిక రక్తస్రావం సమస్యతో పాటు వారం నుంచి పది రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుంది. ఇలాంటి వాటిపై అవగాహన కల్పించి సిజేరియన్లు నివారించేందుకు ప్రయత్నించాల్సిన వైద్యులు, ఆ పని చేయకుండా వారి బలహీనతలను క్యాష్ చేసుకుంటున్నారు. వీధి చివర్లో ఉన్న నర్సింగ్ హోమ్‌లో సాధారణ ప్రసవానికి రూ.35 వేల నుంచి 40 వేలలోపే ఖర్చు అవుతుంది. అదే సిజేరియన్ అయితే రూ.80 వేల నుంచి రూ.లక్షకు పైగా ఖర్చు అవుతోంది. ఇక కార్పొరేట్ ఆస్పత్రి అయితే ఆ స్థాయిలోనే సాధారణ, సిజేరియన్ డెలివరీ ఫీజులు ఉంటున్నాయి. ఎప్పటికప్పుడు ప్రసూతి కేంద్రాలను తనిఖీ చేసి...కడుపు కోతలకు పాల్పడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో చిన్నాచితకా నర్సింగ్‌హోమ్‌లు మొదలు కార్పొరేట్ ఆస్పత్రుల దాకా ఇష్టారాజ్యంగా మారిపోయిందనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు ఎక్కువ జరుగుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ సిజేరియన్లు ఒకింత ఎక్కువగానే ఉండటం గమనార్హం.



జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు..

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు
2018-19	19,513	7,340
2019-20	22,023	8,261
2020-21	21,598	8,060
2021-22	23,515	9,542
2022-23 (ఏప్రిల్-నవంబర్)	16,321	6,287

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు ఇలా..

సంవత్సరం	మొత్తం ప్రసవాలు	సిజేరియన్లు
2018-19	12,271	7,966
2019-20	19,524	12,704
2020-21	19,337	13,338
2021-22	19,183	13,895
2022-23 (ఏప్రిల్-నవంబర్)	10,990	8,031

ప్రత్యేక పరిస్థితుల్లోనే సిజేరియన్ చేయాలి

కడుపులో బిడ్డ అడ్డం తిరిగినప్పుడు, తల్లి ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఉమ్మనీరు తాగి బిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాలి. కానీ చాలామంది వైద్యులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కూడా వివిధ కారణాలతో సిజేరియన్ కోరుకుంటున్నారు. ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సహజ ప్రసవాల ద్వారా జన్మించిన శిశువుకు వెంటనే ముర్రుపాలు అందుతాయి. అదే సిజేరియన్ ద్వారా జన్మించిన బిడ్డ మూడు నాలుగు రోజుల పాటు పోత పాల పైనే ఆధారపడాల్సి వస్తుంది. తద్వారా రోగనిరోధకశక్తిని కోల్పోతుంది. కొన్నిసార్లు వారాల తరబడి ఇంక్యుబేటర్, ఫొటోథెరపీ యూనిట్లలో ఉంచాల్సి వస్తుంది.

– డాక్టర్ బాలాంబ, సీనియర్ గైనకాలజిస్టు

గణాంకాలే నిదర్శనం

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-నవంబర్ మధ్య మొత్తం (ఇళ్లలో, అంబులెన్సుల్లో జరిగినవి మినహాయించి) 16,321 ప్రసవాలు జరగ్గా ఇందులో సిజేరియన్లు 6,287 ఉన్నాయి. అదే ప్రైవేటు ఆస్పత్రుల విషయానికొస్తే.. మొత్తం 10,990 ప్రసవాలు జరిగితే అందులో 8 వేలకు పైగా సిజేరియన్లే కావడం గమనార్హం. అంతకుముందు 2021-22లో 19,183 ప్రసవాలు జరిగితే అందులో సిజేరియన్లు 13,895 ఉండటం ప్రైవేటు ఆస్పత్రుల తీరుకు అద్దంపడుతోంది. తల్లుల ఆరోగ్యంతో ఆటలాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులపై చర్యలు తీసుకోనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్న ఆస్పత్రులను సీజ్ చేయడంతో పాటు వైద్యుల ధ్రువీకరణ పత్రాలను కూడా రద్దు చేస్తామని ప్రకటించారు. అయినా క్షేత్రస్థాయిలో సిజేరియన్ల సంఖ్య తగ్గక పోగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఇంకెంత ఆలస్యం..?

- బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణంలో జాప్యంపై ఎంపీ ఉత్తమ్ ఆగ్రహం
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పుడు నెరవేరుస్తారని కేంద్రానికి ప్రశ్న



సాక్షి, న్యూఢిల్లీ: బీబీ నగర్ ఎయిమ్స్ పూర్తిపై కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు దాటవేసే ధోరణిలోనే సమాధానాలు చెప్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లో ఇచ్చిన హామీల్లో భాగంగా పదేళ్లలో బీబీ నగర్ ఎయిమ్స్‌ను పూర్తి చేసే ప్రక్రియలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణాన్ని ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని కేంద్రాన్ని ఉత్తమ్ డిమాండ్ చేశారు. బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణంపై శుక్రవారం లోక్‌సభలో తాను అడిగిన ప్రశ్నకు కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ ముక్తాయింపు సమాధానం ఇచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎప్పటికప్పుడు వాయిదాలే..

బీబీనగర్ నిర్మాణం పూర్తిపై లోక్‌సభలో 2020 సెప్టెంబర్ 18న అడిగిన ప్రశ్నకు 2022 సెప్టెంబర్ కల్లా పూర్తి చేస్తామని కేంద్రం సమాధానం ఇచ్చిందన్నారు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 4న మరొక ప్రశ్నకు సమాధానంగా, 2023 నవంబర్ కల్లా పూర్తి చేస్తామని కేంద్రం గడువు పొడిగించిందని విమర్శించారు. కొన్ని నెలల తర్వాత 2022 జూలై 22న తాను అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో 2025 జనవరిలోగా బీబీనగర్ ఎయిమ్స్ పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రకటించారని ఎంపీ ఉత్తమ్ తెలిపారు. తాజాగా శుక్రవారం లోక్‌సభలో అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా టెండర్ ఇచ్చామని, నిర్మాణం మొదలైందని మాత్రమే చెప్పారు కానీ ఎప్పటికల్లా నిర్మాణాన్ని పూర్తి చేస్తామో చెప్పకుండా కేంద్రం తప్పించుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా బీబీనగర్ ఎయిమ్స్‌కు మంజూరైన రూ.1,028 కోట్లలో కేవలం రూ.29.28 కోట్లు మాత్రమే కేంద్రప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

గత జూలైలో ఎయిమ్స్ నిర్మాణానికి టెండర్

గత ఏడాది జూలైలో బీబీనగర్‌లో ఎయిమ్స్ నిర్మాణానికి టెండర్ పిలిచామని కేంద్ర వైద్యశాఖ సహాయమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ తెలిపారు. అనంతరం ఎయిమ్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.



శెభాష్..ఆశా మాలవీయా..!

సైక్లిస్ట్‌ను అభినందించిన డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్ : మహిళా భద్రతపై యువతలో సానుకూల దృక్పథం కల్పించడంతోపాటు డ్రగ్స్‌కు నో చెప్పండి అంటూ యువతలో సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు దేశవ్యాప్తంగా సైకిల్‌యాత్ర చేస్తున్న సైక్లిస్ట్ ఆశా మాలవీయాను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. ఈ మేరకు శుక్రవారం తన చాంబర్‌లో తెలంగాణ పోలీస్ జ్ఞాపికను అందించి అభినందించారు. 'మహిళల భద్రత, డ్రగ్స్‌పై సందేశం వ్యాప్తి చేసేందుకు సైకిల్‌పై ఆశా మాల్వియా భారతదేశం మొత్తం యాత్ర చేయడం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆమెకు మేమంతా సెల్యూట్ చేస్తున్నాం' అని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఐజీ తరుణ్‌జోషి పాల్గొన్నారు.

ఆర్టీసీకి అశోక్ లేలాండ్ ఎలక్ట్రిక్ బస్సులు

- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న సంస్థ
- జీసీసీ పద్ధతిలో నిర్వహించనున్న లేలాండ్
- కి.మీ.కు నిర్ధారిత మొత్తం చొప్పున చెల్లింపు



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ వాహనాల తయారీ సంస్థ అశోక్ లేలాండ్ తెలంగాణ ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన నిర్వహించనుంది. ఆర్టీసీ కొత్తగా సమకూర్చుకునే ఎలక్ట్రిక్ బస్సులను ఆ కంపెనీ నుంచే తీసుకోనుంది. అయితే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ఆర్టీసీ, వాటిని సొంతంగా కొనకుండా గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో అద్దెకు తీసుకోనుంది. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో ఇక బస్సులను సరఫరా చేయాల్సి ఉంది. త్వరలో అవి ఆర్టీసీకి అందనున్నాయి. అయితే అశోక్ లేలాండే వాటిని నిర్వహిస్తుంది కాబట్టి, అందుకు ప్రతిగా ఆ సంస్థకు ఆర్టీసీ కి.మీ.కు నిర్ధారిత మొత్తం చొప్పున అద్దెను చెల్లిస్తుంది.

మూడేళ్లలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు

ఇంతకాలం డీజిల్ బస్సులనే నడుపుతున్న టీఎస్ ఆర్టీసీ క్రమంగా ఎలక్ట్రిక్ బస్సుల వైపు చూస్తోంది. భారీగా పెరిగిన డీజిల్ ధర ఆర్టీసీపై భారం పెంచుతోంది. దీంతో క్రమంగా ఎలక్ట్రిక్ బస్సుల వైపు మళ్లటం ద్వారా ఆ ఖర్చును తగ్గించుకోవాలని సంస్థ నిర్ణయించింది. కానీ డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల ధర చాలా ఎక్కువ. ఎక్స్‌ప్రెస్ కేటగిరీలో తిరిగే డీజిల్ బస్సు రూ.35 లక్షలు పలుకుతుంటే, నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సు ధర రూ.కోటిన్నర వరకు పలుకుతోంది. అంత మొత్తం వెచ్చించి వాటిని కొనటం ఆర్టీసీకి తలకు మించిన భారంగా మారింది. దీంతో జీసీసీ పద్ధతిలో అద్దెకు తీసుకోవాలని నిర్ణయించింది. వచ్చే మూడేళ్లలో మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న ఆర్టీసీ, ఇప్పుడు అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి 500 బస్సులు సమకూర్చుకోనుంది. టెండర్ల ప్రక్రియలో ఆ సంస్థ ఎల్1గా నిలవటంతో దానికే బస్సుల నిర్వహణ బాధ్యత అప్పగించింది. కి.మీ.కు అద్దెను ఆ సంస్థ రూ.58గా కోట్ చేసింది. దాన్ని కనీసం రూ.54కు తగ్గించాలని ఆర్టీసీ కోరింది. దీనిపై ఆ సంస్థ ఇంకా తుది నిర్ణయం వెల్లడించలేదు. వచ్చే రెండు, మూడురోజుల్లో అది ఫైనల్ అయ్యే అవకాశం ఉంది.

కి.మీ.కు రూ.79


అశోక్ లేలాండ్ ఆర్టీసీకి డబుల్ డెక్కర్ బస్సులను కూడా సరఫరా చేయాల్సి ఉంది. తొలుత 10 బస్సులను ఆర్టీసీ తీసుకుంటోంది. ఇది కూడా జీసీసీ పద్ధతిలోనే అయినందున, దానికి కి.మీ.కు ఆ సంస్థ రూ.79ని అద్దెగా కోట్ చేసింది. అయితే దాన్ని కూడా కొంతమేర తగ్గించాలని ఆర్టీసీ కోరింది. త్వరలో దానిపై కూడా నిర్ణయం వెలువడనుంది.

డిపోల్లో చార్జింగ్ వ్యవస్థలు

ఎలక్ట్రిక్ బస్సులు పెరుగుతున్నందున, వాటి చార్జింగ్ కోసం డిపోల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఏయే డిపోలకు ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తారో, ఆయా డిపోల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అవసరం. కాగా 33 కేవీ అవసరమా, 11 కేవీ సరిపోతుందా? అనే పరిశీలన జరుగుతోంది. ఇందుకోసం ఇటీవలే అధికారుల స్థాయిలో కొన్ని మార్పులు చేశారు. గతంలో ఆర్టీసీ ఈడీ వినోద్‌కు ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ బాధ్యత ఉండేది. ఇప్పుడు ఓ అధికారి ప్రత్యేకంగా ఈ పనులకే ఉండాలన్న ఉద్దేశంతో ఆయన నుంచి దాన్ని తప్పించి సీఎంఈకి కేటాయించారు.

ఆత్మవిశ్వాసంలో అతివలే మేటి

- మహిళా ఐపీఎస్‌లు పెరుగుతుండటం శుభపరిణామం
- పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా ముందంజ వేస్తున్నారు
- ఔట్‌డోర్ శిక్షణలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు
- నాయకత్వ లక్షణాలు పెంచేలా అకాడమీలో శిక్షణ
- వివిధ వర్గాల అభిప్రాయాల మేరకు శిక్షణాంశాల్లో మార్పులు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎన్‌పీఏ డైరెక్టర్ ఏఎస్ రాజన్



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌లోకి వచ్చే మహిళా అధికారుల సంఖ్య ఏటా పెరుగుతుండటం శుభపరిణామం అని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ) డైరెక్టర్ ఏఎస్ రాజన్ అన్నారు. ఆత్మవిశ్వాసంలో పురుషుల కంటే అతివలే మేటి అని చెప్పారు. ప్రతి బ్యాచ్‌లోనూ 20 మందికిపైగా మహిళా ఐపీఎస్‌లు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణలోనూ పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా ఔట్‌డోర్‌లో సైతం తాము మేటి అని నిరూపిస్తున్నారన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న 2021 బ్యాచ్‌లోనూ దీక్ష అనే మహిళా ఐపీఎస్ బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీగా ఐపీఎస్ అసోసియేషన్ గౌరవ కరవాలాన్ని పొందారని, ఎన్‌పీఏ చరిత్రలో రెండోసారి ఈ ఘనత దక్కించుకున్న అధికారిణిగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఎన్‌పీఏలో శిక్షణ పొందిన 2021 బ్యాచ్ ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ శనివారం జరగనుంది. ఈ సందర్భంగా.. దేశవ్యాప్తంగా శాంతిభద్రతల నిర్వహణలో అత్యంత కీలకమైన ఐపీఎస్ అధికారులను తీర్చిదిద్దే ఎన్‌పీఏలో ఇచ్చే శిక్షణ, మారుతున్న పరిస్థితులకు తగిన విధంగా శిక్షణలో తెచ్చిన మార్పులు తదితర అంశాలపై రాజన్ 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అకాడమీలోకి వచ్చాక అందరూ సమానమే..

ఐపీఎస్‌కుకు ఎంపికయ్యే వారిలో కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌ల పిల్లల వరకు.. స్థానిక విద్యాసంస్థలు మొదలు కాన్వెంట్లలో చదివిన వారు.. అప్పుడే చదువులు పూర్తి చేసుకున్న వారి నుంచి విదేశాల్లో లక్షల జీతాల కొలువులు వదిలి వచ్చే వారి వరకు విభిన్న నేపథ్యాల వారు ఉంటారు. అది ఎన్‌పీఏలోకి రాకముందు వరకే. ఒకసారి అకాడమీలో అడుగుపెట్టిన తర్వాత వారంతా సమానమే. మొదటి రెండు వారాలు ఇదే అంశంపై దృష్టి పెడతాం. ట్రైనీలను బృందాలుగా ఏర్పాటు చేసి వారిలో నాయకత్వ లక్షణాలు పెంచేలా చూస్తాం. ఐపీఎస్ అధికారిగా తనతో పాటు వందల మందిని కలుపుకొని నిత్యం పనిచేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టుగా వారిని తీర్చిదిద్దుతాం.

నైతిక విలువలు పెంచేలా శిక్షణ

కొత్తగా విధుల్లోకి వచ్చే ఐపీఎస్ అధికారుల వైఖరి సరిగా ఉండడం లేదన్న విమర్శల నేపథ్యంలో 8 రాష్ట్రాల్లో 6 విధాలుగా అభిప్రాయాలు సేకరించాం. ఐపీఎస్‌ల వైఖరి, శిక్షణలో ఎలాంటి మార్పులు చేయాలన్న అంశాలపై డీఎస్పీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ ర్యాంకు వరకు ఒక గ్రూప్, డీఐజీ నుంచి డీజీపీ ర్యాంకు వరకు ఒక గ్రూప్, రెవెన్యూలో వివిధ స్థాయిల అధికారులు ఒక గ్రూప్, ఎన్జీఓలు.. మీడియా ఒక గ్రూప్, సమాజంలో ప్రభావిత స్థానాల్లో ఉన్న వారు ఒక గ్రూప్, ప్రజలు ఒక గ్రూప్.. ఇలా వారి అభిప్రాయాలు తీసుకుని వాటిని క్రోడీకరించి బలాలు, బలహీనతలు గుర్తించాం. బాధితులతో ఎలా వ్యవహరించాలన్న అంశంతో పాటు ఐపీఎస్ శిక్షణ నైతిక విలువలు పెంచేలా కరికులంలో చాలా మార్పులు చేశాం.

శిక్షణలోనూ స్త్రీ, పురుష తేడా లేదు

అకాడమీలో శిక్షణలో ప్రవేశించిన తర్వాత మహిళలు, పురుషులు అనే తేడా కూడా ఏ అంశంలోనూ ఉండదు. శిక్షణలోనూ మినహాయింపులు ఉండవు. వారంతా కూడా సుశిక్షితులైన పోలీస్ అధికారులుగా తయారు కావాల్సిందే. వాస్తవం చెప్పాలంటే ఆత్మవిశ్వాసంలో పురుషుల కంటే మహిళలే మేటి. ప్రతి బ్యాచ్‌లో మేం ఔట్‌డోర్ శిక్షణలో మహిళలకు ప్రత్యేకంగా ట్రోఫీ కేటాయిస్తాం. ఆ ట్రోఫీయే ఈసారి దీక్షకు దక్కింది. 2019లోనూ రంజితశర్మ బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనరీగా నిలిచారు. ఔట్‌డోర్ శిక్షణలో వాళ్లు పురుషులను వెనక్కి నెట్టి బెస్ట్‌గా నిలిచారు. చూస్తుంటే ఇకపై బెస్ట్ లేడీ ప్రొబేషనరీ ఔట్‌డోర్ ట్రైనింగ్ మాదిరిగా బెస్ట్ జెంటిల్‌మెన్ ప్రొబేషనరీ ఔట్‌డోర్ ట్రైనింగ్ అని పెట్టాల్సి వచ్చేట్టుంది.. (నవ్వుతూ..).

'సైబర్' సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక శిక్షణ

సైబర్ నేరాలనేవి భవిష్యత్తులో మనం ఎదుర్కొనబోయే అతిపెద్ద ముప్పు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు యువ ఐపీఎస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఇందుకోసం ఎన్‌పీఏలో ప్రత్యేకంగా నేషనల్ డిజిటల్ క్రైం రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్‌డీసీఆర్‌టీసీ)ని ఏర్పాటు చేశాం. సరికొత్త సైబర్ సవాళ్లను ఎదుర్కొనేలా ఇక్కడ శిక్షణ ఇస్తాం. ఇప్పటికే దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 10 వేల మంది వివిధ ర్యాంకుల పోలీస్ అధికారులకు ఎన్‌డీసీఆర్‌టీసీలో సైబర్ క్రైం దర్యాప్తు, నియంత్రణలో శిక్షణ ఇచ్చాం. ప్రొబేషనరీ ఐపీఎస్‌లతోపాటు సీనియర్ ఐపీఎస్‌లకు కూడా వివిధ దశల్లో ఇక్కడ శిక్షణలు ఇస్తుంటాం. మన పోలీసులతో పాటు నేపాల్, భూటాన్, మాల్దీవులు, మారిషస్ దేశాల పోలీస్ అధికారులకు సైతం శిక్షణ ఇస్తాం.

కేంద్ర బడ్జెట్ గేమ్ చేంజర్

నిపుణులతో చర్చాగోష్టిలో గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: విద్య, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలకు కేంద్ర బడ్జెట్ 2023-24 మేలు మలుపు (గేమ్ చేంజర్)లాంటిదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభివర్ణించారు. విద్య, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక కేటాయింపులతో రాబోయే రోజుల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ మూడు రంగాలకు కేటాయింపులపై శుక్రవారం ఆమె రాజ్‌భవన్‌లో ఆయా రంగాల నిపుణులతో చర్చాగోష్టి నిర్వహించారు. జాతీయ విద్యా విధానం 2020 స్ఫూర్తికి అనుగుణంగా డిజిటల్ టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రోత్సాహకాలతో విద్యా రంగంలో మార్పులు రాబోతున్నాయన్నారు. వ్యవసాయ రంగ అంకుర పరిశ్రమలు, సాంకేతిక వినియోగం, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహకాలు, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి కేటాయింపుల పెంపుతో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఎన్ఐఆర్డీ, ఎన్ఏఆర్ఎం, ఇక్రిశాట్,సెస్, ఇఫ్లూ, ఉర్దూ వర్సిటీల నిపుణులు చర్చలో పాల్గొని కేంద్రబడ్జెట్‌పై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్-2023 వేడుకల్లో భాగంగా గవర్నర్ అతిథులకు మినుములతో చేసిన వంటకాలను అందించారు.

నిందితులను చంచల్‌గూడకు తరలించండి

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించాలని పోలీసులను సీబీఐకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసు తెలంగాణకు బదిలీ అయిన విషయం తెలిసిందే. విచారణకు స్వీకరించిన సీబీఐకోర్టు రెండు వారాల క్రితం నిందితులకు నోటీసులు జారీ చేసింది. దీంతో ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకరరెడ్డి, దస్తగిరి, శివశంకర్‌రెడ్డి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశామని చెప్పారు. విచారణ కోర్టు హైదరాబాద్‌లో ఉన్నందున నిందితులు కూడా ఇక్కడే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ పెండింగ్‌లో ఉందని ఆయన తరఫు న్యాయవాది నయన్‌కుమార్ వాదనలు వినిపించారు. శివశంకర్‌రెడ్డిపై మరో కేసు విచారణ విజయవాడలో సాగుతోందని, అతన్ని హైదరాబాద్‌లో ఉంచితే విచారణకు హాజరు కావడం ఇబ్బందిగా మారుతుందని చెప్పారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ...విచారణ ఉన్న రోజు పోలీసులు తరలిస్తారని చెప్పారు. తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేశారు.

రెండు వారాల్లో కౌంటర్ వేయండి

పదోన్నతుల కేసులో విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును అమలు చేయనందుకు దాఖలైన కేసులో రెండు వారాల్లోగా కౌంటర్ వేయాలని విద్యుత్ సంస్థలను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవోలను తప్పుగా అన్వయించి, సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా పదోన్నతులు కల్పిస్తున్నందున ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు వారి రిజర్వేషన్లకు మించి పదోన్నతులు పొందుతున్నారని.. బీసీ, ఓసీ ఉద్యోగులు నష్టపోతున్నారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. పదోన్నతులను పునః సమీక్షించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను అందరికీ అమలు చేసి, విద్యుత్ ఉద్యోగులకు మాత్రం అమలు చేయకపోవడంతో వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. గత విచారణ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావలీ.. కౌంటర్ దాఖలుకు విద్యుత్ సంస్థలకు 4 వారాలు గడువిచ్చారు. ఈ పిటిషన్ మళ్లీ విచారణ వచ్చింది. కౌంటర్ దాఖలుకు మరో 4 వారాలు గడువు కావాలని విద్యుత్ సంస్థల న్యాయవాది ఉమాదేవి కోరగా.. దీనికి పిటిషనర్ల న్యాయవాది అభ్యంతరం తెలిపారు.

'నీ విద్య నువు సరిగా నేర్చుకో... డబ్బు, గుర్తింపు అవే వస్తాయి' అంటోంది ఈ టైలరమ్మ.
బట్టలు కొత్తగా కుట్టడం కూడా లక్షలు తెచ్చి పెడతాయా? .. పెడతాయి.
పల్లెటూళ్లో వ్యవసాయం చేసుకుంటూ రాత్రిళ్లు కుట్టు పని చేసిన ధోలీ
యూ ట్యూబ్‌లో అందరూ టాలెంట్ ప్రదర్శించడం చూసి
తను కూడా టైలరింగ్‌ను యూ ట్యూబ్‌లో చూపెట్టింది.
రకరకాల స్త్రీల దుస్తులను కట్ చేసి కెమెరా ముందు
కుడుతుండేసరికి లక్షల మంది ఫాలోయెర్లు ఏర్పడ్డారు.
కుట్టడానికి ఆర్డర్లు వచ్చిపడుతున్నాయి.
యూ ట్యూబ్ నెల తిరిగే సరికి చెక్ పంపుతోంది.
అవార్డులు కూడా మొదలయ్యాయి.
కత్తెర, టేప్‌తో ఒక మహిళ సాధించిన విజయం ఇది.
నవ్యమైన ఐడియానే ఆమె విజయానికి కారణం.

యూ ట్యూబర్


ధోలీ

కెమెరా ముందు కుడితే లక్షలు వస్తున్నాయి

'కొందరు విధిని నమ్ముకుని కూచుంటారు. కొందరు మాత్రం తమ విధిరాతను తామే రాసుకుంటారు' అంటుంది ధోలి.

ఈమె ఇప్పుడు రాజ్ మసంద్‌లో ఉంటుంది. ఇది రాజస్థాన్‌లోని ఒక మోస్తరు సిటీ. కాని అక్కడి నుంచే దేశం మొత్తానికి తెలిసింది. ఇంకా చెప్పాలంటే ఎక్కడెక్కడైతే భారతీయులు ఉన్నారో అక్కడి వారికి కూడా తెలిసింది. దానికి కారణం బట్టలు కుట్టడంలో ధోలికి ఉండే విశేష ప్రతిభ, సృజనాత్మకత. వేగం. కొత్తదనం. స్త్రీలు ధరించే అన్ని రకాల వస్త్రాలను మరింత కొత్తగా ఎలా చేయవచ్చో, ఎలా ఆకర్షణీయంగా మలచవచ్చో ధోలి చేసే వీడియోల్లో చూడొచ్చు. కొందరు విద్యను దాచుకుంటారు. కాని ధోలి తనలాంటి స్త్రీలు టైలరింగ్ నేర్చుకుని తమ కాళ్ల మీద తాము నిలబడాలని తెలిసిందంతా చెప్పేస్తుంది. అందుకే ఆమెకు అంత ప్రచారం. మన్నన.

బాల్య వివాహం చేసుకుని

ధోలిది రాజస్థాన్‌లోని భరత్‌పూర్. తండ్రి వ్యవసాయం చేసేవాడు. వెనుకబడిన ప్రాంతం కావడంతో 10 సంవత్సరాలకే పెళ్లి చేసి ఈడేరాక అత్తారింటికి పంపాడు. 18 ఏళ్లు వచ్చే సరికి ధోలి ముగ్గురు పిల్లల తల్లి. అత్తారింటిలో పెద్ద కోడలు కావడం వల్ల బండెడు చాకిరీ ఉండేది. పగలు పొలంలో కూలి పని చేసేది. పాలు పితికి అమ్మేది. చిన్నప్పటి నుంచి టైలరింగ్ అంటే ఆసక్తి ఉండటం వల్ల నేర్చుకోవడంతో రాత్రిళ్లు కరెంటు లేని ఇంట్లో కిరోసిన్ దీపం కింద కుట్టేది. కాని బతుకు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అన్నట్టుగానే ఉండేది.



సిటీకి మారాక

కొన్ని కారణాల వల్ల పట్నమైన రాజ్ మసంద్‌కు ధోలి కాపురం మార్చింది. అక్కడ టైలరింగ్ మొదలెట్టింది. 2016లో యూట్యూబ్ ఆమె దృష్టికి వచ్చింది. అందులో రకరకాల వ్యక్తులు తమకు తెలిసిన విద్యలు వీడియోలు చేసి పెట్టడం గమనించింది. 'నేనెందుకు నా టైలర్ విద్యను ప్రదర్శించకూడదు' అని వీడియోలు చేసి పెట్టింది. రోడ్డు మీద ఉండే తన ఇంటిలో రోడ్డు రణగొణ ధ్వనుల మధ్య ఆ వీడియోలు చేసి అప్‌లోడ్ చేసింది. కాని అంతగా గుర్తింపు రాలేదు. ధోలి ఆగలేదు. వీడియోలు బాగా గమనించి ఎలా చేయాలో తెలుసుకుని 2017లో 'ఘోరి ఫ్యాషన్ డిజైనర్' పేరుతో యూట్యూబ్ చానల్ తెరిచింది.

27 కోట్ల వ్యూస్

టైలరింగ్ పని నేర్చుకోవాలని చాలా మంది స్త్రీలకు ఉంటుంది. కొత్త కొత్త ఫ్యాషన్స్ ఫాలో కావాలని మరికొంత మంది స్త్రీలకు ఉంటుంది. వీరంతా వెంటనే ధోలి చేస్తున్న వీడియోలను ఇష్టపడి చానల్‌కు సబ్‌స్క్రయిబ్ చేశారు. ఏ బట్టను ఏ మోడల్‌తో ఎలా కుట్టాలో ధోలి చకచకా చెప్తూ కుట్టి చూపుతుంది కాబట్టి వాటిని ఫాలో కాసాగారు. కుర్తీలు, అనార్కలి డ్రస్సులు, బ్లౌజ్‌లు... ఒకటని ఏముంది చాలా కొత్తరకంగా ధోలి డిజైన్లు ఉంటాయి. యూ ట్యూబ్ నుంచి తొలి పారితోషికంగా 11 వేల రూపాయలు వచ్చాయి. ఇప్పుడు ఆమెకు 16 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇప్పటికి 700 వీడియోలు చేసి అప్‌లోడ్ చేసింది. వీటికి 27 కోట్ల వ్యూస్ వచ్చాయి. యూ ట్యూబ్ నుంచి నెలకు లక్షకు పైగా పారితోషికం అందుతోంది. అంటే ధోలి ఎంత సక్సెస్‌ఫుల్ టైలరమ్మో అర్థం చేసుకోవచ్చు. తన ప్రచారం కోసం ఫేస్‌బుక్‌లోనూ ఇన్‌స్టాలోనూ అకౌంట్లు తెరిచింది.

రోజుకు 20 రూపాయల నుంచి

ఒకప్పుడు పల్లెటూళ్లో రాత్రిళ్లు బట్టలు కుడితే అతి కష్టమ్మీద రోజుకు 20 రూపాయలు వచ్చేవి. ఇవాళ ధోలి కేవలం తన ప్రతిభ, సృజనాత్మకతతో పాటు సోషల్ మీడియా సహాయంగా పెద్ద సంపాదన చూస్తోంది. రాజ్ మసంద్‌లో మంచి ఇల్లు ఏర్పాటు చేసుకుంది. ఆమెను పిలిచి అవార్డులు ఇచ్చి గౌరవిస్తున్నారు.

'ఎదుటి వారిని ఓడించడం కంటే మనం గెలవడం ముఖ్యం అనుకోవాలి. మనలోని ప్రతికూల భావాలను తీసేస్తే తప్పకుండా విజయం సాధిస్తాం' అంటుంది ధోలి.


• టూర్
లలితాంబాల్

వయసు 84.. చలో యూరప్

మహిళ తన కలలను సాకారం చేసుకోగలిగేది కుటుంబ అవసరాలన్నీ పూర్తయిన తర్వాతే. అంటే అన్ని బాధ్యతలు తీరాక అప్పటికీ పరిస్థితులు అనుకూలిస్తే అది ఆమె అదృష్టంగా మారుతుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కోయంబత్తూర్ వాసి 84 ఏళ్ల లలితాంబాల్ భారతదేశం బయటి ప్రపంచాన్ని చూస్తూ ఆరు దశాబ్దాల తన కలను నెరవేర్చుకుంటోంది. ఈ క్రమంలో ఎదురైన సవాళ్లను ఈ రిటైర్డ్ టీచర్ అధిగమిస్తున్న విధానం చాలా ఆసక్తిదాయకంగానూ, ఎంతోమంది అనుసరించదగినదిగానూ ఉంటుంది.

60వ దశకంలో లలితాంబాల్ జాగ్రఫీ, హిస్టరీ టీచర్‌గా పనిచేసేవారు. ఆ సమయంలో ఆమె ప్రపంచాన్ని పర్యటించాలని కలలు కనేవారట. కానీ ఆమెకు పరిస్థితులు అనుకూలించలేదు. ఆరు దశాబ్దాల తర్వాత ఇప్పుడు ఒక విదేశీ గడ్డపై అడుగుపెట్టింది.

పాస్‌పోర్ట్ వచ్చిన వేళ

''చిన్నవయసులోనే పెళ్లి అవడం, ఆ తర్వాత కుటుంబ బాధ్యతలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చాను. అదే నాకు సంతోషాన్ని ఇచ్చింది. ఆర్థిక కష్టాలు, ఇతర ప్రాధాన్యాలతో కుటుంబ భవిష్యత్తు వైపే ఉండటానికి నిర్ణయించుకున్నాను. నా సమయమంతా అందుకే కేటాయించాను. అయితే, నా కలలు మాత్రం ఎప్పుడూ నన్ను వీడిపోలేదు. పుస్తకాల్లో చదివిన విషయాలు, విద్యార్థులకు బోధించే సమయంలోనూ 'ఎప్పుడైనా బయట ప్రపంచం వైపుగా ప్రయాణం చేయగలనా..' అని అనుకునేదాన్ని. కానీ, ప్రయాణం మాట అటుంచితే కనీసం పాస్‌పోర్ట్ కూడా తీసుకోలేకపోయాను. రెండేళ్ల క్రితం నా కూతురు మేఖల పాస్‌పోర్ట్‌కు అప్లై చేయమని చెప్పింది. ప్రయత్నించాను. 83 ఏళ్ల వయసులో నా చేతుల్లోకి పాస్‌పోర్ట్ వచ్చింది.

నాలుగేళ్ల క్రితం..

నెదర్లాండ్స్‌లో నా మనవరాలు స్థిరపడింది. తన పొదుపు మొత్తంతో నా కలను నిజం చేయడానికి తను బాధ్యత తీసుకుంది. నా దగ్గర కూడా కొంత పొదుపు మొత్తాలున్నాయి. అయితే, మూడేళ్ల క్రితం వచ్చిన కరోనా మహమ్మారి కారణంగా నా భర్త మరణించడంతో అన్నీ ఆగిపోయాయి.


కుటుంబ సభ్యులతో లలితాంబాల్

యూరప్ అంతా...

ప్రస్తుతం ఉన్న వయసు, ఆరోగ్యస్థితి కారణంగా విదేశాలకు వెళ్లగలనా, కుటుంబంలో మిగతా అందరికీ ఆందోళనగా మారుతుందా అని మొదట్లో సంకోచించాను. కానీ, పిల్లలు ఇచ్చిన ధైర్యంతో ఎట్టకేలకు ఆమ్‌స్టర్‌డామ్‌లో దిగాను. మా అమ్మాయితో కలిసి మూడు నెలల పాటు యూరప్ అంతా ప్రయాణించాను. భౌగోళికం, చరిత్రలో విద్యార్థులకు బోధించిన విషయాలు కళ్లారా చూడటం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అందులో ఒక ఉదాహరణ.. రిజ్క్ మ్యూజియంలోని అతి పెద్ద వాటర్లూ యుద్ధం పెయింటింగ్ చూసి ఊపిరి పీల్చుకున్నాను. ఊహల్లోకంటే వాస్తవికంగా చూసినప్పుడు ఆ పెయింటింగ్ మరింత అద్భుతంగా అనిపించింది.

ఈతరాణిగా..

విమానాల్లో తిరగడం, నీటిపై లాంచీలో విహారం ఎన్నో దృశ్యాలు అద్భుతంగా ఉన్నాయి. ప్రకృతితో కలిసి ప్రజలు సాగిస్తున్న జీవితాలను చూశాను. ఒక ట్రిప్ నుండి మరొక ట్రిప్‌కు వెళ్లడంలో ఎన్నో భయాలు దూరమయ్యాయి. నా చిన్నతనం కేరళలో గడిచింది. మేమున్న ప్రాంతంలో 'ఈతరాణి' అనే పేరుండేది నాకు. కానీ, ఆ తర్వాత జీవనంలో అదీ మర్చిపోయాను. 50 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఇక్కడ ఈత కొడుతున్నాను. ఒకప్పుడు స్వేచ్ఛగా ఈదుతూ భవిష్యత్తు గురించి కొంచెం ఎక్కువ కలలు కనే అదే చిన్న అమ్మాయిగా ఇప్పుడు మారిపోయాను.

లొంగిపోవద్దు..

నాకు స్వతంత్రంగా ఉండే మహిళలంటే చాలా గౌరవం. వారి శక్తి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అయితే, ఈ సమయంలోనే ఎన్నో పోరాటాలు, గందరగోళాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పరిస్థితులు లేదా వ్యక్తులకు ఎప్పుడూ వంగి, ఆధిపత్యానికి లొంగిపోవద్దు. మీ మూలాలను అస్సలు మరచిపోవద్దు. ఆర్థిక స్వాతంత్ర్యం ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో సొంత నిర్ణయాలు తీసుకునే శక్తినిస్తుంది. ఇదే విషయం చెబుతూ నా ఇద్దరు పిల్లలను, ముగ్గురు మనవళ్లను పెంచాను. ఇప్పుడు వారి సాయంతో నా దశాబ్దాల కలను నెరవేర్చుకుంటున్నాను'' అని చెబుతుంది లలితాంబాల్. 84 ఏళ్ల వయసులో మహిళలు విస్తృతంగా ప్రయాణించడం చాలా అరుదు. కానీ, లలితాంబాల్ జీవన ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది.

లైఫ్@360

పర్యావరణంలో మీ పాత్ర?



పర్యావరణం బాగుంటే మనం బాగుంటాం. మనం బాగుండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత. అందుకోసం మీరు ఏమి చేస్తున్నారో మీకు మీరుగా ప్రశ్నలు వేసుకోండి. ఒకవేళ మీకు సరైన సమాధానం రాకపోతే ఈ కింద చెప్పుకున్న పనులు చేసేందుకు ప్రయత్నం చేయండి.

- ఈ పర్యావరణంలో జంతువులు, పక్షులు కూడా భాగమే కాబట్టి వాటి కోసం ఆవాసాలు, చెట్ల మీద గూళ్లు ఏర్పాటు చేయడం.
- జల, మృత్తికా కాలుష్యాలను అరికట్టేందుకు ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలని ప్రచారం చేయడం.
- పాతవస్తువుల పునర్వినియోగం గురించి పిల్లలకు తెలియజేయటం.
- వీధులు, పార్కులు, ఇతర ప్రదేశాల్లో వ్యర్థాలను తీసిపారేయటం.
- వీలైతే పర్యావరణ భద్రత గురించి పాటలు, నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, వీలైనన్ని మొక్కలను నాటటం, నాటించటం.
- భూమిని, సహజవనరులను కాపాడుకోవటం ఎంతో అవసరం కాబట్టి ప్రతిరోజూ పర్యావరణ దినోత్సవంగానే భావించడం, అలా భావించాల్సిందిగా మన చుట్టుపక్కల వారికి కూడా చెప్పడం.
- మన భూమి భవిష్యత్తు రేపటి పౌరులైన పిల్లల చేతిలో ఉంది కాబట్టి పర్యావరణాన్ని, సహజవనరులను కాపాడాల్సిన బాధ్యతను గురించి వారికి తెలియజేసేందుకు పాఠశాలల్లో వివిధ రకాల ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి.
- స్వచ్ఛత, కాలుష్యనివారణ, పర్యావరణం తదితర అంశాలకు సంబంధించి కృషి చేస్తున్నవారిని, వాటికోసం ఎంతగానో పాటుపడుతున్నవారిని సత్కరించడం వల్ల ఇతరులు సైతం స్ఫూర్తి పొందే అవకాశముంది.
- పర్యావరణ హితం కోసం మన చుట్టుపక్కల చేపడుతున్న, జరుగుతున్న కార్యక్రమాలను గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడం. వీటి గురించి మీ మీ చుట్టూ ఉన్నవారు తెలుసుకునేందుకు మీరే సమాచార సారథిగా మారడం. ఇతరులకు ప్రేరణ అందించడం.

పెళ్లి అయితే బరువు పెరుగుతారా?

పెళ్లి తర్వాత బరువు పెరుగుతుంటారు చాలా మంది. ఇది కేవలం మన దేశంలో మాత్రమే కనిపించేది కాదని, మానవ సమాజాల్లో ఎక్కడైనా పెళ్లి తర్వాత బరువు పెరగడం చాలా సాధారణమని నిపుణులు చెబుతున్నారు. అయితే పెళ్లి తర్వాత బరువు పెరగడం అనేది మగవాళ్లతో పోలిస్తే ఆడవాళ్లలో కొంచెం ఎక్కువ అని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దాదాపు 8000 మందిపై జరిపిన పరిశోధన ప్రకారం పెళ్లైన ఐదేళ్ల తర్వాత ఆడవాళ్లు సరాసరిన 11 కిలోలు బరువు పెరగగా, పెళ్లి కాని ఆడవారు ఐదేళ్లలో సరాసరిన 7 కిలోలు మాత్రమే బరువు పెరిగారు. ఇదే సమయంలో పెళ్లైన మగవారు దాదాపు 7–8 కిలోలు మేర బరువు పెరిగినట్లు తెలిసింది. పైగా పెళ్లైన జంటలో ఒకరు బరువు పెరిగితే మరొకరు బరువు పెరిగే అవకాశాలు 37 శాతం అధికమని తేలింది. ఇందుకు కారణం జంటలో ఒకరి అలవాట్లు మరొకరికి తొందరగా సోకడమే. అంటే ఒకరికి ఎక్కువ తినే అలవాటుంటే వారి భాగస్వామిలో కూడా తినే అలవాటు బాగా పెరుగుతుందన్నమాట. అలాగే పెళ్లి తర్వాత బంధువుల ఇళ్లలో విందులు, సొంతింట్లో కొసరి కొసరి తినిపించుకోవడాలు.. ఇలా తెలియకుండానే జంట బరువు పెరుగుతారు.

పెళ్లి కానంత వరకు శరీర సౌందర్యంపై శ్రద్ధ పెట్టిన వాళ్లు జంటగా మారిన తర్వాత ఇద్దరిలోనూ పెరిగే భద్రతా భావం కారణంగా శరీరంపై కొంతమేర అశ్రద్ధ వహించడం జరుగుతుంది, దీనితోపాటు పైన చెప్పినట్లు తినడం పెరగడం వల్ల కూడా క్రమంగా లావవుతారు.

ఈ ప్రక్రియను అడ్డుకోవాలంటే కలిసి తిన్నట్లే కలిసి ఎక్సర్‌సైజులు చేయడం ద్వారా శరీర బరువును అదుపులో ఉంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.



• హెల్త్ టిప్స్

- రెండు చెంచాల ధనియాలను మెత్తగా నూరి నాలుగు చుక్కల నీళ్లు కలిపి ఆ పేస్టును కణతలకు పట్టిస్తే తలనొప్పి, మైగ్రేన్ తగ్గుతాయి. లవంగ తైలంతో నుదురును మర్దనా చేస్తే తలనొప్పి వెంటనే తగ్గుతుంది. లవంగ నూనె కొద్దిగా మంటగా ఉంటుంది కాబట్టి వైట్ పెట్రోలియం జెల్లీలో కలిపి నుదుటి మీద రాయాలి. దాల్చిన చెక్కను నూరి గంధపు పట్టీలా నుదుటికి పూసుకున్నా కూడా మంచి ఫలితం ఉంటుంది.
- కప్పు నిమ్మరసాన్ని ఒక వెడల్పాటి ప్లేటులో వేసి దానిలో నాలుగు కప్పుల పంచదార వేసి ప్లేటంతా పరిచి ఎనిమిది గంటలపాటు ఫ్యాన్ కింద ఆరనివ్వాలి. పంచదార ఆరాక అందులో కొద్దిగా ఉప్పువేసి మిక్సీజార్‌లో వేసి పొడి చేసి, గాజు సీసాలో వేసి నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ ఉంచుకున్న దానిని కావాలనుకున్నప్పుడల్లా టేబుల్ స్పూన్ పొడిని గ్లాసునీళ్లలో కలిపితే క్షణాల్లో నిమ్మషర్బత్ తయారవుతుంది. నేరుగా కాకపోయినా, సోడా, ఇతర రకాల జ్యూస్‌లలో కలిపి తాగినా రుచిగా ఉంటుంది. సి విటమిన్ సమృద్ధిగా లభిస్తుంది.
- పొట్టను కరిగించే పానీయం ... స్పూను వాము, స్పూను సోంపు, మరోస్పూను జీలకర్రను తీసుకుని మిక్సీలో మెత్తని పొడిలా చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నె తీసుకుని దానిలో రెండు గ్లాసుల నీళ్లలో రెడీ చేసి పెట్టుకున్న పొడి రెండు స్పూన్లు వేసి ఐదునిమిషాలపాటు సన్నని మంటపై మరిగించాలి. తరువాత చల్లారనిచ్చి వడగట్టాలి. రోజూ ఉదయం ఈ నీళ్లు తాగాలి. క్రమం తప్పకుండా ఈ డ్రింక్ తాగడం వల్ల పొట్టతోపాటు, కొవ్వు, అధిక బరువు తగ్గుతుంది.





పాక్‌తో మ్యాచ్‌కు స్మృతి మంధాన సందేహం

దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న మహిళల టి20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్తాన్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన బరిలోకి దిగడం సందేహంగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్ సందర్భంగా స్మృతి చేతి వేలికి గాయమైంది. ఈ గాయం నుంచి ఆమె కోలుకోకపోవడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో ప్రాక్టీస్ మ్యాచ్‌లో స్మృతి ఆడలేదు. మరోవైపు భుజం నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా తొలి మ్యాచ్‌లో ఆడేది లేనిది ఆదివారం తెలుస్తుంది.

యూపీ వారియర్జ్ కోచ్‌గా జాన్ లూయిస్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో క్యాప్రి గ్లోబల్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసిన ఉత్తరప్రదేశ్ (యూపీ) ఫ్రాంచైజీ జట్టుకు యూపీ వారియర్జ్ అని పేరు పెట్టారు. ఈ జట్టుకు ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, ప్రస్తుత ఇంగ్లండ్ మహిళల జట్టు హెడ్ కోచ్‌గా పనిచేస్తున్న జాన్ లూయిస్‌ను హెడ్ కోచ్‌గా నియమించారు. భారత మాజీ క్రికెటర్ అంజూ జైన్ అసిస్టెంట్ కోచ్‌గా, యాష్లే నోఫ్కీ (ఆస్ట్రేలియా) బౌలింగ్ కోచ్‌గా, లీసా స్థాలేకర్ (ఆస్ట్రేలియా) మెంటార్‌గా వ్యవహరిస్తారు.





రోహిత్ సెంచరీ అభివాదం

మనదే ఆధిపత్యం

రోహిత్ శర్మ శతకం
జడేజా, అక్షర్ అర్ధ సెంచరీలు
భారత్ 321/7
144 పరుగుల ఆధిక్యంలో టీమిండియా

తొలి రోజు బంతి సుడులు తిరిగితే... రెండో రోజు బ్యాట్లు పరుగందుకున్నాయి. దీంతో మొదటి టెస్టులో రెండో రోజే భారత్ సంపూర్ణ ఆధిపత్యం సాధించింది. భారీస్కోరు దిశగా పయనిస్తోన్న టీమిండియా మూడో రోజు టెస్టును తమ చేతుల్లోకి తీసుకోవాలనే పట్టుదలను కనబరుస్తోంది. 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ క్లాసిక్ సెంచరీ, ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌ల అర్ధసెంచరీలు రెండో రోజు ఆటకు హైలైట్‌గా నిలిచాయి.

నాగ్‌పూర్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ భారత్ ఆధిపత్యంతో మొదలైంది. తొలి టెస్టులో రెండో రోజే రోహిత్ శర్మ బృందం పైచేయి సాధించింది. శుభారంభానికి సరిపడా ఆధిక్యంపై కన్నేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (212 బంతుల్లో 120; 15 ఫోర్లు, 2 సిక్స్‌) తన కెరీర్‌లో తొమ్మిదో టెస్ట్ సెంచరీతో కదంతొక్కగా, మిగతా ప్రధాన బ్యాటర్స్ విఫలమయ్యారు. అయితే స్పిన్–ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా (170 బంతుల్లో 66 బ్యాటింగ్; 9 ఫోర్లు), అక్షర్ పటేల్ (102 బంతుల్లో 52 బ్యాటింగ్; 8 ఫోర్లు) బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌తో జట్టును పటిష్టస్థితిలో నిలబెట్టారు. దీంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 114 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 321 పరుగులు చేసింది. భారత గడ్డపై అరంగేట్రం చేసిన ఆసీస్ ఆఫ్‌స్పిన్నర్ టాడ్ మర్ఫీ 5 వికెట్లు తీశాడు. ప్రస్తుతం టీమిండియా 144 పరుగుల ఆధిక్యంలో ఉంది. చేతిలో మూడు వికెట్లున్నాయి.

నడిపించిన కెప్టెన్

ఓవర్‌నైట్ స్కోరు 77/1తో రెండో రోజు ఆట ఆరంభించిన భారత్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ నడిపించాడు. 'నైట్ వాచ్‌మన్' బ్యాటర్ అశ్విన్ (62 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. రెండో వికెట్ భాగస్వామ్యం బలపడుతున్న తరుణంలో కొత్త స్పిన్నర్ మర్ఫీ మాయాజాలం జట్టును ఇబ్బంది పెట్టింది. అశ్విన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న మర్ఫీ... స్వల్ప వ్యవధిలో వెటరన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా (14 బంతుల్లో 7; 1 ఫోర్)ను కూడా బోల్తా కొట్టించాడు. దీంతో రోహిత్‌కు కోహ్లి జతయ్యాడు. జట్టు స్కోరు 151/3 వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.

రోహిత్ సెంచరీ

రెండో సెషన్ మాత్రం కష్టాలతో మొదలైంది. స్పిన్‌కు కలిసొచ్చిన పిచ్‌పై మర్ఫీ తొలి బంతికే కోహ్లి (26 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఆట ముగించాడు. లెగ్‌స్టంప్‌కు ఆవల వేసిన బంతిని కోహ్లి ఫ్లిక్ చేయాలనుకున్నాడు. కానీ అదికాస్తా బ్యాట్ అంచును తాకుతూ కీపర్ క్యారీ చేతికి చిక్కింది. 151 స్కోరు వద్ద నాలుగో వికెట్ పడగా... ఈ 4 వికెట్లు మర్ఫీనే పడగొట్టాడు. క్రీజులో పాతుకొనిపోయిన రోహిత్ 171 బంతుల్లో (14 ఫోర్లు, 2 సిక్స్‌లు) టెస్టుల్లో తొమ్మిదో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ తొలి టెస్టు ఆడుతున్న మెరుపుల బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 8; 1 ఫోర్) నిరాశపరిచాడు. లయన్ బంతికి క్లీన్‌బౌల్డయ్యాడు. తర్వాత జడేజా అండతో భారత స్కోరును 200 పరుగులు దాటించాడు. రోహిత్, జడేజా జోడీ ముందు ఆసీస్ స్పిన్ పనిచేయలేదు. మర్ఫీ, లయన్ అలసిపోయారే తప్ప జోడీని మాత్రం విడగొట్టలేకపోయారు. 226/5 స్కోరు వద్ద రెండో సెషన్ ముగిసింది.

జడేజా, అక్షర్... ఫిఫ్టీ–ఫిఫ్టీ

స్పిన్ వల్ల కాకపోవడంతో కంగారూ సారథి కమిన్స్ రంగంలోకి దిగాడు. మూడో సెషన్ ఆరంభంలో భారత ఇన్నింగ్స్‌కు వెన్నెముకగా నిలిచిన రోహిత్‌ను బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి చుక్కెదురైంది. ఆంధ్రప్రదేశ్ బ్యాటర్ శ్రీకర్ భరత్ (10 బంతుల్లో 8; 1 ఫోర్)కు నిరూపించుకునేకుందేకు చక్కని అవకాశం వచ్చినా... మర్ఫీ స్పిన్ ఉచ్చులో పడి తొందరగానే నిష్క్రమించాడు. 240 పరుగుల వద్ద ఏడో వికెట్ కూలింది. ఈ దశలో జడేజాకు అక్షర్ పటేల్ జతయ్యాడు. క్రీజులో ఉన్న ఇద్దరు స్పిన్నర్లే కావడంతో అవతలి వైపు స్పిన్ ఉచ్చు తేలిపోయింది. ఆఖరి సెషన్‌లో ఇద్దరు చక్కని సమన్వయంతో పరుగులు జత చేయడంతో ఆలౌట్ కావాల్సిన జట్టు 300 పైచిలుకు పరుగుల్ని అవలీలగా చేసింది. చూడచక్కని బౌండరీలతో స్కోరును పెంచారు. ఈ క్రమంలో మొదట జడేజా 114 బంతుల్లో (7 ఫోర్లు), సెషన్ ముగిసేదశలో అక్షర్ 94 బంతుల్లో (8 ఫోర్లు) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అబేధ్యమైన ఎనిమిదో వికెట్‌కు ఇద్దరు కలిసి 81 పరుగులు జోడించారు. మూడో రోజు ఈ జంట కుదురుకుంటే భారత్ భారీస్కోరే కాదు... భారీ ఆధిక్యమే సంపాదిస్తుంది. అప్పుడు టర్నింగ్ వికెట్‌పై భారత స్పిన్నర్లు తిప్పేయడం సులువవుతుంది.





మర్ఫీ

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 177; **భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బి) కమిన్స్ 120; కేఎల్ రాహుల్ (సి అండ్ బి) మర్ఫీ 20; అశ్విన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 23; పుజారా (సి) బోలండ్ (బి) మర్ఫీ 7; కోహ్లి (సి) క్యారీ (బి) మర్ఫీ 12; సూర్యకుమార్ (బి) లయన్ 8; రవీంద్ర జడేజా (బ్యాటింగ్) 66; శ్రీకర్ భరత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 8; అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 52; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (114 ఓవర్లలో 7 వికెట్లకు) 321. వికెట్ల పతనం:** 1–76, 2–118, 3–135, 4–151, 5–168, 6–229, 7–240. **బౌలింగ్:** కమిన్స్ 18–2–74–1, బోలండ్ 17–4–34–0, లయన్ 37–10–98–1, మర్ఫీ 36–9–82–5, లబుషేన్ 5–0–24–0, రెన్‌షా 1–0–7–0.

1 భారత్ నుంచి టెస్టు, వన్డే, టి20 ఫార్మాట్‌లలో సెంచరీలు చేసిన తొలి కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఘనత సాధించాడు. కెప్టెన్ హోదాలో రోహిత్ వన్డేల్లో మూడు, టి20ల్లో రెండు సెంచరీలు చేశాడు. టెస్టుల్లో సారథిగా అతనికిదే తొలి శతకం. అంతర్జాతీయ క్రికెట్‌లో తిలకరత్నే దిల్షాన్ (శ్రీలంక), డు ప్లెసిస్ (దక్షిణాఫ్రికా), బాబర్ ఆజమ్ (పాకిస్తాన్) కెప్టెన్ హోదాలో మూడు ఫార్మాట్‌లలో సెంచరీలు సాధించారు.

6 భారత గడ్డపై తమ అరంగేట్రం టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన ఆరో బౌలర్‌గా టాడ్ మర్ఫీ (5/66) గుర్తింపు పొందాడు. గతంలో బ్రూస్ టేలర్ (న్యూజిలాండ్), జాన్ లేవర్ (ఇంగ్లండ్), లాన్స్ క్లూసెనర్ (దక్షిణాఫ్రికా), జేసన్ క్రేజా (ఆస్ట్రేలియా), యాసిర్ అరాఫత్ (పాకిస్తాన్) ఈ ఘనత సాధించారు.

6 టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీయడంతోపాటు అర్ధ సెంచరీ సాధించడం రవీంద్ర జడేజా కెరీర్‌లో ఇది ఆరోసారి. అశ్విన్ కూడా ఆరుసార్లు ఈ ఘనత సాధించాడు. ఇయాన్ బోథమ్ (ఇంగ్లండ్: 11 సార్లు), షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్: 10 సార్లు), రిచర్డ్ హ్యాడ్లీ (న్యూజిలాండ్: 6 సార్లు) కూడా ఈ జాబితాలో ఉన్నారు.

రేసింగ్ @ హైదరాబాద్

నేడు నగరంలో ఫార్ములా 'ఇ' ప్రధాన పోరు

ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు సన్నాహాలు పూర్తి • మధ్యాహ్నం 3 గంటల నుంచి రేసు

స్టార్ స్పోర్ట్స్ సెలక్ట్–2 చానల్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



సాక్షి, హైదరాబాద్: కౌంట్‌డౌన్ పూర్తయింది... ఇక హైదరాబాద్ స్ట్రీట్‌పై జనరేషన్–3 కార్లు జోరుగా దూసుకుపోవడమే మిగిలింది. భాగ్యనగర రేసింగ్ అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫార్ములా 'ఇ' సమరానికి సమయం వచ్చేసింది. హుస్సేన్ సాగర్ తీరంలో ప్రత్యేకంగా సిద్ధమైన స్ట్రీట్ సర్క్యూట్‌లో కార్లు జూమ్మంటూ దూసుకుపోతుంటే ఆ వినోదాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ సిద్ధమయ్యారు. మొత్తం 11 జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు ఈ 'ఇ' ప్రి పోరులో సత్తా చాటబోతున్నారు. శుక్రవారమే తొలి ఫ్రీ ప్రాక్టీస్ పూర్తి కాగా, డ్రైవర్లు శనివారం ఉదయం రెండో ఫ్రీ ప్రాక్టీస్‌లో కూడా పాల్గొంటారు. ఆ తర్వాత క్వాలిఫయింగ్ ఈవెంట్ అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రధాన రేస్ జరుగుతుంది.

ఆధిక్యంలో ఆండ్రెటీ...

ఫార్ములా 'ఇ'లో ప్రస్తుతం 9వ సీజన్ నడుస్తోంది. ఇందులో ఇప్పటికే మూడు రేస్‌లు పూర్తయ్యాయి. మెక్సికో సిటీ మొదటి రేస్‌కు ఆతిథ్యం ఇవ్వగా, సౌదీ అరేబియాలోని దిరియాలో తర్వాతి రెండు రేస్‌లు జరిగాయి. హైదరాబాద్‌లో జరగబోతోంది ఈ సీజన్‌లో నాలుగో రేస్. ప్రస్తుతం మూడు రేస్‌ల తర్వాత మొత్తం 76 పాయింట్లతో ఆండ్రెటీ టీమ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, పోర్షే (74) రెండో స్థానంలో ఉంది.

మహీంద్రా సాధించేనా...



ఫార్ములా 'ఇ' ప్రారంభమైన 2014 సీజన్ నుంచి భారత్‌కు చెందిన మహీంద్రా రేసింగ్ టీమ్ బరిలో ఉంది. ఓవరాల్‌గా ఇన్నేళ్లలో 5 రేస్‌లు గెలిచిన ఆ జట్టు డ్రైవర్లు 24 సార్లు పోడియం (టాప్–3)పై నిలబడటంలో సఫలమయ్యారు. 2016–17 సీజన్‌లో టీమ్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా మూడో స్థానంలో నిలిచిన టీమ్... తొలిసారి స్వదేశంలో పోటీకి సిద్ధమైంది. మహీంద్ర టీమ్‌లో బ్రిటన్‌కు చెందిన ఒలివర్ రోలండ్, బ్రెజిల్‌కు చెందిన ల్యూకాస్ గ్రాసి డ్రైవర్లుగా వ్యవహరిస్తుండగా... భారత యువ రేసర్ జెహాన్ దారువాలా రిజర్వ్ డ్రైవర్‌గా ఉన్నాడు. గత సీజన్‌లో టీమ్ ఎనిమిదో స్థానానికే పరిమితమైంది. తాజా సీజన్‌లో మెక్సికో సిటీలో జరిగిన తొలి రేస్‌లో గ్రాసీ మూడో స్థానం సాధించడంతో 18 పాయింట్లు టీమ్ ఖాతాలో చేరాయి. దాంతో పట్టికలో మహీంద్రా ప్రస్తుతం ఆరో స్థానంలో కొనసాగుతోంది. హైదరాబాద్‌లో ఆ జట్టు ఎలాంటి ప్రదర్శన ఇస్తుందనేది ఆసక్తికరం.

షాంపేన్ కాదు..రంగు కాగితాలే...

రేసింగ్ సర్క్యూట్‌లో ఫలితం వచ్చిన తర్వాత విజేతలు షాంపేన్ బాటిల్‌తో సంబరాలు చేసుకోవడం సహజం. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని వేదికల్లోనూ ఇది కనిపిస్తుంది. అయితే స్థానిక సంప్రదాయాలను గౌరవిస్తూ ఆయా దేశాల్లో షాంపేన్‌ను దూరంగా ఉంచాలని ఇటీవల నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. సౌదీ అరేబియాలో తొలిసారి తాజా సీజన్‌లో ఎఫ్–1 జరిగినప్పుడు, గత ఏడాది ఇండోనేసియా ఫార్ములా 'ఇ' జరిగినప్పుడు కూడా రంగు రంగుల కాగితాలు వెదజల్లడంతోనే వేడుకలు జరుపుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు దీనినే హైదరాబాద్‌లోనూ అనుసరించబోతున్నారు. ఇక్కడా షాంపేన్‌తో సంబరాలు లేకుండా మెషీన్ల ద్వారా రంగురంగుల కాగితాలను వెదజల్లుతారు.

ప్రాక్టీస్‌లో ప్రమాదం...



శుక్రవారం తొలి ఫ్రీ ప్రాక్టీస్ సందర్భంగా సర్క్యూట్‌పై అనుకోని ఘటన చోటు చేసుకుంది. ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో 'పోర్షే' జట్టు డ్రైవర్ పాస్కల్ వెర్లీన్ కారు అదుపు తప్పింది. 18వ మలుపు వద్ద ఎడమవైపు గోడను ఢీకొని కారు నిలిచిపోయింది. అయితే అదృష్టవశాత్తూ పాస్కల్ ఎలాంటి ప్రమాదం లేకుండా క్షేమంగా బయటపడ్డాడు. ప్రస్తుతం పాయింట్లలో అతను అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ట్రాక్‌పై తమకు ఎలాంటి ఫిర్యాదులు లేవని, స్ట్రీట్ సర్క్యూట్ ఇలా కాస్త ఎక్కువ దుమ్ముతో ఉండటం సహజమేనని నిర్వాహకులు వెల్లడించారు. మరోవైపు ట్రాక్‌పైకి అనూహ్యంగా పబ్లిక్ వాహనాలు దూసుకురావడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ట్రాఫిక్‌ను నిలువరిస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని దాటి ఒక బైకర్ ముందుకు వెళ్లడం, మిగతా వారంతా అతడిని అనుసరించినట్లుగా తెలిసింది. వెంటనే అప్రమత్తమైన నిర్వాహక బృందం పరిస్థితిని చక్కదిద్దింది. దాంతో ప్రాక్టీస్ రేస్ అర గంట ఆలస్యంగా ప్రారంభమైంది.



కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ వేగంగా కోలుకుంటున్నాడు. రూర్కీలోని తన స్వగృహంలో పంత్ క్రచెస్ సాయంతో అడుగులు వేస్తున్న ఫొటో అతని అభిమానులకు పెద్ద ఊరటనివ్వనుంది. సోషల్ సైట్‌లో ఈ ఫొటోను పంచుకున్న పంత్ 'ఇక బలంగా... మెరుగ్గా... ఈ ముందడుగు' అని రాసుకున్నాడు.

సౌరాష్ట్ర దీటైన జవాబు

- షెల్డన్ జాక్సన్, అర్పిత్ సెంచరీలు
- కర్ణాటకతో రంజీ సెమీఫైనల్

బెంగళూరు: కెప్టెన్ అర్పిత్ వాసవద (219 బంతుల్లో 112 బ్యాటింగ్; 15 ఫోర్లు), షెల్డన్ జాక్సన్ (245 బంతుల్లో 160; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలు సాధించడంతో... కర్ణాటక జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మాజీ చాంపియన్ సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించేందుకు మరో 44 పరుగుల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 76/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 112 ఓవర్లలో 4 వికెట్లకు 354 పరుగులు సాధించింది. షెల్డన్ జాక్సన్, అర్పిత్ నాలుగో వికెట్‌కు 232 పరుగులు జోడించి సౌరాష్ట్ర జట్టును ఆదుకున్నారు. ప్రస్తుతం అర్పిత్, చిరాగ్ జానీ (19 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. కర్ణాటక బౌలర్లలో విద్వత్ కవేరప్ప రెండు వికెట్లు తీయగా, వాసుకి కౌశిక్, కృష్ణప్ప గౌతమ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

బెంగాల్‌కు భారీ ఆధిక్యం

ఇండోర్‌లో డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మరో సెమీఫైనల్లో బెంగాల్‌కు భారీ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 56/2తో మూడో రోజు ఆట కొనసాగించిన మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. బెంగాల్ బౌలర్ ఆకాశ్‌దీప్ (5/42) మధ్యప్రదేశ్‌ను దెబ్బ కొట్టాడు. బెంగాల్‌కు 268 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా కెప్టెన్ మనోజ్ తివారి మధ్యప్రదేశ్‌కు ఫాలోఆన్ ఇవ్వకుండా రెండో ఇన్నింగ్స్ ఆడాలని నిర్ణయం తీసుకున్నాడు. బెంగాల్ రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు కోల్పోయి 59 పరుగులు సాధించింది. ప్రస్తుతం బెంగాల్ ఓవరాల్ ఆధిక్యం 327 పరుగులకు చేరుకుంది.



అర్పిత్, షెల్డన్ జాక్సన్

ముంబై మెరిసె...

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ముంబై మెటియోస్ జట్టు తొలి విజయం సాధించింది. చెన్నై బ్లిట్జ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై మెటియోస్ 5–0తో (15–14, 15–6, 15–11, 15–12, 15–9) జయభేరి మోగించింది. ఈ సీజన్‌లో ఓ జట్టు ప్రత్యర్థిని 5–0తో ఓడించడం ఇదే తొలిసారి. ముంబై తరఫున జేమ్స్ అనూ 14 పాయింట్లు, హర్‌దీప్ సింగ్ 12 పాయింట్లు, బ్రాండన్ గ్రీన్‌వే తొమ్మిది పాయింట్లు స్కోరు చేశారు. చెన్నై బ్లిట్జ్ తరఫున జోబిన్ వర్గీస్ 11 పాయింట్లతో రాణించాడు. నేడు జరిగే మ్యాచ్‌లో కాలికట్ హీరోస్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తలపడుతుంది.





ఒడిశా ఎఫ్‌సీ చేతిలో హైదరాబాద్‌కు షాక్

భువనేశ్వర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు మూడో పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒడిశా ఎఫ్‌సీ 3–1 గోల్స్‌తో హైదరాబాద్‌ను బోల్తా కొట్టించింది. ఒడిశా తరఫున ఇసాక్ (33వ ని.లో), డీగో మౌరిసియో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... హైదరాబాద్ ప్లేయర్ నిమ్ డోర్జీ తమాంగ్ 72వ నిమిషంలో 'సెల్ఫ్ గోల్' చేశాడు. హైదరాబాద్ నుంచి ఏకైక గోల్‌ను నిమ్ డోర్జీ (45వ ని.లో) సాధించాడు. 17 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ 11 విజయాలు, 3 'డ్రా'లు, 3 ఓటములతో 36 పాయింట్లు సాధించి రెండో స్థానంలో ఉంది.

షాట్‌పుట్‌లో తజీందర్ పాల్‌కు స్వర్ణం

అస్తానా (కజకిస్తాన్): ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజే భారత్ నాలుగు పతకాలతో అదరగొట్టింది. పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్ పాల్ సింగ్ తూర్ పసిడి పతకం గెలిచాడు. తజీందర్ ఇనుప గుండును 19.49 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. కరణ్‌వీర్ సింగ్ 19.37 మీటర్లతో రెండో స్థానంలో నిలిచి భారత్‌కు రజతం అందించాడు. ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రావెల్ 16.98 మీటర్ల దూరం గెంతి జాతీయ ఇండోర్ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం సాధించాడు. మహిళల పెంటాథ్లాన్‌లో స్వప్నా బర్మాన్ 4119 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకుంది.



సెమీస్‌లో సాకేత్–యూకీ జోడీ

డాలస్ (అమెరికా): కొత్త ఏడాదిలో కూడా నిలకడగా రాణిస్తున్న సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ డాలస్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్–యూకీ ద్వయం 2–6, 6–3, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ జూలియన్ క్యాష్–హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జోడీపై సంచలన విజయం సాధించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్–యూకీ రెండు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. సెమీఫైనల్లో నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా)లతో సాకేత్–యూకీ తలపడతారు.



ఆసియా జూనియర్ స్క్వాష్ సెమీస్‌లో భారత్

చెన్నై: ఆసియా జూనియర్ టీమ్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఆఖరి లీగ్‌లో రెండో సీడ్ పురుషుల జట్టు 2–1తో మలేసియాపై గెలిచింది. కృష్ణ మిశ్రా 9–11, 11–7, 5–11, 4–11తో హరిత్ డానియల్ బిన్ జెఫ్రి చేతిలో ఓడగా, శౌర్య బవా 11–8, 11–8, 11–9తో షామిల్ హ్యాజద్ బిన్‌పై, పార్థ్ అంబాని 9–11, 12–10, 11–7, 3–11, 11–4తో లో వా సెర్న్‌పై గెలుపొందారు. సెమీస్‌లో భారత పురుషుల జట్టు కొరియాతో తలపడుతుంది. మహిళల జట్టు 3–0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. అనాహత్ సింగ్ 11–1, 11–1, 11–2తో లీ జి ఫాంగ్‌పై, యువన గుప్తా 9–11, 9–11, 13–11, 11–6, 11–3తో ఒంగ్ జె సిమ్‌పై, పూజ ఆర్తి 11–7, 9–11, 11–4, 11–6తో అయు యింగ్ వే లిన్‌పై గెలిచారు. నేడు జరిగే సెమీఫైనల్లో అమ్మాయిల జట్టు మలేసియాను ఢీకొంటుంది.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	124	37
	60,683	17,856

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,664	▽ 126
డోజోన్స్	33,761	△ 61
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,882	▽ 29
డాక్స్	15,308	▽ 215
షాంఘై	3,260	▽ 10
నికాయ్	27,671	△ 87

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	ధర	మార్పు
బంగారం (24 క్యారట్)	57,038	▽ 559
బంగారం (22 క్యారట్)	56,810	▽ 556
వెండి (కిలో)	66,740	△ 473

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.67	84.35
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.60	90.50
€	యూరో	ఒకటి	97.57	102.35
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	50.00	76.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.74	59.55
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.83	64.37
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.00	22.68
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.56	23.36
¥	చైనా యువాన్	ఒకటికి	10.99	13.07

బిజినెస్ రీల్

పీఎన్‌బీ, బీఓబీ రుణాలు భారం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లు తమ రుణ రేట్లను పావుశాతం వరకూ పెంచాయి. ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు– రెపో (6.5 శాతానికి) పావుశాతం పెంచడం దీనికి నేపథ్యం.

పీఎన్‌బీ పావుశాతం పెంపు

పీఎన్‌బీ రెగ్యులేటరీ ఫైలింగ్ వివరాల ప్రకారం రెపో అనుసంధాన రుణ రేటు (ఆర్‌ఎల్‌ఎల్ఆర్) పావుశాతం పెరిగి 8.75 శాతం నుంచి 8 శాతానికి చేరింది. గురువారం నుంచీ ఇది అమల్లోకి వచ్చింది.

బీఓబీ... 5 బేసిస్ పాయింట్లు

ఎంసీఎల్‌ఆర్‌ను అన్ని కాలపరిమితులపై 5 బేసిస్ పాయింట్లు పెంచింది. ఫిబ్రవరి 12 నుంచి ఈ రేటు అమల్లోకి వస్తుందని బీఓబీ పేర్కొంది. దీనితో ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 7.85% నుంచి 7.90 శాతానికి చేరింది. నెలకు సంబంధించి ఈ రేటు 8.15 శాతం నుంచి 8.20 శాతానికి ఎగసింది. 3 నెలల రేటు 8.25 శాతం నుంచి 8.30 శాతానికి చేరగా, ఏడాది రేటు 8.5% నుంచి 8.55 శాతానికి ఎగసింది.

కెనరా బ్యాంక్ వడ్డీ రేటు కట్

ఆర్‌బీఐ రెపో రేటును పెంచినప్పటికీ కెనరా బ్యాంక్ రుణాలపై వడ్డీ రేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్‌ను ఈ నెల 12 నుంచి అమల్లోకి వచ్చేవిధంగా సవరించింది. వెరసి తాజాగా ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ రేటు 9.4% నుంచి 9.25 శాతానికి తగ్గింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	448-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	66.00
10-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	390-00
వరంగల్	392-00
రిటైల్ ధర	4.50

తగ్గిన పారిశ్రామిక వృద్ధి స్పీడ్

2022 డిసెంబర్‌లో ఐఐపీ పెరుగుదల 4.3 శాతం • నవంబర్‌లో పురోగతి 7.3 శాతం • తయారీ పేలవ పనితీరు



న్యూఢిల్లీ: పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 2022 డిసెంబర్‌లో మందగించింది. సమీక్షా నెల్లో ఇందుకు సంబంధించిన సూచీ (ఐఐపీ) వృద్ధి రేటు 4.3 శాతంగా నమోదయ్యింది. నవంబర్‌లో ఈ రేటు 7.3 శాతం. మొత్తం సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ రంగం, భారీ యంత్ర పరికరాల ఉత్పత్తులు, డిమాండ్‌కు ప్రాతిపదిక అయిన క్యాపిటల్ గూడ్స్ రంగాల పేలవ పనితీరు డిసెంబర్ గణాంకాలపై పడినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెలువరించిన లెక్కలు పేర్కొంటున్నాయి. ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్ల రంగం ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ డ్యూరబుల్స్ విభాగం కూడా వృద్ధి (5.1 శాతం) నుంచి క్షీణతకు (–10.4 శాతం) మారింది. సబ్బులు, షాంపూల వంటి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులకు సంబంధించిన కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్ రంగంలో వృద్ధి రేటు తగ్గింది. వార్షికంగా పరిశీలిస్తే మాత్రం 2021 డిసెంబర్‌కన్నా 2022 డిసెంబర్‌లో పనితీరు మెరుగ్గా ఉండడం ఊరటనిస్తున్న అంశం. అప్పట్లో ఐఐపీ వృద్ధి రేటు కేవలం 1 శాతం మాత్రమే.

రంగాల వారీగా ఉత్పత్తి వృద్ధి (శాతాల్లో)

విభాగం	2022 డిసెంబర్	2022 నవంబర్	2021 డిసెంబర్
తయారీ	2.6	6.4	0.6
మైనింగ్	9.8	9.7	2.6
విద్యుత్	10.4	12.7	2.8
క్యాపిటల్ గూడ్స్	7.6	20.7	-3
కన్జూమర్ డ్యూరబుల్స్	-10.4	5.1	-1.9
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	7.2	8.9	0.3
ఇన్‌ఫ్రా/నిర్మాణం	8.2	12.8	2
ప్రైమరీ గూడ్స్	8.3	4.7	2.8
ఇంటర్మీడియట్ గూడ్స్	-0.3	3	-1

9 నెలల్లో ఇలా...



మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో (ఏప్రిల్-డిసెంబర్) ఐఐపీ 5.4 శాతం పురోగమించగా, 2021 ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 15.3 శాతంగా ఉంది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ నాటికి ఈ వృద్ధి రేటు 5.5 శాతం

5జీ స్మార్ట్‌ఫోన్లదే హవా

- 74 శాతం పెరిగిన విక్రయాలు
- ఈ ఏడాదీ అమ్మకాల జోరు
- సైబర్ మీడియా రీసెర్చ్ నివేదిక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశంలో 5జీ స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు జోరందుకున్నాయి. 2021తో పోలిస్తే గతేడాది 5జీ మోడళ్ల అమ్మకాలు 74 శాతం అధికం అయ్యాయి. కస్టమర్ల చేతుల్లోకి వెళ్లిన ఈ 5జీ స్మార్ట్‌ఫోన్ల విలువ సుమారు రూ.1.65 లక్షల కోట్లు ఉంటుందని సైబర్ మీడియా రీసెర్చ్ (సీఎంఆర్) తన నివేదికలో వెల్లడించింది. కఠినమైన మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో 2022లో మొత్తం మొబైల్స్ సేల్స్ 17 శాతం, స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 8 శాతం తగ్గడం గమనార్హం. అంత క్రితం ఏడాదితో పోలిస్తే 2022 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ 28 శాతం క్షీణించింది. 2023లో స్మార్ట్‌ఫోన్ల పరిశ్రమ చక్కటి వృద్ధి తీరుతో 16–16.5 కోట్ల యూనిట్లు ఉండే వీలుంది.

ప్రీమియం వైపునకు మార్కెట్..

మరోవైపు రూ.1 లక్ష ఆపైన ఖరీదు చేసే అల్ట్రా ప్రీమియం విభాగం ఏకంగా 95 శాతం దూసుకెళ్లిందని సీఎంఆర్ వెల్లడించింది. రూ.7 వేల లోపు ధర ఉండే మొబైల్స్ సేల్స్ గతేడాది 55 శాతం తగ్గాయి. సరఫరా సమస్యలు, ఆర్థిక సవాళ్లు ఇందుకు కారణం. రూ.7–25 వేల ధరల శ్రేణిలో విక్రయాలు 8 శాతం క్షీణించాయి. రూ.25,000 నుంచి రూ.50,000 మధ్య ఉండే ప్రీమియం మోడళ్ల అమ్మకాలు 12 శాతం, రూ.50,000 నుంచి రూ.1 వరకు ఉండే సూపర్ ప్రీమియం 41 శాతం దూసుకెళ్లాయి. స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో యాపిల్ వాటా 4 శాతం. గతేడాది ఈ సంస్థ 17 శాతం వృద్ధి నమోదు చేసింది. యాపిల్ విక్రయాల్లో రూ.50,000–1,00,000 ధరల శ్రేణి మోడళ్ల వాటా 79 శాతం ఉంది.

మెటల్, ఇంధన షేర్లు డీలా

- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- 17,900 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 124 పాయింట్లు

ముంబై: మెటల్, ఇంధన, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. క్రూడాయిల్ రికవరీ, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. అదానీ గ్రూప్‌లోని నాలుగు కంపెనీలపై మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇంటర్‌నేషనల్(ఎంఎస్‌సీఐ) వెయిటేజీ తగ్గింపు, ఫిన్‌టెక్ సంస్థ పేటీఎంలో ఈ–కామర్స్ దిగ్గజం అలీబాబా పూర్తిగా వాటా విక్రయం అంశాలూ ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఉదయం స్వల్ప నష్టాలతో ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి.



ట్రేడింగ్‌లో 272 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 124 పాయింట్లు పతనమై 60,683 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు నష్టపోయి 17,856 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 17,781 వద్ద కనిష్టాన్ని, 17,877 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. రియల్టీ, వినిమయ, మౌలిక రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,458 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.291 కోట్లను విక్రయించారు. ఎంఎస్‌సీఐ వెయిటేజ్ తగ్గింపుతో అదానీ గ్రూప్ కంపెనీలపై ప్రతికూల ప్రభావం చూపింది. డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు పైసలు బలపడి 82.51 స్థాయి వద్ద స్థిరపడింది.

పేటీఎమ్‌లో అలీబాబా వాటా విక్రయం

విలువ రూ. 1,360 కోట్లు

న్యూఢిల్లీ: డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసుల దిగ్గజం వన్‌97 కమ్యూనికేషన్స్‌లో మిగిలిన ప్రత్యక్ష వాటాను సైతం చైనీస్ కంపెనీ అలీబాబా తాజాగా విక్రయించింది. పేటీఎమ్ బ్రాండుతో సర్వీసులందించే వన్‌97లో బ్లాక్‌డీల్ ద్వారా 3.16 శాతం వాటాను అమ్మివేసినట్లు తెలుస్తోంది. డీల్ విలువ రూ. 1,360 కోట్లుగా సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో అలీబాబాకు పేటీఎమ్‌లో ప్రత్యక్షంగా ఎలాంటి వాటా మిగల్లేదని తెలియజేశాయి. 2022 డిసెంబర్‌కల్లా 6.26 శాతం ప్రత్యక్ష వాటాను కలిగి ఉన్న అలీబాబా తొలుత ఈ జనవరిలో 3.1 శాతం వాటాను విక్రయించింది. కాగా.. గ్రూప్ సంస్థ యాంట్(ఏఎన్‌టీ) ఫైనాన్షియల్ ద్వారా పేటీఎమ్‌లో 25 శాతం వాటాను అలీబాబా కలిగి ఉన్న సంగతి తెలిసిందే. బ్లాక్‌డీల్ ద్వారా శుక్రవారం(10న) మొత్తం 2.8 కోట్ల పేటీఎమ్ షేర్లు విక్రయమైనట్లు తెలుస్తోంది. అలీబాబాతోపాటు ఇతరులు సైతం లాభాల స్వీకరణకు అమ్మకాలు చేపట్టి ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రూ. 645–655 ధరలో లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది.




బ్లాక్‌డీల్ నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 8% పతనమై రూ. 651 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 640 వరకూ క్షీణించింది.

ఎంఅండ్ఎం లాభం రూ. 1,528 కోట్లు

క్యూ3లో 14 శాతం అప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) రూ. 1,528 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 1,335 కోట్లతో పోలిస్తే ఇది సుమారు 14 శాతం అధికం. ఇక క్యూ3లో ఆదాయం రూ. 15,349 కోట్ల నుంచి సుమారు 41 శాతం వృద్ధి చెంది రూ. 21,654 కోట్లకు చేరింది. ఆటో విభాగం, ఫార్మ్ విభాగాలు మెరుగైన పనితీరు కొనసాగిస్తున్నాయని శుక్రవారమిక్కడ ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా ఎంఅండ్ఎం ఎండీ అనీష్ షా చెప్పారు. నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపర్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని కంపెనీ ఈడీ రాజేశ్ జెజూరికర్ తెలిపారు. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన మహీంద్రా గ్రూప్ నికర లాభం 34 శాతం పెరిగి రూ. 2,677 కోట్లకు చేరింది. ఆదాయం రూ. 23,594 కోట్ల నుంచి రూ. 30,620 కోట్లకు ఎగిసింది. కాగా, జహీరాబాద్ ప్లాంటులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రానికి సంబంధించిన పనులు వచ్చే రెండు, మూడు నెలల్లో ప్రారంభమవుతాయని జెజూరికర్ తెలిపారు. సుమారు రెండేళ్లలో యూనిట్ పూర్తిగా అందుబాటులోకి రాగలదన్నారు.



సినిమా





• ప్రత్యేక పూజలు చేస్తున్న తమన్నా

ఆ భయాలు తగ్గాయి!

వీలు కుదిరినప్పుడల్లా కొన్ని రోజులు ఆధ్యాత్మిక యాత్రలకు వెళుతున్నారు తమన్నా. గత ఏడాది వైష్ణవీ దేవి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఇటీవల ఆమె హిమాలయాలకు వెళ్లి అక్కడి వైష్ణవి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తమన్నా కాషాయ వస్త్రాలు ధరించారు. ఈ హిమాలయా యాత్రకు సంబంధించిన ఓ వీడియోను తమన్నా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''ఓ ఆహ్వానం మేరకు హిమాలయాలకు వచ్చాను. ఇక్కడి లింగభైరవి దేవి ఆలయాన్ని సందర్శించి, పూజలు చేశాను. నాకు ప్రశాంతతతో కూడిన మానసిక ఉల్లాసం కలిగింది. జీవితం, అపజయాలు, మరణం పట్ల నెలకొని ఉండే భయాలు తగ్గాయనిపిస్తోంది. లింగభైరవి దేవి విగ్రహం నా ఇంట్లో కూడా ఉంటే బాగుంటుందని అనిపించింది'' అని పేర్కొన్నారు తమన్నా. ఇక సినిమాల విషయానికొస్తే.. రజనీకాంత్ 'జైలర్', చిరంజీవి 'భోళా శంకర్', దిలీప్ 'బాంద్రా' సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె.



• 'శాకుంతలం' పోస్టర్

వేసవిలో శాకుంతలం

కాళిదాసు రచించిన ప్రేమకావ్యం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా రూపొందిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో దుష్యంత మహారాజుగా మలయాళ నటుడు దేవ్ మోహన్, శకుంతలగా సమంత నటించారు. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, గౌతమి, మధుబాల కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన 'శాకుంతలం' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. కాగా ఏప్రిల్ 14న 'శాకుంతలం'ని విడుదల చేయనున్నట్లు శుక్రవారం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించి, చిత్రంలోని కీలక పాత్రధారులతో పోస్టర్‌ను విడుదల చేశారు. తెలుగు, తమిళ్, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ''మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని విజువల్‌గానే కాకుండా మ్యూజికల్‌గానూ ఆడియన్స్‌కు అద్భుతమైన అనుభూతిని ఇచ్చేందుకు హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్ రీ రికార్డింగ్ చేస్తున్నారు. అల్లు అర్జున్‌గారి కుమార్తె అల్లు అర్హ చేసిన యువరాజు భరతుడి పాత్ర ఈ సినిమాకి ఓ హైలైట్‌గా నిలుస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



• శ్రుతీహాసన్

ఆద్య ఆన్ సెట్

'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాల సక్సెస్ జోష్‌తో రెట్టింపు ఉత్సాహంతో వర్క్ చేస్తున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఇటీవలే ఇంగ్లిష్ ఫిల్మ్ 'ది ఐ' షూటింగ్‌ను దాదాపు పూర్తి చేసిన ఈ బ్యూటీ తాజాగా 'సలార్' సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ''నాకు ఎంతో ఇష్టమైన 'సలార్' సెట్స్‌లో ఉన్నాను. మంచి యూనిట్‌తో, మంచి మనుషులతో వర్క్ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్' రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆద్య పాత్రలో కనిపిస్తారు శ్రుతి. ప్రస్తుతం ప్రభాస్, శ్రుతీలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఈ చిత్రం సెప్టెంబరు 28న విడుదల కానుంది. కాగా 'సలార్' రెండు భాగాలుగా రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది.

సంజయ్.. అనుపమ.. బెస్ట్ ఫ్రెండ్స్ అహో...



• మాళవిక, నాగశౌర్య, అవసరాల శ్రీనివాస్

'ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.. సంజయ్ పీసుపాటి (నాగశౌర్య) మరియు అనుపమ కస్తూరి (మాళవిక) బెస్ట్ ఫ్రెండ్స్ అహో' అనే డైలాగ్‌తో 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' టీజర్ విడుదలైంది. నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ చిత్రం మార్చి 17న రిలీజ్ కానున్న సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. నాగశౌర్య మాట్లాడుతూ– ''శ్రీనివాస్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల్లా 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది'' అన్నారు. ''మన చుట్టూ ఉండే మనుషుల మధ్య జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు శ్రీనివాస్ అవసరాల. కెమెరామేన్ సునీల్ కుమార్ నామ, సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, పాటల రచయితలు భాస్కరభట్ల, లక్ష్మీభూపాల, ఎడిటర్ కిరణ్ గంటి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బ్లాక్ బస్టర్ ఇవ్వండి - కార్తికేయ

''నేను నటించిన గత సినిమాల్లో జరిగిన తప్పులు 'బెదురులంక 2012'లో జరగకుండా చూసుకున్నా. ఈ సినిమాను సపోర్ట్ చేసి, నాకు ఒక్క బ్లాక్ బస్టర్ ఇవ్వండి.. థ్యాంక్యూ'' అని హీరో కార్తికేయ అన్నారు. క్లాక్స్ దర్శకత్వంలో కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్తికేయ మాట్లాడుతూ–''ప్రేక్షకులను థియేటర్లకు రప్పించే సినిమా అవుతుందనే నమ్మకంతో ఈ మూవీ చేశా.. బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. ''త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు బెన్నీ ముప్పానేని. ''నాకు తొలి చాన్స్ ఇచ్చిన నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు క్లాక్స్.



• క్లాక్స్, కార్తికేయ, నేహా శెట్టి, రవీంద్ర బెనర్జీ

అది కృష్ణారెడ్డిగారికే చెల్లింది

- గోపీచంద్ మలినేని



• అచ్చిరెడ్డి, గోపీచంద్ మలినేని, ఎస్వీ కృష్ణారెడ్డి, సి. కల్యాణ్, కల్పన

''దర్శకత్వం అంటేనే చాలా ఒత్తిడితో కూడిన క్రియేటివ్ వర్క్. అంత టెన్షన్‌లోనూ తన ప్రతి సినిమాకి స్వయంగా సంగీతం అందించడం కృష్ణారెడ్డిగారికే చెల్లింది. దర్శకుల పేరు చూసి సినిమాకు వెళ్లే ట్రెండ్‌ను సృష్టించిన అతికొద్ది మందిలో కృష్ణారెడ్డిగారు ఒకరు'' అన్నారు డైరెక్టర్ గోపీచంద్ మలినేని. డా. రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో, సోహైల్, మృణాళిని జంటగా ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించారు. ఈ చిత్రంలోని 'నమ్మకోరా.. నమ్ము కోరా..' అంటూ సాగే పాటని గోపీచంద్ మలినేని విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని రేవంత్ ఆలపించారు. ''ఈ మూవీ సూపర్ హిట్టవుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు సి. కల్యాణ్. ''మంచి ఫ్యామిలీ డ్రామాతో పాటు ఈ చిత్రంలో ఒక సందేశం ఉంటుంది. మార్చిలో రానున్న ఈ సినిమా హిట్ అవుతుంది'' అన్నారు కె. అచ్చిరెడ్డి. ''హిలేరియస్ కామెడీ, ఫ్యామిలీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. ఈ సినిమా చూసి ప్రేక్షకులు కొట్టే చప్పట్ల కోసం ఎదురు చూస్తున్నాను. ఈ సినిమాకు తొలిసారి డైలాగ్స్ రాశాను'' అని ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు.

సనాతన్ లక్ష్యం



• ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. మిషా నారంగ్ హీరోయిన్. శివశంకర్ దేవ్ దర్శకత్వంలో అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 10న విడుదల కానుంది. ట్రైలర్‌ని శుక్రవారం విడుదల చేశారు. కార్పొరేట్ లీడర్ విక్రమ్ చక్రవర్తి హత్యను ఛేదించడమే లక్ష్యంగా సీఎస్ఐ (క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్) సనాతన్ ఐదుగురు నిందితులను విచారించడం ఈ ట్రైలర్‌లో కనబడుతుంది. ఐదుగురూ ఐదు రకాలుగా చెబుతారు. 'నిజాన్ని అస్సలు ఊహించలేము' అని సనాతన్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ సాగుతుంది. ''మర్డర్ మిస్టరీగా రూపొందించిన ఈ చిత్రం ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అని నిర్మాత అజయ్ శ్రీనివాస్ అన్నారు.

ఫుల్ కామెడీ



• సన్నీ

'బిగ్ బాస్' తెలుగు 5 సీజన్ విజేత వీజే సన్నీ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. రచయిత సంజయ్ దర్శకత్వంలో ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''చక్కని వినోదం నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. శుక్రవారమే రెగ్యులర్ షూటింగ్ ఆరంభించాం.. సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయనున్నాం'' అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. శివన్నారాయణ, శైలజ ప్రియ, సప్తగిరి, రేఖ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్రీనివాస్ రెడ్డి, సంగీతం: మదీన్, దర్శకత్వ పర్యవేక్షణ: వి. జయశంకర్.

పులి వస్తోంది



• పూనమ్ బజ్వా

సిజు విల్సన్ లీడ్ రోల్‌లో కాయాదు లోహర్ హీరోయిన్‌గా తెరకెక్కిన మలయాళ చిత్రం 'పాథోన్‌పథం నూట్టాండు'. వినయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత సెప్టెంబరులో విడుదలైంది. ఈ చిత్రాన్ని 'పులి.. ది పంతొమ్మిదవ సెంచురీ' పేరుతో సీహెచ్ సుధాకర్ బాబు తెలుగులో ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ''యాక్షన్ పీరియాడికల్ డ్రామాగా రూపొందిన చిత్రమిది. తెలుగు టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు సీహెచ్ సుధాకర్ బాబు. అనూప్ మీనన్, పూనమ్ బజ్వా ఇతర పాత్రలు చేసిన ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్.కె. రామచంద్ర నాయక్.

కృష్ణగాడి లవ్‌స్టోరీ



• విస్మయ, రిషి

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. రాజేష్ దొండపాటి దర్శకత్వంలో ఈ సినిమాను పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వీవీ వినాయక్ రిలీజ్ చేసి, ఆసక్తికరంగా ఉందన్నారు. ''ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సాబు వర్గీస్ సంగీతం, ఎస్కే రఫీ కెమెరా వర్క్ హైలైట్‌గా నిలుస్తాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: చుంచు భాను ప్రకాష్, హరిహర ప్రసాద్ పెట్లా.

క్లుప్తంగా...

ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నర్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఎస్ఎస్ఎల్వీ–డీ2 రాకెట్ ప్రయోగం విజయవంతమవడంపై గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రాకెట్ ప్రయోగం ద్వారా మూడు ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా ఇస్రో భారత దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసిందని పేర్కొన్నారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో మరో మైలురాయిగా గవర్నర్ పేర్కొన్నారని రాజ్‌భవన్ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఎస్ఎస్ఎల్వీ డీ2 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మూడు ఉపగ్రహాలను ఒకేసారి విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంపై సైంటిస్టులను సీఎం జగన్ అభినందించారు. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆజాదీ శాట్-2ను రూపొందించిన 'ప్రభుత్వ' విద్యార్థినులు

- తిరుపతి జిల్లా నారయణవనం విద్యార్థినులకూ భాగస్వామ్యం



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ఎస్ఎస్ఎల్వీ డీ2 ప్రయోగం ద్వారా ఇస్రో అంతరిక్షంలోకి పంపించిన ఆజాదీశాట్–2 ఉపగ్రహాన్ని పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులే తయారు చేశారు. అంతరిక్ష ప్రయోగాలపై విద్యార్థి దశనుంచే అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న 75 పాఠశాలలను.. వాటిలో విద్యనభ్యసిస్తున్న 750 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. చెన్నైకి చెందిన స్పేస్ కిడ్ ఇండియా సీఈవో కేశన్ ఆధ్వర్యంలో ఈ విద్యార్థినులు ఆజాదీశాట్–2ను రూపొందించారు. ఇందులో తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం నారాయణవనం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు కూడా భాగస్వాములయ్యారు. స్పేస్ కిడ్ ఇండియాలో భాగంగా విద్యార్థినులంతా 6 నెలలు పాటు శ్రమించి రూ.86 లక్షల ఖర్చుతో ఈ బుల్లి ఉపగ్రహాన్ని తయారుచేశారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ2 ప్రయోగం
విజయవంతం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్(ఎస్ఎస్ఎల్వీ–డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9.18 గంటలకు ప్రయోగించిన ఎస్ఎస్ఎల్వీ–డీ2 రాకెట్ ద్వారా 156.3 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్ 07), దేశవ్యాప్తంగా 750 మంది విద్యార్థినులు తయారు చేసిన 8.7 కేజీల బరువు కలిగిన ఆజాదీశాట్, అంటారిస్ సంస్థ–యూఎస్ఏకు చెందిన 10.2 కిలోల బరువైన జానుస్–1 అనే మూడు ఉపగ్రహాలను నిర్దేశిత సమయంలోనే నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. గత ఏడాది ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ–డీ1 ప్రయోగం విఫలం కావడంతో ఈ ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు తీవ్రంగా శ్రమించారు. శుక్రవారం తెల్లవారుజామును 2.48 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఉదయం 9.18 గంటలకు ఎస్ఎస్ఎల్వీ–డీ2 నిప్పులు చిమ్ముతూ నింగి వైపునకు దూసుకెళ్లింది. ఈ విజయంతో ఇస్రోకు వాణిజ్యపరమైన అవకాశాలు పెరగనున్నాయి.

15.38 నిమిషాల్లో...

ఎస్ఎస్ఎల్వీ–డీ2 ప్రయోగం 15.38 నిమిషాల్లో పూర్తయ్యింది. ఈ రాకెట్ పొడవు 34 మీటర్లు, వెడల్పు 2 మీటర్లు, బరువు 119 టన్నులు. 4 దశల్లో ప్రయోగం పూర్తయ్యింది. కక్ష్యలోకి చేరిన ఉపగ్రహాల నుంచి సిగ్నల్స్ అందడంతో శాస్త్రవేత్తలు ఊపిరి పీల్చుకున్నారు. 'ఇస్రో' ఈ కొత్త రాకెట్‌ను రూపొందించి, ప్రయోగించి చరిత్ర సృష్టించింది.

సరికొత్త రాకెట్

ఎస్ఎస్ఎల్వీ–డీ2 ప్రయోగం విజయవంతమైన అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. ఇప్పటిదాకా ఇస్రో అమ్ములపొదిలో ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మార్క్3 లాంటి ఐదు రకాల రాకెట్లు ఉండేవని, ఈ ప్రయోగంతో ఆరో రాకెట్‌గా ఎస్ఎస్ఎల్వీ చేరిందన్నారు. ప్రయోగం విజయవంతం కావడానికి శ్రమించిన ఇస్రో సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్ 07) ఉపగ్రహం భూమికి తక్కువ ఎత్తులో ఉండి అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలతో సంక్షిప్తమైన సమాచారాన్ని అందిస్తుందని శాటిలైట్ డైరెక్టర్ రవిచంద్ర బాబు వెల్లడించారు. ఈ ఉపగ్రహం కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే సేవలను అందిస్తుందని పేర్కొన్నారు.

విశాఖ సదస్సుకు కేంద్రమంత్రులకు ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు రావాలని పలువురు కేంద్రమంత్రుల్ని ఏపీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బుగ్గన రాజేంద్రనాథ్‌లు ఆహ్వానించారు. శుక్రవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి వీకే సింగ్, విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ చేసిన రంగాల గురించి ఆయా మంత్రులకు వివరించి సహకారమందించాలని కోరారు. పలువురు రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.




కేంద్రమంత్రులు ఆర్కే సింగ్, సింధియాలను ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రులు బుగ్గన, అమర్‌నాథ్

చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామాల కోసం

- భువనేశ్వర్‌లో వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: చిన్న పిల్లలకు ఆహ్లాదం కలిగించేలా గ్రామాల్లో ప్రత్యేకంగా ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలన్న దానిపై కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు 'చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ'ల రూపకల్పనపై చర్చించేందుకు ఈ నెల 17,18, 19 తేదీల్లో ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించనుంది. దేశం మొత్తంలో గ్రామాల్లో ఇప్పటికే అమలు చేస్తున్న అద్భుత విధానాలను ఈ సందర్భంగా ప్రతినిధులకు వివరిస్తారు. రాష్ట్ర ప్రతినిధులుగా హాజరయ్యేందుకు నాలుగు గ్రామ పంచాయతీల నుంచి ఆయా గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఎంపిక చేసింది. వారితో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఏపీఎస్ఐఆర్‌డీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్) అధికారులు హాజరు కానున్నారు. 'వుమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ' అంశంపైనా వర్క్‌షాప్‌లో చర్చకు వస్తుందని అధికారులు వెల్లడించారు.

తెలంగాణ

వందేభారత్ రైలుపై రాళ్లదాడి

- మహబూబాబాద్ సమీపంలో ఘటన

మహబూబాబాద్ రూరల్/కాశిబుగ్గ: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న వందేభారత్ రైలుపై మహబూబాబాద్ సమీపంలో గుర్తు తెలియని యువకులు శుక్రవారం సాయంత్రం రాళ్లతో దాడి చేశారు. దీంతో రెండు కోచ్‌ల అద్దాలు పగిలిపోయాయి. వందేభారత్ (నంబర్ 20834) రైలు సాయంత్రం 5.40 గంటలకు మహబూబాబాద్ దాటి గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న క్రమంలో.. సూర్య థియేటర్ ప్రాంతంలో మూసివేసిన రైల్వే గేటు సమీపం నుంచి గుర్తు తెలియని యువకులు రాళ్లు విసిరారు. రాళ్లు సీ–4, సీ–8 కోచ్‌లపై పడ్డాయి. రాళ్లు తగలడంతో సీ–4 కోచ్‌లోని 34, 35 సీట్లు, సీ–8 కోచ్‌లోని 40, 41, 42 సీట్ల సమీపంలో అద్దాలు పగిలాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. రైలు మాత్రం ఆగకుండా యధావిధిగా ఖమ్మం వైపు వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న కాజీపేట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వరంగల్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టీఎస్ఆర్ కృష్ణలు ఘటనా స్థలానికి చేరుకుని ఆకతాయిల వివరాలు సేకరించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్ | లోక్‌సభ

మంగళగిరి ఎయిమ్స్‌లోనూ క్యాన్సర్‌కు చికిత్స

- లోక్‌సభలో కేంద్రం ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: మంగళగిరి, బీబీనగర్ సహా 22 నూతన ఎయిమ్స్‌ల్లోనూ క్యాన్సర్ చికిత్స అందించడానికి అనుమతించామని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా క్యాన్సర్ రోగులకు పెద్ద నగరాల వెలుపలా చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి విన్నవించారు.

ఏబీ–పీఎంజేఏవైలో 1.07 కోట్ల లబ్ధిదారులు

ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై)లో ఫిబ్రవరి 2 నాటికి 1.07 కోట్ల మంది లబ్ధిదారులున్నారని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. లబ్ధిదారులకు కార్డులు అందజేయడానికి ఏపీ క్షేత్రస్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు బాలశౌరి, శ్రీకృష్ణదేవరాయల ప్రశ్నలకు శుక్రవారం లోక్‌సభలో ఆమె లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

నేషనల్ హెల్త్ మిషన్‌కు నిధులు..

ఆంధ్రప్రదేశ్‌లో 11,554 పీహెచ్‌సీ, ఎస్‌హెచ్‌సీ, యూపీహెచ్‌సీలు ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఢిల్లీ వెలుపల బెంచ్‌లు సమర్థనీయం కాదు..

ఢిల్లీ వెలుపల సుప్రీంకోర్టు బెంచ్‌లు సమర్థనీయం కాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొందని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 14 ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులకు 2020–21 ఆర్థిక సంవత్సరం నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు నిధులేమీ విడుదల చేయలేదని కిరణ్ రిజిజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కాగా రైతులకు సరసమైన ధరలకే డీ అమ్మోనియం ఫాస్పేట్ (డీఏపీ), యూరియా అందిస్తామని కేంద్రం తెలిపింది. ఈ మేరకు లోక్‌సభలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చింది.

రాజ్యసభ

రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.106.89 కోట్లు

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణ కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రూ.106.89 కోట్లు అంచనా వ్యయం కింద అనుమతించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు శుక్రవారం రాజ్యసభలో మంత్రి సమాధానమిచ్చారు.

రైళ్లలో అత్యవసర మందులతో ఫస్ట్ ఎయిడ్

రైలు ప్రయాణికులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు దేశంలోని అన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లలో అత్యవసర మందులు, మెడికల్ సామగ్రి, ఆక్సిజన్ సిలిండర్ కలిగిన మెడికల్ బాక్స్‌లను ఏర్పాటు చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు ఫస్ట్ ఎయిడ్ సేవలు అందించేలా ట్రైన్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ), ట్రైన్ గార్డులు, సూపరింటెండెంట్‌లు, స్టేషన్ మాస్టర్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

బీఐఎస్ ఆమోదం లేని బొమ్మల తయారీపై చర్యలు..

బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి తెలిపారు. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. బీఐఎస్ ఆమోదం లేకుండా బొమ్మలు తయారు చేస్తున్న వారిపై దాడులు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నట్లు వివరించారు.

ఏపీ సహా పలు రాష్ట్రాల్లో బీపీకేపీ

ఆంధ్రప్రదేశ్ సహా ఎనిమిది రాష్ట్రాల్లో భారతీయ ప్రాకృతిక్ క్రిషి పద్ధతి (బీపీకేపీ) పథకం అమలులో ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి తోమర్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో సెంట్రల్ స్టోరేజీ సామర్థ్యం 9.49 లక్షల మెట్రిక్ టన్నులు..

ఆంధ్రప్రదేశ్‌లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోదాముల సెంట్రల్ స్టోరేజీ సామర్థ్యం సొంతవి, అద్దెవి కలిపి 9.49 లక్షల మెట్రిక్ టన్నులని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

ఏపీలో 8 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి

ఏపీ 8 ఫిషింగ్ హార్బర్‌లు, 3 ఫిష్ లాండింగ్ సెంటర్‌ల అభివృద్ధికి కేంద్ర మత్స్యశాఖ నిధులు విడుదల చేసిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాలా తెలిపారు. టీడీపీ ఎంపీ కనకమేడల అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

గ్రూప్స్‌పై గురి పెట్టారు

లక్ష్యం వైపు దూసుకుపోతున్న గిరిజన యువత

- ఏజెన్సీలోని పేద గిరిజన పట్టభద్రులకు ప్రభుత్వం చేయూత
- ఐటీడీఏ ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- గ్రూప్–1 మెయిన్స్‌కు అర్హత సాధించిన 12 మంది
- 2022 ఏప్రిల్ నుంచి తరగతులు ప్రారంభించిన ఐటీడీఏ
- తొలి బ్యాచ్‌లోనే ఉత్తమ ఫలితాలు సాధించిన శిక్షణ కేంద్రం



తరగతి గదిలో శిక్షణలో నిమగ్నమైన యువత

సాక్షి, విశాఖపట్నం: వారంతా అడవి తల్లి బిడ్డలు. కొండ లెక్కితే కానీ.. బడి కనిపించని ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి.. ఉన్నత విద్య గురించి ఆలోచించడమే కష్టం. అలాంటి వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దీటుగా శిక్షణ అందించింది. దాంతో తాము గురిపెట్టిన గ్రూప్స్‌లో మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు. ఏకంగా 12 మంది గిరిజన యువత తమ కలల్ని సాకారం చేసుకునేందుకు సుశిక్షితులవుతున్నారు. సివిల్స్, గ్రూప్స్, ఎస్ఎస్‌సీ, ఐబీపీఎస్.. ఇలా ఉన్నత ఉద్యోగాలు సాధించాలనుకునే యువత కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించింది. విశాఖ నగరం వేపగుంటలో ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్(వైటీసీ)లో 2022 ఏప్రిల్ 21న శిక్షణ తరగతులు ప్రారంభించారు.

45 మందితో తొలి బ్యాచ్

కలెక్టర్ మల్లికార్జున ఏజెన్సీలో పర్యటిస్తున్న సమయంలో కొందరు యువతీ యువకులు తమకు గొప్ప ఉద్యోగాలు చేయాలని ఉందని.. సరైన ప్రోత్సాహం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ రోణంకి గోపాలకృష్ణ రూపొందించిన కార్యక్రమంపై ఇరువురూ చర్చించి వేపగుంటలో నిరుపయోగంగా ఉన్న వైటీసీలో శిక్షణ తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. శిక్షణ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా.. 6 వేల మంది గిరిజన యువ పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ సివిల్స్ తరహాలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో 45 మందితో తొలి బ్యాచ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో 16 మంది అమ్మాయిలు. ఇక్కడ రోజుకు 16 గంటల పాటు కోచింగ్ ఇస్తూ.. విద్యార్థుల్ని రాటుదేలేలా చేశారు. వీరిలో ఎస్.శ్రీనివాస్, బీ.శ్రీహరినాయుడు, కె.సూర్యప్రకాష్, వి.గోపీచంద్, డి.జయరాం, టి.భాస్కర్, ఎ.ఉమాసాయి, ఎస్.ఇంద్రకుమారి, ఏబీఎస్ కీర్తి, కె.ఝాన్సీ, టి.ఉదయభాను, బి.నవ్య మెయిన్స్‌కు అర్హత సాధించారు. సివిల్స్ కోచింగ్ ప్రధాన లక్ష్యంగా.. గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలు తదుపరి టార్గెట్‌గా శిక్షణ తరగతులు అందించారు.

అత్యాధునిక సౌకర్యాలతో వైటీసీ

కేవలం తరగతులు నిర్వహణకే పరిమితం చేయకుండా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థికి అవసరమైన ప్రతి ఒక్కటి వైటీసీలో సమకూర్చారు. డిజిటల్ క్లాసులు, 250కి పైగా పుస్తకాలతో లైబ్రరీ, వసతి సౌకర్యం, అబ్బాయిలు, అమ్మాయిలకు వేర్వేరుగా స్టడీ రూమ్‌లు, డార్మెటరీ, డైనింగ్ రూమ్స్, స్టడీ మెటీరియల్, ఆన్‌లైన్‌లో క్లాసులు వినేందుకు వైఫై సౌకర్యం, అవసరమైన మెటీరియల్‌ని ప్రింట్స్ తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఆరోగ్యంగా ఉండేలా ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్‌ని కూడా నియమించారు. పూర్తి పోషకాలతో కూడిన రుచికరమైన మెనూతో భోజన సౌకర్యాన్ని అందిస్తున్నారు.



మెయిన్స్‌కు అర్హత సాధించిన గిరిజన యువత



అమ్మాయిల రీడింగ్ రూమ్



అబ్బాయిల రీడింగ్ రూమ్

ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ఆకాంక్ష



ప్రతి గిరిజన విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష. దాన్ని సుసాధ్యం చేసేందుకు ఐటీడీఏ అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. 9 నెలల కాలంలో 3 వేల గంటలు శిక్షణ అందించేలా మొదటి బ్యాచ్‌ని ఎంపిక చేశాం. తొలి ప్రయత్నంలోనే మంచి ఫలితాలు సాధించాం. భవిష్యత్‌లోనూ ఈ కోచింగ్ ప్రక్రియ కొనసాగిస్తాం. సివిల్స్‌లోనూ ర్యాంకులు సాధించేలా విద్యార్థులకు పూర్తి సహకారం అందిస్తున్నాం.
– రోణంకి గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో

మెయిన్స్ కోసం స్పెషలిస్టులతో శిక్షణ



ప్రణాళికబద్ధంగా తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించాం. ఢిల్లీలో సివిల్స్‌కి కోచింగ్ తీసుకుంటున్న వారికి ఎలాంటి వసతులు, వనరులు ఉంటాయో అవన్నీ ఇక్కడ అందుబాటులోకి దాదాపు తీసుకొచ్చాం. వీరంతా గ్రూప్–1, సివిల్స్ కోసం పట్టుబట్టి చదువుతున్నారు. మెయిన్స్‌కి ఎంపికైన వారికి యూపీఎస్సీ నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.
– రమాదేవి, ఫీమేల్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జి, వైటీసీ

మా జీవితాలకు వెలుగు రేఖ



పాడేరు ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాను. తర్వాత మంచి ఉద్యోగం సాధించాలని ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. నాన్న వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పూర్తిగా తెలుగు మీడియంలో చదివిన నాకు ఇంగ్లిష్‌లో ఉన్న సబ్జెక్ట్ చూసి భయం వేసింది. ఫ్యాకల్టీ ధైర్యం చెప్పారు. నెమ్మదిగా పుంజుకుని మెయిన్స్‌కు అర్హత సాధించాను. మా జీవితాలకు వెలుగురేఖలా ఐటీడీఏ మారింది.
– సంతారి ఇంద్రకుమారి, గొందిపేట, హుకుంపేట మండలం

యాప్.. ఏజ్ గ్యాప్!

భారత్‌లో వయసుల వారీగా మారుతున్న యాప్‌ల ప్రాధాన్యతలు

- 24 ఏళ్లలోపు యువతరం ఇన్‌స్టా, ట్రూకాలర్, ఫ్లిప్‌కార్ట్, ఎంఎక్స్ ప్లేయర్, టెలిగ్రామ్‌ల వినియోగం
- 25 ఏళ్లుపైన వారు వాట్సాప్, ఫేస్‌బుక్, ఫోన్‌పే, అమెజాన్, ఫేస్‌బుక్ మెసెంజర్ల వైపు మొగ్గు
- మహిళలు, పురుషులు ఉపయోగించే యాప్‌లూ వేరే..
- ఫోన్ వాడే సమయంలో 88శాతం యాప్‌లలోనే గడుపుతున్న తీరు
- ప్రపంచవ్యాప్తంగా 630 కోట్ల స్మార్ట్‌ఫోన్ యూజర్లు



సాక్షి, హైదరాబాద్: కొందరికి బిర్యానీ ఇష్టం.. ఇంకొందరికి వంకాయ అంటే మధురం.. మరికొందరికి పప్పన్నమే అమృతం.. ఇలా ఇష్టాలు మరెన్నో.. అదీ దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, గ్రామాల వారీగా భిన్నంగా ఉంటుంది. అందుకే 'లోకో భిన్న రుచి' అన్న సామెత పుట్టింది. మరి ఒక్క భోజనం విషయంలోనేనా.. అన్ని వ్యవహారాలకూ ఈ నానుడి వర్తిస్తుంది. ఇది తేల్చేందుకే ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్లు, యాప్‌ల వినియోగంపై వివిధ అధ్యయనాలు జరిగాయి. అన్ని అధ్యయనాలూ కొంచెం అటూఇటూగా ఒకే తరహా ఫలితాలను ఇవ్వడం గమనార్హం. అన్నీ కూడా లోకా 'మొబైల్ యాప్స్' భిన్న రుచీ అన్నట్టుగా నివేదికలు ఇచ్చేశాయి మరి.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 630 కోట్ల మందికిపైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉన్నట్టు అంచనా. దీనికి తగ్గట్టుగానే మొబైల్ అప్లికేషన్స్ (యాప్స్) భారీగా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో ఫోన్లు, యాప్‌ల వినియోగం బాగా ఎక్కువైంది. ఆఫీసులో, ఇంట్లో, వీధిలో, బెడ్‌పై ఉన్నా, భోజనం చేస్తున్నా, వాహనాల్లో ఉన్నా ఫోన్లను ఉపయోగించడం పెరిగిపోయింది. అయితే ఇందులో ఫోన్ మాట్లాడటానికి వినియోగించే సమయం తక్కువేనని.. 88శాతం సమయాన్ని యాప్స్‌లోనే గడుపుతున్నారని అధ్యయనాల్లో వెల్లడైంది. ఇక తరచూ ఫోన్ చెక్ చేసుకోవడం కూడా బాగా పెరిగిపోయినట్టు తేలింది. ఉదాహరణకు అమెరికన్లు సగటున రోజూ 262 సార్లు అంటే ప్రతి ఐదున్నర నిమిషాలకోసారి తమ ఫోన్‌ను చెక్ చేసుకుంటున్నట్టు వెల్లడైంది.

భారత్ విషయానికొస్తే..

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ట్రెండ్లకు భిన్నంగా మనదేశంలో వయసు వారీగా యాప్‌ల వినియోగంలో ప్రాధాన్యతలు వేరుగా ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా 18–24 ఏళ్ల మధ్యవారు తమ మొబైల్స్‌లో గడిపే సమయం, వినియోగించే యాప్‌లకు.. 25ఏళ్లు, ఆపైనవారి అభిరుచులు, ప్రాధాన్యతలకు భిన్నంగా ఉన్నట్టు వెల్లడైంది.

- 24 ఏళ్లలోపు యువతరం ఇన్‌స్టా, ట్రూకాలర్, ఫ్లిప్‌కార్ట్, ఎంఎక్స్ ప్లేయర్, టెలిగ్రామ్‌లను అధికంగా వినియోగిస్తున్నారు.
- 25 ఏళ్లు, ఆపై వయసు వారు వాట్సాప్, ఫేస్‌బుక్, ఫోన్‌పే, అమెజాన్, ఫేస్‌బుక్ మెసెంజర్ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.
- మహిళలు ఉపయోగించే టాప్–5 యాప్‌లలో వాట్సాప్, స్నాప్‌చాట్, మీషో, షేర్‌చాట్, మోజో ఉన్నాయి.
- పురుషులు ఎక్కువగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్రూకాలర్, ఫోన్‌పే, అమెజాన్‌లను వినియోగిస్తున్నారు.

వివిధ అధ్యయనాలు, పరిశీలనల్లో తేలినది ఇదీ..

- 24 ఏళ్లలోపు యువతరంలో 21శాతం రోజుకు యాభైకంటే ఎక్కువసార్లు ఒక యాప్‌ను ఓపెన్ చేస్తున్నారు.
- 49 శాతం వినియోగదారులు రోజుకు 11 సార్లు యాప్‌లను తెరుస్తున్నారు.
- సగటు స్మార్ట్‌ఫోన్ యూజర్ రోజుకు 10 యాప్‌లను.. నెలకు 30 యాప్‌లను ఉపయోగిస్తున్నారు.
- గతేడాది మొత్తంగా 219 బిలియన్ల యాప్‌లను స్మార్ట్ ఫోన్ యూజర్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు.
- యాపిల్ యాప్ స్టోర్‌లో 1.96 మిలియన్ల యాప్‌లు, గూగుల్ ప్లేస్టోర్ లో 2.87 మిలియన్ల యాప్‌లు ఉన్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా అధిక శాతం యాప్ డౌన్‌లోడ్లు ఉచితంగానే జరుగుతున్నాయి.
- సగటున ఒక్కో వ్యక్తి తమ ఫోన్‌లో 80 దాకా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. వీటిలో 62 శాతం యాప్‌లను నెలలో ఒకసారి కూడా ఉపయోగించడం లేదు
- 2023లో మొబైల్ యాప్స్ ద్వారా 935 బిలియన్ డాలర్ల రెవెన్యూ జనరేట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.